www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 6-5-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 24 సంచిక (Issue) : 59 | శ్రీ పరాభవ నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: చవితి ఉ.7.52 తదుపరి పంచమి, నక్షత్రం: మూల మ.3.54 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: మ.2.06-3.54 తదుపరి రా.2.38-4.26, దుర్ముహూర్తం: ఉ.11.46-12.37, అమృతఘడియలు: ఉ.8.42-10.30, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.50, సూర్యాస్తమయం: 6.33, | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఏపీ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు

సునీత, గిరిధర్, పురుషోత్తం కుమార్ పేర్లను సిఫారసు చేసిన సుప్రీం కోర్టు కొలీజియం

నియామకం పూర్తయితే 35కు చేరనున్న జడ్జీలు

13



విశాఖ రైల్వే స్టేషన్ ఎదుట టీడీపీ శ్రేణుల సంబరాలు

జోన్ వచ్చిందోచ్

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్.. గెజిట్ విడుదల

- జోన్, డివిజన్ల పరిధి స్పష్టీకరించిన కేంద్రం
- దక్షిణ మధ్య, తూర్పు కోస్తా రైల్వే జోన్లలోని కొన్ని భాగాలతో కొత్తగా దక్షిణ కోస్తా జోన్
- దీని పరిధిలోకి గుంతకల్, గుంటూరు, బెజవాడ, వాల్తేరు డివిజన్‌లోని కొన్ని భాగాలు
- రాయగడ, విశాఖ డివిజన్లుగా 'వాల్తేరు' విభజన
- నాలుగు దశాబ్దాల కల సాకారం
- భూమి అప్పగింతలో నాడు వైసీపీ నిర్లక్ష్యం
- కూటమి రాకతో జోన్‌కు ఎట్టకేలకు జోష్

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అనేది నాలుగు దశాబ్దాల కల. రైల్వే మంత్రిత్వ శాఖ సోమవారం రాత్రి విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌తో ఎట్టకేలకు అది సాకారమైంది. జూన్ ఒకటో తేదీ నుంచి విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభమవుతాయని ఆ గెజిట్‌లో కేంద్రం ప్రకటించింది. 'దక్షిణ కోస్తా జోన్' పేరుతో ఏర్పాటైన ఈ రైల్వే జోన్ కోసం

మిగతా 14వ పేజీలో...

ఆరోగ్య శాఖకు అవినీతి క్యాన్సర్

శస్త్రచికిత్స అనివార్యం.. అందరిదీ బాధ్యతారాహిత్యమే

- సీఎం జోక్యం చేసుకుంటేనే మార్పు.. కీలక అధికారి అవినీతి పరాకాష్ఠకు
- ఢిల్లీ కంపెనీలకు అత్యంత 'గౌర'వం.. అక్కడే కలెక్షన్లు.. ఆంధ్రాలో ఆర్డర్లు
- కార్పొరేషన్‌లో చెప్పిందే శాసనం.. సొమ్ములిస్తేనే టెండర్లు, బిల్లులు 9
- పరికరాల కొనుగోలులో నాణ్యతకు చెల్లు.. రూ.50 కోట్లకు పైగా వృథా

సర్కారు ఏర్పాటుకు

సై



గవర్నర్‌కు విజయ్ సమాచారం.. రేపు ఉదయం 11.30కి ప్రమాణం

- అవకాశమివ్వాలని గవర్నర్‌కు అభ్యర్థన
- ఆచితూచి స్పందించిన అర్లేకర్
- సంఖ్యాబలం చూపించాకే ఆహ్వానంపై నిర్ణయం
- విజయ్‌ని కలిసేదీ అప్పుడే అని స్పష్టీకరణ
- టీవీకే శాసనసభాపక్ష నేతగా విజయ్ ఎన్నిక
- మెజారిటీకి 10 సీట్ల దూరంలో ఆ పార్టీ
- కాంగ్రెస్, పీఎంకే, వీసీకే, లెఫ్ట్‌తో చర్చలు!
- మంత్రి పదవులిస్తామని హామీ
- విజయ్ మాతో మాట్లాడారు: వేణుగోపాల్
- సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా.. ఆమోదం

విజయ్ హామీలకు లక్ష కోట్లు కావాలి!

- ప్రభుత్వ ఖజానాపై అదనంగా పడనున్న భారం ఇదీ
- నిధులు ఎక్కడినుంచి వస్తాయని అధికారుల ఆందోళన
- హామీల అమలు అంత సులభం కాదని అభిప్రాయం
- ఇప్పటికే రూ.1.22 లక్షల కోట్ల ఆర్థిక లోటులో రాష్ట్రం

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు గురువారం ప్రమాణ స్వీకారానికి సిద్ధమవుతున్న టీవీకే అధిపతి విజయ్! మరోవైపు... తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల పూర్తి వివరాలు ఇస్తేనే 'ఆహ్వానం'పై నిర్ణయం తీసుకుంటానన్న గవర్నర్! హంగ్ ముంగిట నిలిచిన తమిళనాట నెలకొన్న ఆసక్తికర పరిణామమిది. ముఖ్యమంత్రిగా 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ గురువారం ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ ప్రకటించింది. పార్టీ శాసనసభా పక్షనేతగా ఎన్నికైన ఆయన బుధవారం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌తో సమావేశమవుతారని తెలిపింది. కానీ, అంతలోనే గవర్నర్ ఆయనకు ఝలక్ ఇచ్చారు. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను ఆహ్వానించాలని టీవీకే నేతలు కోరగా.. మద్దతిస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య తదితర వివరాలు అడిగానని, వాటి కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. ఆ వివరాలు సమర్పించాకే విజయ్‌తో భేటీ అవుతానని స్పష్టం చేశారు. అన్నీ పరిశీలించాకే తగిన నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఆ పార్టీ ప్రతినిధులెవరూ తనను కలువలేదన్నారు. "తమ పార్టీ ఎంత శాతం ఓట్లు సంపాదించిందన్న కొన్ని వివరాలు మాత్రమే నాకు పంపారు. అధికారికంగా అన్ని వివరాలతో లోక్‌భవన్ అధికారులను సంప్రదించాలని వారికి సూచించాను" అని చెప్పారు. ఆయన వ్యాఖ్యలపై టీవీకే స్పందించింది. గవర్నర్ అడిగిన వివరాలన్నీ

మిగతా 2వ పేజీలో...

రాజీనామా చేయను

మేం ఓడిపోలేదు..100 సీట్ల లూటీ



- మేం పోరాడింది బీజేపీతో కాదు.. ఈసీతో
- 32 లక్షల మంది ఓటర్లను తొలగించారు
- ఓట్ల లెక్కింపులో అక్రమాలకు పాల్పడ్డారు
- మళ్లీ పుంజుకుంటాం.. పోరాడతాం
- ఇండి కూటమిని బలోపేతం చేస్తా
- తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ
- అసెంబ్లీ రద్దుతో మమత పదవి పోయినట్లే
- గవర్నర్ డిస్మిస్ చేయవచ్చు: నిపుణులు

కోల్‌కతా, మే 5: పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమిపాలైనా.. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేందుకు మమతా బెనర్జీ నిరాకరించారు. ఈ ఎన్నికల్లో తాము ఓడిపోలేదని, రాజీనామా చేసే ప్రసక్తే లేదని అన్నారు. ఇది నిజమైన ప్రజాతీర్పు కాదని, కుట్ర చేశారని ఆరోపించారు. మంగళవారం మమత మీడియాతో మాట్లాడుతూ.. తాను లోక్‌భవన్‌కు వెళ్లబోనని, గవర్నర్‌కు రాజీనామా సమర్పించాల్సిన అవసరమే లేదని అన్నారు. ఎన్నికల్లో తాము పోరాడింది బీజేపీతో కాదని, ఎన్నికల కమిషన్‌తో పోరాడామని చెప్పారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భారీగా అవకతవకలకు పాల్పడ్డారని, దాదాపు 100 సీట్లను లూటీ చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషన్‌ను

మిగతా 11వ పేజీలో...

కొత్త సీఎం ఎవరు?

- రేసులో సువేందు, దిలీప్..
- పరిశీలనలో సమిక్, స్వపన్ పేర్లూ
- మహిళా నేతకూ చాన్స్?
- 9న కొత్త సర్కారు

మమత ఓటమిపై సంబరాలొద్దు

- శ్రేణులకు రాహుల్ హితవు
- బెంగాల్, అసోంలో ప్రజాస్వామ్యం ఖూనీ
- ప్రజాతీర్పును బీజేపీ అపహరించిందన్న నేత




కొళత్తూరు ప్రజలకు స్టాలిన్ అభివాదం

స్టాలిన్‌కు కొళత్తూరు కన్నీటి స్వాగతం

» ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు వెళ్లిన మాజీ సీఎం

చెన్నై, మే 5(ఆంధ్రజ్యోతి): తనకు ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పేందుకు వెళ్లిన డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌ను చూసి ప్రజలు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సాయంత్రం 5.45 గంటలకు కొళత్తూరు నియోజకవర్గానికి వెళ్లిన స్టాలిన్ వాహనంపై పలు ప్రధాన రహదారుల్లో పయనించారు. దారి పొడవునా మహిళలు, యువకులు చేతులెత్తి ఆయనకు నమస్కరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. కార్యకర్తలు డీఎంకే జెండాలు పట్టుకుని 'డీఎంకే వర్ధిల్లాలి, స్టాలిన్ వర్ధిల్లాలి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. తనను చూసి ఏడుస్తున్న పార్టీ శ్రేణులను అదుపుచేయడానికి స్టాలిన్ ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పార్టీ శ్రేణులను చూసి స్టాలిన్ కళ్లు కూడా చెమర్చాయి. స్టాలిన్ వెనుకే నిలిచిన మాజీ మంత్రి, హార్బర్ ఎమ్మెల్యే పీకే శేఖర్‌బాబు పార్టీ శ్రేణులు విలపించడాన్ని చూసి తట్టుకోలేక కన్నీటిపర్యంతమయ్యారు. ఇదిలా ఉండగా, డీఎంకే ఎమ్మెల్యేలు గురువారం సాయంత్రం 5 గంటలకు ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో భేటీ కానున్నారు. వారంతా తమ శాసనసభా పక్ష నేతను ఎన్నుకుంటారని డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

మూడు పార్టీలు.. ముగ్గురు ఎమ్మెల్యేలు!

» 'లాటరీ కింగ్' మార్టిన్ భార్య, కుమారుడు, అల్లుడి విజయం


జోస్ చార్లెస్, ఆదవ్ అర్జున, లీమా రోస్

చెన్నై, మే 5(ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో 'లాటరీ కింగ్'గా పేరొందిన మార్టిన్ కుటుంబానికి చెందిన ముగ్గురు వేర్వేరు పార్టీల తరపున అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించారు. విల్లివాక్కం నియోజకవర్గంలో టీవీకే తరపున బరిలోకి దిగిన మార్టిన్ అల్లుడు ఆదవ్ అర్జున 17,276 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. టీవీకేలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా మార్టిన్ సతీమణి అయిన లీమా రోస్ అన్నాడీఎంకే తరపున లాల్గుడి నియోజకవర్గం నుంచి గెలిచారు. మార్టిన్ కుమారుడు, లచ్చియ జననాయగ కట్చి(ఎల్‌జేకే) పార్టీ అధ్యక్షుడు జోస్ చార్లెస్ పుదుచ్చేరిలోని కామరాజ్‌నగర్ నియోజకవర్గంలో విజయం సాధించారు.

విజయ్ డ్రైవర్ కుమారుడు ఇప్పుడు ఎమ్మెల్యే


విజయ్‌తో డ్రైవర్ రాజేంద్రన్, కుమారుడు శబరినాథన్

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన టీవీకే అధినేత విజయ్.. అభ్యర్థుల ఎంపికలో తీసుకున్న నిర్ణయాలు కూడా సంచలనంగా మారాయి. చాలా కాలంగా తన వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌కు ఆయన ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. చెన్నై నడిబొడ్డున విరుగంబాక్కం నియోజకవర్గం నుంచి పోటీచేసిన శబరినాథన్ 27,086 ఓట్ల మెజారిటీతో డీఎంకే నేత ఏఎంవీ ప్రభాకర్ రాజాపై విజయం సాధించారు. విజయ్ తన పేరు ప్రకటించినప్పుడే తీవ్ర భావోద్వేగానికి గురైన శబరినాథన్.. ఆయన కాళ్లకు సాష్టాంగ నమస్కారం చేశారు. ఆయనను హత్తుకున్న విజయ్..'నా ఫోటో పెట్టుకుని ప్రచారం చెయ్.. ఎమ్మెల్యేగా కనిపించు..' అని వెన్నుతట్టి పంపించినట్లు సమాచారం. ఆయన చెప్పినట్లే ఎమ్మెల్యేగా గెలిచిన శబరినాథన్.. మంగళవారం టీవీకే శాసనసభాపక్ష సమావేశానికి హాజరయ్యారు.

తిరుపత్తూరులో ఒక్క ఓటు మెజారిటీతో గెలుపు


శ్రీనివాస సేతుపతి

చెన్నై, మే 5 (ఆంధ్రజ్యోతి): ఒకే ఒక్క ఓటు ఆ నియోజకవర్గంలో ఫలితాన్ని తారుమారు చేసింది. మంత్రిగా పనిచేసిన నేతను ఇంటికి పంపేసింది. తమిళనాడులో సహకారశాఖ మంత్రిగా పని చేసిన డీఎంకే సీనియర్ నేత కేఆర్ పెరియకరుప్పన్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల్లో శివగంగ జిల్లా తిరుపత్తూరు నియోజకవర్గంలో పోటీ చేసిన ఆయన.. సమీప ప్రత్యర్థి, టీవీకే అభ్యర్థి శ్రీనివాస సేతుపతి చేతిలో ఒకే ఒక్క ఓటు తేడాతో పరాజయం పాలయ్యారు. చివరి రౌండ్ లెక్కింపునకు ముందు ఆయన 30 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. గెలుస్తాననే ధీమాగా ఉన్న ఆయన చివరి రౌండ్ లెక్కింపు పూర్తయ్యేసరికి దిగ్భ్రాంతికి గురయ్యారు. పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు రాగా, శ్రీనివాస సేతుపతికి 83,375 ఓట్లు వచ్చాయి. టీవీకే అభ్యర్థిని విజేతగా ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ ఫలితంపై డీఎంకే నేత ఉదయనిధి మాట్లాడుతూ.. తిరుపత్తూరు ఫలితంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

ఐదోసారి పగ్గాలు చేపట్టనున్న రంగస్వామి..!

గత క్యాబినెట్‌లానే పుదుచ్చేరిలో ఈసారీ సంకీర్ణమే



పుదుచ్చేరి, మే 5: పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఘన విజయం సాధించిన రంగస్వామి ఐదోసారి పుదుచ్చేరి సీఎం పీఠం ఎక్కడానికి రంగం సిద్ధమయింది. ఆయన పార్టీ ఏఐఎన్ఆర్‌సీ అత్యధిక సీట్లు గెలుచుకున్న పార్టీగా అసెంబ్లీలో నిలిచింది. మొత్తం 16 స్థానాల్లో పోటీ చేయగా 12 చోట్ల విజయం సాధించింది. 30 సీట్లున్న అసెంబ్లీలో అధికారం చేపట్టాలంటే 16 మంది బలం ఉండాలి. బీజేపీ నాలుగు సీట్లు గెలుచుకోగా, ఏఐఏడీఎంకే, ఎల్‌జేకే ఇతర ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలను కలుపుకొంటే మొత్తం బలం 18కి చేరుకుంటుంది. వీరికితోడు ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఉండనే ఉన్నారు. పాండీ కొత్త అసెంబ్లీకి నేతగా రంగస్వామి ఎంపిక నామమాత్రమే. గత క్యాబినెట్ మాదిరే ఈసారి కూడా సంకీర్ణ మంత్రి వర్గం ఏర్పడనుంది. సాధారణంగా మంత్రివర్గ సభ్యుల సంఖ్య ఆరుకు మించదు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి 6 సీట్లు గెలుచుకుంది. డీఎంకేకు ఐదు రాగా, కాంగ్రెస్‌కు ఒకే ఒక్క స్థానం దక్కింది.

సర్కారు ఏర్పాటుకు సై!

(మొదటిపేజీ తరువాయి)

అందించామని, అధిక సంఖ్యాబలమున్న పార్టీ తమదేనంటూ గణాంకాలతో పంపామని స్పష్టం చేసింది. బుధవారం ఆయన అపాయింట్‌మెంట్ కోరామని, అంతేగాక గురువారం ఉదయం 11.30 గంటలకు విజయ్‌తో సీఎంగా పదవీ ప్రమాణం చేయించాలని కూడా స్పష్టంగా అభ్యర్థించామని ప్రకటించింది. సోమవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో టీవీకే 108 స్థానాలు సాధించిన సంగతి తెలిసిందే. 234 స్థానాల రాష్ట్ర అసెంబ్లీలో సాధారణ మెజారిటీకి 118 స్థానాలు అవసరం కాగా.. విజయ్ పార్టీ 10 సీట్ల దూరంలో నిలిచింది. దీంతో కాంగ్రెస్, పీఎంకే, వామపక్షాల మద్దతు కోసం ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇంకోవైపు.. డీఎంకే పరాజయంతో ఆ పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను మంగళవారం ఈ-మెయిల్ ద్వారా పంపగా గవర్నర్ ఆమోదించారు. తదుపరి ప్రభుత్వం ఏర్పాటయ్యేవరకు పదవిలో కొనసాగాలని కోరారు. కాగా.. మంగళవారం టీవీకే కార్యాలయంలో భేటీ అయిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు విజయ్‌ను ఏకగ్రీవంగా శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. అనంతరం వారందరినీ విజయ్ మహాబలిపురం సమీపంలోని ఓ ప్రముఖ రిసార్ట్‌కు తరలించారు. గురువారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని భావిస్తున్న ఆయన.. వారందరినీ రాజధానిలోనే ఉండాలని ఆదేశించారు. తమిళనాడు డీజీపీ, చెన్నై పోలీసు కమిషనర్ విజయ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ప్రమాణస్వీకార ఏర్పాట్లపై చర్చించారు.

కాంగ్రెస్‌తో టీవీకే పొత్తు ఖాయం?

ప్రభుత్వ ఏర్పాటుకు మరో 10 మంది ఎమ్మెల్యేల అవసరమైన నేపథ్యంలో ఇతర పార్టీల నేతలతో విజయ్ అండ్ కో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. డీఎంకే కూటమిలోని కాంగ్రెస్(5), సీపీఎం(2), సీపీఐ(2), వీసీకే(2)లతో పాటు అన్నాడీఎంకే కూటమిలోని పీఎంకే(4)తో చర్చిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవులిస్తామని విజయ్ హామీ ఇవ్వడంతో అవి కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. నేరుగా విజయ్‌కు ఫోన్ చేసి విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని విజయ్ మంగళవారం 'ఎక్స్'లో తెలియజేశారు. రాహుల్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దీంతో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఖాయమని ప్రచారం జరుగుతోంది.


తమిళనాడు గవర్నర్ అర్లేకర్


టీవీకే శాసనసభా పక్ష సమావేశానికి ముందు పెరియార్, అంబేడ్కర్ తదితర నాయకులకు విజయ్ నివాళి

మా మద్దతు కోరారు: వేణుగోపాల్

తమిళనాట ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే అధినేత విజయ్ కాంగ్రెస్ మద్దతు కోరారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ధ్రువీకరించారు. దీనిపై పీసీసీ నేతలు బుధవారం చెన్నైలో సమావేశమై నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానం సూచించినట్లు మంగళవారం సాయంత్రం ఆయన ఓ తమిళ చానల్‌కు తెలిపారు.

విజయ్‌తో ఈపీఎస్ మంతనాలు: లీమా రోస్

విజయ్ తమ మద్దతు కోరారని, దీనిపై తమ పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్)తో మంతనాలు జరుపుతున్నారని అన్నాడీఎంకే ఎమ్మెల్యే లీమా రోస్ పేర్కొన్నారు. ఈపీఎస్‌తో భేటీ అనంతరం ఆమె ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. అయితే కొద్దిసేపటికే అన్నాడీఎంకే సీనియర్ నేత ఓఎస్ మణియన్ మాట్లాడుతూ.. టీవీకేకు మద్దతిచ్చే ప్రసక్తే లేదని.. మద్దతు కోరుతూ ఈపీఎస్‌తో ఎవరూ మాట్లాడలేదని చెప్పారు. అయితే, బుధవారం జరిగే అన్నాడీఎంకే ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చిస్తామన్నారు.

ధన ప్రవాహానికి సమాధి కట్టాం: విజయ్

తమిళనాడు రాజకీయాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగిన టీవీకేకు ప్రజల నుంచి లభించిన అఖండ మద్దతు దేశ రాజకీయాలనే కుదిపేసిందని ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్యంలో ధన ప్రవాహానికి శాశ్వతంగా సమాధి కట్టామని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అద్భుత విజయాన్ని అందించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. పార్టీ ప్రారంభించినప్పటి నుంచి అందరూ తమను హేళన చేయడంతో పాటు తీవ్ర విమర్శలు గుప్పించారని, వాటిని పట్టించుకోకుండా ప్రజలపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో పోటీ చేశామని తెలిపారు. తమ నమ్మకం వమ్ముకాలేదని, రాష్ట్ర ప్రజానీకం గెలుపును బహుమతిగా అందజేసిందని తెలిపారు. టీవీకే అద్భుతమైన విజయానికి చిన్నారులు, బాలబాలికలు ప్రధాన కారకులయ్యారని, తమ కుటుంబ సభ్యులందరి దృష్టిని టీవీకే వైపు మళ్లించారన్నారు. చరిత్రాత్మక విజయానికి కారణమైన రాష్ట్ర ప్రజలకు, పార్టీ ప్రముఖులకు, గెలిచిన అభ్యర్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఓట్లు వేసి గెలిపించిన ఆత్మీయులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

లోకం తీరు



కాంగ్రెస్‌లో ఆత్మపరిశీలన కావాలి

కేరళం వ్యూహాలను ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలి: శశిథరూర్



తిరువనంతపురం, మే 5: తాజా ఎన్నికల ఫలితాల్లో కేరళం మినహా ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రదర్శనపై ఆ పార్టీ సీనియర్ నేత శశి థరూర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో తగిలిన ఎదురుదెబ్బల నేపథ్యంలో పార్టీలో లోతైన ఆత్మపరిశీలన జరగాలని పేర్కొన్నారు. పార్టీ ప్రదర్శన ఏమాత్రం ఆశాజనకంగా లేదని, ప్రచార వ్యూహాలు, సంస్థాగతంగా బలోపేతం కావడం, ఓటర్లను ఆకట్టుకోవడం వంటి అంశాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని అంగీకరించారు. కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయం సాధించడం వెనుక ఉన్న కారణాలను అధ్యయనం చేయాలని, జాతీయ స్థాయిలో పార్టీ పరిస్థితి మెరుగుపడటానికి ఇలాంటి వ్యూహాలనే ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని సూచించారు. మోదీ, అమిత్ షా అనుసరించిన ఎన్నికల వ్యూహాలను ఆయన ప్రశంసించారు. ఎన్నికల నిర్వహణలో బీజేపీ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు.

కేరళకు కాంగ్రెస్ పరిశీలకులుగా మాకెన్, వాస్నిక్

న్యూఢిల్లీ, మే 5: కేరళ ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎంపిక చేసే విషయమై ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించడానికి కాంగ్రెస్ పార్టీ ఇద్దరు పరిశీలకులను నియమించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్, కోశాధికారి అజయ్ మాకెన్‌లు పరిశీలకులుగా వ్యవహరిస్తారు. శాసనసభా పక్ష సమావేశం తేదీని నిర్ణయించిన తరువాత వారు కేరళకు వెళ్తారు. ముఖ్యమంత్రి పదవి కోసం పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, సీనియర్ నాయకులు వి.డి.సతీషన్, రమేష్ చెన్నితల పోటీపడుతున్నారు. మరోవైపు అసోంలో శాసనసభా పక్ష నేతను ఎన్నుకునే కార్యక్రమానికి పరిశీలకుడిగా కేంద్రమంత్రి జేపీ నడ్డా నియమితులయ్యారు. హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ సహ పరిశీలకుడిగా నియమితులయ్యారు.

కేరళంలో ఆరుచోట్ల బీజేపీకి రెండో స్థానం!

తిరువనంతపురం, మే 5: కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా మూడు సీట్లు గెలుచుకున్న బీజేపీ మరో ఆరు నియోజకవర్గాల్లో రెండో స్థానంలో నిలిచింది. తిరువళ్ల నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనూప్ ఆంటోనీ... కేరళ కాంగ్రెస్ (కేఈసీ) అభ్యర్థి వర్గీస్ మెమ్మెన్ చేతిలో 10,146 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఇక్కడ 2021 ఎన్నికల్లో బీజేపీ 16.25 శాతం ఓట్లతో మూడో స్థానానికి పరిమితం కాగా ఇప్పుడు 30.61 శాతం ఓట్లు సాధించింది. పాలక్కాడ్‌లో యూడీఎఫ్ అభ్యర్థి రమేశ్ పిషారోడి చేతిలో బీజేపీకి చెందిన శోభా సురేంద్రన్ 13,147 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇక్కడ 2024 ఉప ఎన్నికలో బీజేపీకి 28.80 శాతం ఓట్లు లభించగా, ఈసారి 33.33 శాతం ఓట్లు దక్కాయి. ఇక అట్టింగల్‌లో సీపీఎం అభ్యర్థి ఓఎస్ అబింక కంటే బీజేపీ అభ్యర్థి పి.సుధీర్ 13,375 ఓట్లు వెనుకబడ్డారు. 2021లో ఈ స్థానంలో 25.92 శాతం ఓట్లతో బీజేపీ రెండో స్థానంలో నిలవగా ఈసారి 30.54 శాతం ఓట్లను దక్కించుకుంది.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు చైనాలో 26 మంది మృతి

బీజింగ్, మే 5: చైనాలోని బాణసంచా తయారీ కర్మాగారంలో పేలుడు సంభవించడంతో కనీసం 26 మంది మరణించగా, 61 మంది గాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం హునాన్ ప్రావిన్స్‌లోని లుయాంగ్‌లో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మూడు రోబోలతో పాటు, 480 మంది సిబ్బంది సహాయ చర్యల్లో పాల్గొన్నారు. ఈ ప్రమాదం కారణంగా కిలోమీటర్ల కొద్దీ విస్తీర్ణంలో ఆస్తి నష్టం సంభవించింది.

ఆలయాల శిథిలాలతోనే ఆ మసీదు నిర్మాణం

'భోజ్‌శాల ఆలయం-కమాల్ మౌలా మసీదు'పై మధ్యప్రదేశ్ హైకోర్టులో ఏఎస్ఐ వాదనలు

ఇండోర్, మే 5: 'భోజ్‌శాల ఆలయం-కమాల్ మౌలా మసీదు కాంప్లెక్స్' ఒకప్పుడు హిందూ ఆలయాల సముదాయమని, వాటి శిథిలాలతోనే ప్రస్తుత కట్టడం (మసీదు) నిర్మాణం జరిగిందని భారత పురావస్తు విభాగం(ఏఎస్ఐ) వెల్లడించింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ హైకోర్టులో ఏఎస్ఐ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ మంగళవారం వాదనలు వినిపించారు. రెండేళ్ల క్రితం ఏఎస్ఐ 98 రోజులపాటు జరిపిన శాస్త్రీయ సర్వే, అనంతరం రూపొందించిన 2 వేల పేజీలకుపైగా ఉన్న నివేదికలోని అంశాలను ప్రస్తావించారు. మసీదు నిర్మాణం కంటే ముందే అక్కడ భారీ ఆలయం ఉన్నట్లుగా ఆ ప్రాంతంలో లభించిన పలు శిల్పాలు, స్తంభాల శిథిలాలు, శాసనాలు తెలియజేస్తున్నాయన్నారు. ఇవి పర్మార్ రాజవంశం కాలానికి చెందినవని తెలిపారు. కాగా, ఈ అంశంపై హైకోర్టు ఏప్రిల్ 6వ తేదీ నుంచి విచారణ జరుపుతోంది.

విజయ్ హామీలకు లక్ష కోట్లు!

» ఖజానాపై అదనంగా పడనున్న భారం

» నిధుల సమీకరణపై అధికారుల ఆందోళన

(చెన్నై-ఆంధ్రజ్యోతి)


చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ఇచ్చిన హామీలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఈ హామీలన్నీ అమలు కావాలంటే ప్రభుత్వంపై మరో రూ.లక్ష కోట్ల అదనపు భారం పడటం ఖాయమని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. వీటి అమలు విజయ్ బృందానికి అంత సులభం కాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. మహిళలకు నెలవారీ సాయం రూ.1,000 నుంచి రూ.2,500కు పెంచాలన్న హామీతో వార్షిక వ్యయం రూ.14,411 కోట్ల నుంచి రూ.36,029 కోట్లకు పెరుగుతుంది. అంటే ప్రభుత్వంపై అదనంగా రూ.21,618 కోట్ల భారం పడుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం 100 యూనిట్లు ఉచితంగా ఇస్తోంది. ఇప్పుడు అదనంగా మరో 100 యూనిట్లు ఇవ్వాల్సి ఉంది. ఈ వ్యయం ఏడాదికి రూ.7,752 కోట్ల నుంచి రూ.12వేల కోట్లు దాటుతుంది. ఈ హామీతో పడే అదనపు భారం రూ.4,248 కోట్లు పైమాటే. ఇక వృద్ధులకు పింఛను కింద ప్రస్తుతం రూ.1,200 ఇస్తుండగా, దానిని రూ.3 వేలకు పెంచడం వల్ల వార్షిక వ్యయం రూ.4,366 కోట్ల నుంచి రూ.6,549 కోట్లకు పెరగనుంది. వితంతు పింఛన్లకు రూ.1,829 కోట్లు, దివ్యాంగుల పింఛన్లకు రూ.504 కోట్ల చొప్పున భారం పెరగనుంది. ఏటా 6 గ్యాస్ సిలిండర్లు ఉచితం హామీతో రూ.7,074 కోట్లు, రైతులకు ఏడాదికి రూ.15,000 పంపిణీతో రూ.1,941 కోట్లు, ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమాతో అదనంగా రూ.382 కోట్లు అదనపు వ్యయం అవుతుంది. ఇక నిరుపేద యువతుల వివాహానికి 8 గ్రాముల బంగారం (దాదాపు రూ.1,20,000) హామీతో రూ.600 కోట్లకు పైగా వ్యయం పెరుగుతుంది. ప్లస్-2 చదివిన వారికి ప్రతి నెలా రూ.2500, నిరుద్యోగ యువతకు రూ.4,000, ఇంటర్న్‌షిప్ చేసే వారికి నెలకు రూ.5,000 నుంచి రూ.8,000 వరకూ స్టయిపెండ్, చేపల వేట నిషేధం సమయంలో మత్స్యకారులకు ప్రతి నెలా రూ.27,000, చేపల వేటకు వెళ్లే పడవలకు రాయితీతో కూడిన డీజిల్, వితంతువులు, అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు రూ.18,000, పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.10,000 జీతం వంటి వాటి వల్ల కూడా అదనపు భారం పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛన్ విధానం (ఓపీఎస్) అమలును పరిశీలిస్తామని టీవీకే పేర్కొంది. 5లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సులతో సహా అందరినీ క్రమబద్ధీకరిస్తామని ప్రకటించింది. ఈ సంక్షేమ పథకాలు, హామీలు అమలు కావాలంటే ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ పథకాలతో ఏటా లోటు బడ్జెట్ దాఖలవుతుండగా, ఇప్పుడు కొత్తగా కుమ్మరించిన హామీలకు నిధులు ఎక్కడి నుంచి సమకూరుస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికే రాష్ట్రంలో రూ.1.22 లక్షల కోట్ల ఆర్థిక లోటు ఉంది. ఈ నేపథ్యంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న విజయ్ ఏం చేస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

సుప్రీం జడ్జీల సంఖ్య 38కి పెంపు

» ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

» వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు


» క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్


క్యాబినెట్ భేటీ తర్వాత జాల్‌మురీ కొని తింటున్న అశ్వినీ వైష్ణవ్


న్యూఢిల్లీ, మే 5 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 34 నుంచి 38కి పెంచాలన్న ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం ఇక్కడ ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రిమండలి.. సుప్రీం జడ్జీల సంఖ్య పెంపుతో పాటు, మూడు రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం, పత్తి ఉత్పాదక మిషన్ అమలుకు అంగీకారం సహా పలు కీలక ప్రతిపాదనలకు అంగీకారం తెలిపింది. ఆ వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య సీజేఐతో కలిపి 34. ఆ సంఖ్యను 38కి పెంచడానికి వీలుగా వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెడతామని ఆయన వెల్లడించారు. అలాగే.. రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలో గుంతకల్-వాడి మధ్య 3, 4 లైన్లతో సహా మూడు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ప్రధాని నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మూడు ప్రాజెక్టులకూ కలిపి రూ.23,437 కోట్లు ఖర్చు చేయనున్నారు. వీటిలో.. గుంతకల్-వాడి మధ్య 230 కిలోమీటర్ల మేర చేపట్టే 3, 4 లైన్ల నిర్మాణానికి రూ.4,758 కోట్లు వ్యయం కానుంది. ఈ ప్రాజెక్టును.. చేపట్టిన నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు. ఈ లైన్ల వల్ల ఏపీలోని అనంతపూర్, కర్నూలు, తెలంగాణలోని నారాయణ్‌పేట్, కర్ణాటకలోని రాయచూర్, యాద్‌గిర్, కలబురిగి లబ్ధి పొందనున్నాయి. వీటి నిర్మాణంలో భాగంగా రెండు మెగా బ్రిడ్జిలు, 35 మేజర్ బ్రిడ్జిలు, 382 చిన్న బ్రిడ్జిలను నిర్మిస్తారు. మిగతా రెండు ప్రాజెక్టులలో ఒకటి.. మధ్యప్రదేశ్, రాజస్థాన్, యూపీలను కలిపే నాగ్డా-మధుర 3,4 లైన్ల నిర్మాణం కాగా, రెండోది.. యూపీలో బుధ్వాల్- సీతాపూర్ 3, 4 లైన్ల నిర్మాణం. ఈ మూడు ప్రాజెక్టులూ 2030-31 నాటికి పూర్తవుతాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని 19 జిల్లాల మీదుగా నిర్మితం కానున్న ఈ ప్రాజెక్టులు పూర్తయితే, భారతీయ రైల్వే నెట్‌వర్క్ సుమారు 901 కిలోమీటర్ల మేర విస్తరిస్తుంది. అలాగే.. అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే 2026-27 సీజన్‌కుగాను.. చక్కెర మిల్లులు చెరకు సాగుదారులకు చెల్లించాల్సిన కనీస ధరను క్వింటాలుకు రూ.355 నుంచి రూ.365కు (రూ.10 మేర) పెంచే 'న్యాయమైన, లాభదాయకమైన ధర (ఎఫ్ఆర్‌పీ)' ప్రతిపాదనకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా కోటి మంది చెరకురైతులకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు.

పత్తి ఉత్పత్తి పెంచడానికి..

ఐదేళ్లపాటు (2026-27 నుంచి 2030-31 దాకా) రూ.5,659.22 కోట్లతో పత్తి ఉత్పాదకత మిషన్‌ను అమలు చేయడానికి కూడా కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. మోదీ సర్కారు తలపెట్టిన 5ఎఫ్ ఫార్ములా (ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్ టు ఫారిన్)కు అనుగుణంగా ఈ కార్యక్రమం అమలవుతుంది. చీడపీడలను, తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే పత్తి విత్తనాల రూపకల్పనపై ప్రధానంగా దృష్టి సారించే మిషన్ ఇది. 2031 నాటికి దేశంలో పత్తి ఉత్పాదకతను హెక్టారుకు 440 కిలోల నుంచి 755 కిలోలకు పెంచడం.. తద్వారా సుమారు 32 లక్షల మంది రైతులు స్వావలంబన సాధించేలా చేయడం దీని లక్ష్యాలు. ఇక.. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దెబ్బతిన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, విమానయాన సంస్థలకు ఊరటనిచ్చేందుకు రూ.18,100 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన 'అత్యవసర రుణ భరోసా పథకం 5.0'కి మంత్రి మండలి అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈలకు 100 శాతం, విమానయాన సంస్థలకు 90శాతం రుణ హామీ కవరేజీని అందిస్తారు. ఇక.. 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)' కింద.. రూ.3,936 కోట్లతో దేశంలో (గుజరాత్‌లో) కొత్తగా రెండు సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. వీటిలో ఒకటి దేశంలోనే మొట్టమొదటి గ్యాన్ (గ్యాలియం నైట్రైడ్) ఆధారిత కమర్షియల్ మినీ/మైక్రో-ఎల్ఈడీ డిస్‌ప్లే ఫెసిలిటీ కాగా, మరొకటి సెమీకండక్టర్ ప్యాకింగ్ ఫెసిలిటీ. వీటిలో మినీ/మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే మాడ్యూళ్ల తయారీ యూనిట్‌ను దక్షిణ కొరియాకు చెందిన క్రిస్టల్ మ్యాట్రిక్స్ సంస్థ గుజరాత్‌లోని ధొలేరాలో ఏర్పాటు చేయనుంది. ఇక, సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ కేంద్రాన్ని 'సుచి సెమీకాన్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ గుజరాత్‌లోని సూరత్‌లో పెట్టనుంది.



శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు



శ్రీ నారా లోకేష్ గారు
మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్
కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖామాత్యులు

SRI CITY
An Integrated Business City

స్వాగతం - సుస్వాగతం

Carrier

క్యారియర్ పరిశ్రమ
భూమిపూజ కార్యక్రమానికి విచ్చేయనున్న
ముఖ్య అతిధులకు
మా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు

క్యారియర్ యాజమాన్య ప్రతినిధులు



శ్రీ డేవిడ్ ఎల్. గిట్లిన్



శ్రీ మైఖేల్ ఎల్. గియొర్డెన్



శ్రీ సుందరేశన్ నారాయణన్

తేదీ : 06-05-2026 (బుధవారం)
పరిశ్రమ పెట్టుబడి : 1,000 కోట్లు
ఉద్యోగాలు : 3,000

- 31 దేశాలకు చెందిన 250 పరిశ్రమలు
- 70 వేల మందికి ఉపాధి (50 శాతం మహిళలు)
- 10 ఏసీ తయారీ కంపెనీలు, 31 సప్లై కంపెనీలు
- శ్రీసిటీ - 'కూల్ సిటీ'

శ్రీసిటీలోని వివిధ ఏసీ తయారీ కంపెనీలు

Carrier, LG Electronics, DAIKIN, BLUE STAR, amber, EPACK DURABLE, Hisense, HAVELLS, THERMAX, PG

శ్రీసిటీలోని ఏసీ సప్లై చైన్ కంపెనీలు

Nidec, NSSI, Oji, JGi, RECHI DAIKIN, MetTube, Corea IND., ADMIRE, SOLUM, ESS KAY, Magnum, Trinath, KSP, UKB, Hankook, MITSUBISHI HEAVY INDUSTRIES IAPL GROUP, Gupta Gas, TAESUNG ELECTRONICS, HAENG SUNG, Unipack, PARAMOUNT POLYMERS, LRIPL, KNAG, KYOWA, EVERSHINE, KERRY INDEV LOGISTICS, BOMBAY COATED & SPECIAL STEELS, MAHA

శ్రీసిటీ ప్రపంచ తయారీ కేంద్రం! దార్శనికతను సాకారం చేసే ప్రాంగణం!

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చేజారిన లెఫ్ట్ కోట

అధికారంలో ఉన్న పార్టీని దించేయడం కేరళ ఓటర్లకు అలవాటే కానీ, ఈ మారు అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం ఓటమి మీద ప్రత్యేక చర్చ జరుగుతోంది. పినరాయ్ పాలన ముగిసిపోవడంతో ఇప్పుడు దేశంలో ఏ ఒక్క రాష్ట్రమూ వామపక్షాల చేతిలో లేకుండా పోయిన సంగతిని మీడియా గుర్తుచేస్తోంది. దేశ వామపక్ష రాజకీయాల్లో ఇది ఒక ప్రత్యేకస్థితి. ఏడుదశాబ్దాలక్రితం, 1957 ఏప్రిల్‌లో సీపీఐ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తూ ఈఎంఎస్ నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడంతో స్వతంత్ర భారతంలో వామపక్షాల రాజకీయ అధికారం ఆరంభమైంది. తుపాకీ గొట్టంతో కాక, బ్యాలెట్ పెట్టె ద్వారా కమ్యూనిస్టులు అధికారం చేపట్టడం ప్రపంచంలో ఇదే మొదలు. తీవ్ర సామాజికార్థిక అసమానతలున్న, కొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఒక విశాలమైన దేశంలో ఎన్నికలద్వారా అధికారంలోకి రావడం వల్ల కేరళ ప్రయోగం ప్రపంచచరిత్రలో నిలిచిపోయింది. అయితే, మరో రెండేళ్ళలోనే ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఆర్టికల్ 356ను ప్రయోగించి నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని రద్దుచేయడం వేరే సంగతి. మరో పదేళ్ళకు ఈఎంఎస్ మళ్ళీ కేరళలో సంకీర్ణప్రభుత్వం ఏర్పాటు చేయడం, ఆ తరువాత దేశంలో అనేకచోట్ల వామపక్షాలు పాలనాపగ్గాలు చేపట్టడం, ఓడిగెలవడం తెలిసిందే. పశ్చిమ బెంగాల్, త్రిపుర దశాబ్దాలపాటు వామ పక్షాలకు కంచుకోటలు. 2011లో పశ్చిమ బెంగాల్, మరో ఆరేళ్ళకు త్రిపురలో అధికారాన్ని కోల్పోయిన లెఫ్ట్, ఎన్నికల రాజకీయాలద్వారా తొలిసారిగా గద్దెనెక్కిన చోటే ఇప్పుడు దిగిపోయింది.

కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)ను జనం ఇంత బలంగా గెలిపించడం ఆశ్చర్యం. దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్న పార్టీమీద వ్యతిరేకత సహజం కూడా. అయితే, యూడీఎఫ్‌కు వందసీట్లకు పైగా కట్టబెట్టడం, బీజేపీ మూడుస్థానాలు సాధించడం, విజయన్ కాబినెట్‌లో చాలామంది మంత్రులు ఓడిపోవడం వంటి పరిణామాలు తేలికగా తీసివేయగలిగేవి కావు. పశ్చిమబెంగాల్‌లో వీరోచిత పోరాటంతో తృణమూల్‌ను బీజేపీ ఓడించిన రీతిలో కేరళలో కాంగ్రెస్ పోరాడి గెలిచిందని కూడా అనలేం. కేరళ రాజకీయాలు, ఓటర్ల మనోభావాలు వేరన్న విషయాన్ని అటుంచితే, అద్భుతమైన ఎన్నికల ప్రచారంతో కాంగ్రెస్ ఈ ఘనవిజయాన్ని సాధించిందని కూడా ఎవరూ అనడం లేదు. కమ్యూనిస్టు పాలనమీద జనం ఆగ్రహించారని కాక, పినరాయ్ విజయన్ వ్యవహారశైలి, వైఖరులతోనే ఎల్‌డీఎఫ్ కూలిందన్నది చాలామంది అంచనా. పదేళ్ళ ఏలుబడిలో ఆయన ప్రభుత్వం క్రమంగా వామపక్ష లక్షణాలను కోల్పోయినందున ఎల్‌డీఎఫ్ ఇప్పుడు ప్రతిపక్షానికి పరిమితం కావాల్సివచ్చిందని అంటారు.

కరోనా కాలంలో తమ ఆశావర్కర్లు అద్భుతంగా పనిచేశారని అంతర్జాతీయ వేదికలమీద ఘనంగా చెప్పుకున్న ప్రభుత్వమే వారిపట్ల అన్యాయంగా వ్యవహరించింది. నెలకు ఏడువేలరూపాయలు అందే ఆశావర్కర్లు తమ జీవనభృతిని 21వేలకు పెంచాలంటూ పదినెలలపాటు సెక్రటరేయట్ ఎదురుగా నిరసనలు చేపడితే ఆఖరుకు కేవలం వెయ్యి రూపాయలు పెరిగింది. అంగన్‌వాడీ వర్కర్లు, నర్సులు, రైతులు తదితర రంగాలకు చెందినవారు ఉద్యమాలు చేసినప్పుడు విజయన్ ప్రభుత్వం వాటిని కాంగ్రెస్ కుట్రలుగా అభివర్ణించడం ఎన్నికల్లో ఎదురుదెబ్బ తీసిందని అంటారు. నిరుద్యోగికత జాతీయ సగటు కంటే మూడు రెట్లున్న రాష్ట్రంలో, నాలెడ్జ్ ఎకానమీ మిషన్ ద్వారా ఐదేళ్ళలో 20లక్షల ఉద్యోగాల కల్పన హామీ కూడా పూర్తిగా నెరవేరలేదు. ఘనంగా నిర్వహించిన పెట్టుబడుల సదస్సుల ద్వారా దక్కింది కూడా తక్కువే. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని బాండ్లతో రక్షించుకోవడానికి రాష్ట్రప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోకాలడ్డి వుండవచ్చు గానీ, ప్రతీ సమస్యకూ కేంద్రాన్ని బూచిగా చూపడం కూడా జనానికి నచ్చలేదు. కార్మికులు, కౌలురైతులు, దళితులు, మత్స్యకారులు, మహిళలు తదితర వర్గాల ప్రయోజనాలకోసం నిలవాల్సిన విజయన్ ప్రభుత్వం వారికి దూరం కావడం ఈ ఓటమికి కారణం. ముఖ్యమంత్రి కుటుంబం మీద ఆరోపణలు రావడం నుంచి పార్టీలో అసమ్మతి, సహాయనిరాకరణ వరకూ చాలా అంశాలు పనిచేశాయి. కాంగ్రెస్ పార్టీ హామీలు సైతం ఓటర్లను ప్రభావితం చేసివుండవచ్చు. విజయన్ పాలన మీద ఉన్న అసమ్మతి, అసంతృప్తి ఆధారంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ప్రజల మనసుకు నచ్చినట్టుగా నడుచుకోకపోతే మళ్ళీ కేరళలో ఎర్రజెండా ఎగురావచ్చు.

> భారత ఈశాన్య సరిహద్దు ప్రాంతాల్లో నివసించే అసలైన భారతీయ ముస్లింలపై సైతం విదేశీ చొరబాటుదారులుగా ముద్ర వేసే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే 30 లక్షల మంది ఓటర్లను అనుమానాస్పద భారత పౌరులుగా గుర్తించి వారి ఓటు హక్కును తొలగించారు. భవిష్యత్తులో వారందరినీ బలవంతంగా బంగ్లాదేశ్‌కు పంపించే ప్రయత్నం చేస్తామంటే ఎలా?

వైదేశిక నీతిపై బెంగాల్ నీడలు

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఫలితం దేశీయ రాజకీయాలను మలుపు తిప్పడంతో పాటు భారత విదేశాంగ విధానంలోని ఇరుగు పొరుగు కోణాన్ని కూడా గణనీయంగా ప్రభావితం చేయనున్నది. విదేశీ చొరబాటుదారుల ఏరివేత నినాదంతో భారతీయ జనతా పార్టీ ఎట్టకేలకు బెంగాల్‌లో అధికారాన్ని కైవసం చేసుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉన్నది.

పశ్చిమ బెంగాల్, ఈశాన్య భారత రాష్ట్రాలకు బంగ్లాదేశ్‌తో భౌగోళిక సామీప్యత ఉన్నది. ఈ రాష్ట్రాలలో విదేశీ చొరబాటుదారులు గణనీయంగా ఉన్నారనేది మొదటి నుంచీ బీజేపీ ఆరోపణ. ఈ కారణంగానే మూడు 'డి'లు– డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్ (గుర్తింపు, తొలగింపు, బహిష్కరించు లేదా వెనక్కి పంపించు) అనేది ఆ రాష్ట్రాలలో బీజేపీ వ్యూహాత్మక రాజకీయ కార్యక్రమంగా ఉన్నది. రాజకీయంగా ప్రతికూలురు, ప్రత్యేకించి ముస్లింలను లక్ష్యంగా చేసుకునే ఈ వ్యూహాత్మక రాజకీయం తొలుత 1980వ దశకంలో అస్సాంలో ఆరంభమయింది. తాజాగా బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో ఆ వ్యూహం చరిత్రాత్మకంగా సఫలమయింది. విదేశీ చొరబాటు దారులను వారి వారి దేశాలకు తిరిగి పంపించివేయడం అన్ని దేశాలకు పరిపాటి. అమెరికా, గల్ఫ్ రాజ్యాలు నిరంతరం ఈ పని చేస్తుంటాయి. ఇప్పుడు భారత సరిహద్దు రాష్ట్రాలలోని బీజేపీ ప్రభుత్వాలు సైతం ఈ పని చేస్తామంటున్నాయి. జాతీయ భద్రతతో ముడిపడి ఉన్న ఈ ప్రక్రియ విదేశాంగ విధానంలో ఒక భాగం.

గల్ఫ్ లేఖ

బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లో భారత రాయబారులుగా నియమితులు అయ్యే దౌత్యవేత్తలు భారత విదేశాంగ విధానంలో తలపండిన అనుభవజ్ఞులు అయి ఉండడం కద్దు. ఈ కారణంగా ఢాకా, ఇస్లామాబాద్‌లోని భారత రాయబారులకు ఎనలేని ప్రాధాన్యముంటుంది. ఢాకాలో భారతీయ రాయబారిగా పనిచేయడం అనేది భారతీయ దౌత్యవేత్తల ప్రతిభకు పురస్కారమనే భావన ఉన్నది. ఇప్పటి వరకు బంగ్లాదేశ్‌లో పనిచేసిన భారతీయ రాయబారులు అందరూ అసాధారణ దౌత్య ధురీణులే. ఢాకాలో కొత్త రాయబారిగా కేంద్ర మాజీ మంత్రి దినేశ్ త్రివేదిని నియమించడంలో కేంద్ర ప్రభుత్వం అనూహ్యమైన, అసాధారణమైన నిర్ణయం తీసుకున్నదని చెప్పవచ్చు. త్రివేది బెంగాల్‌కు చెందిన రాజకీయ నాయకుడు. ఒకప్పుడు మమతా బెనర్జీకి ఆప్తుడు. ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కు చెందిన దౌత్యవేత్తలు చేయజాలని పనులను రాయబారులుగా నియమితులయ్యే రాజకీయ నాయకులు సునాయాసంగా చేయగలుగుతారు. తనను నియమించిన పాలకపక్షానికి అనుకూలంగా రాజకీయ కోణం నుంచి ఆలోచించి తదనుగుణంగా వ్యవహరించగలుగుతారు. ఇదిగో ఇందుకే దినేశ్ త్రివేదిని ఢాకాలో రాయబారిగా నియమించారు.



బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా భారత్‌కు అనుకూలంగా వ్యవహరించేవారు. విద్యార్థుల తిరుగుబాటులో ఆమె పదవీచ్యుతురాలు అయిన అనంతరం బంగ్లాదేశ్ రాజకీయాలలో పెనుమార్పులు సంభవించాయి. ఈ హఠాత్పరిణామాల్లో ఏకాకి అయి, ఉక్కిరిబిక్కిరి అయిన భారత్, ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి వచ్చిన తారిక్ రహ్మాన్‌కు స్నేహ హస్తం అందించింది.

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా బంగ్లాదేశ్‌కూ సహజ వాయువు, ఎరువుల కొరత అనివార్యమయ్యింది. ఈ సమస్యల నుంచి బయటపడేందుకు.. తమను ఆదుకోవాలని భారత్‌ను బంగ్లాదేశ్ కోరింది. భారత ప్రభుత్వం సమ్మతించింది. బంగ్లాదేశ్ నూతన విదేశీ వ్యవహారాల మంత్రి న్యూఢిల్లీకి వచ్చి పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పూరితో సమావేశమయ్యారు. బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఏ రకమైన ప్రకటనలు చేసినప్పటికీ, సువిశాల జాతి ప్రయోజనాల దృష్ట్యా బంగ్లాదేశ్‌తో భారత్ సుస్థిర మైత్రినే కోరుకుంటోంది, సందేహం లేదు. మైత్రిని కోరుకుంటోందనడానికి బంగ్లాదేశ్‌కు అనుకూలంగా ప్రధాని మోదీ తీసుకుంటున్న చర్యలే నిదర్శనం.

ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ చొరబాటుదారుల ఏరివేతకై ఈశాన్య భారత సరిహద్దు ప్రాంతాలలో అనుమానాస్పద భారత పౌరులుగా పలువురిని గుర్తిస్తున్నారు. ఈ అక్రమ వలసదారులలో బంగ్లాదేశ్ జాతీయులుగా నిర్ధారణ అయ్యేవారు తక్కువేమీ కాదు. అయితే వారిని వెనక్కు పంపించడం అత్యంత కష్టతరమైన వ్యవహారమే. దౌత్యపరమైన సమాచారం లేకుండా అడ్డదారిన, రాష్ట్రాల పోలీసులు కేంద్ర సరిహద్దు భద్రతా దళాల సహాయంతో, అర్ధరాత్రి సరిహద్దు అవతలకు ఆ 'అక్రమ వలసదారు'లను నెట్టివేయడం వివాదాస్పదమవుతోంది.

సరిహద్దు ప్రాంతాల్లో నివసించే అసలైన భారతీయ ముస్లింలపై సైతం విదేశీ చొరబాటుదారులుగా ముద్ర వేసే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే 30 లక్షల మంది ఓటర్లను అనుమానాస్పద భారత పౌరులుగా గుర్తించి, వారి ఓటు హక్కును తొలగించిన విషయం ఇక్కడ ప్రస్తావించి తీరాలి. భవిష్యత్తులో వారందరినీ బలవంతంగా బంగ్లాదేశ్‌కు పంపించే ప్రయత్నం చేస్తామంటే ఎలా? గంగా నదీ జలాల పంపిణీ ఒప్పందం గడువు వచ్చే ఏడాది ముగియనున్నది. తీస్తా నదీ జలాల పంపిణీ వివాదం.. మొదలైన వాటిని పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వానికి బెంగాల్‌లో అధికారాన్ని చేపట్టనున్న నూతన బీజేపీ సర్కారు సైతం గతంలో మమతా బెనర్జీ వలే పూర్తిగా సహకరించకపోవచ్చు. అస్సాంలో కూడా ఇదే రకమైన పరిస్థితి ఉన్నది. ఇరుగు పొరుగులో చైనా ప్రాబల్యం, పాకిస్థాన్ దుర్నీతి.. ఇత్యాది అంశాలన్నీ కూడా ఇక్కడ పరస్పరం ముడిపడిపోయి భారత విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేయడం ఖాయం.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఫలించిన బెంగాల్ నిరీక్షణ

'నేను రాజీనామా చేయను. నాపై గెలిచింది బీజేపీ కాదు, ఎన్నికల కమిషన్' అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. బెంగాలీ అస్తిత్వం పేరిట మమత, ఆమె అనుయాయులు ఉధృతంగా నిర్వహించిన ప్రచారం, గ్రామాలపై తృణమూల్‌కు ఉన్న పట్టు మూలంగా టీఎంసీ కొద్దిపాటి మెజారిటీతోనైనా గెలుస్తుందని అనేక మంది ఊహించారు. సగానికిపైగా నియోజక వర్గాల్లో ముస్లిం ఆధిపత్యం ఉన్నందువల్ల ఆమె విజయానికి అవరోధాలు లేవని పలువురు విశ్వసించారు. అయితే వీటన్నింటినీ అధిగమించి పశ్చిమ బెంగాల్‌ను భారతీయ జనతా పార్టీ గెలుచుకున్న తీరు స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత కీలకమైన ఘట్టంగా అభివర్ణించడానికి సందేహించ నక్కర్లేదు. 'బెంగాల్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశంతో భారతదేశంలో బానిసత్వం ప్రారంభమైంది. ఇప్పుడా బానిసత్వం పోయి, జాతీయవాదం వెల్లువెత్తిందని బీజేపీ నాయకుడు ఒకరు అన్నారు.



■ **ఎ. కృష్ణారావు**

ఇండియాగేట్

నిజానికి బెంగాల్ సామాజిక, చారిత్రక నేపథ్యం, ఆ రాష్ట్రంలో ఉన్న సున్నితమైన మత, సాంస్కృతిక వాతావరణం దృష్ట్యా భారతీయ జనతా పార్టీ ఆ రాష్ట్రంలో ప్రవేశించేందుకు ఇంత కష్టపడనక్కర్లేదు. బెంగాల్ మత రాజకీయాలకు ఎప్పుడూ అతీతం కాదు. 1905లో హిందూ జనాభా ఎక్కువగా ఉన్న బెంగాల్ పశ్చిమ ప్రాంతాలను, ముస్లింలు అధికంగా ఉన్న బెంగాల్ తూర్పు ప్రాంతాలు, అస్సాంను వేరు చేస్తూ బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ కర్జన్ తీసుకున్న నిర్ణయం స్వదేశీ ఉద్యమానికి దారితీసింది. ప్లాసీ యుద్ధంలో బెంగాల్ చివరి నవాబును బ్రిటిష్ వారు ఓడించక ముందు నుంచే హిందూ ముస్లింల మధ్య సామాజిక ఘర్షణలు జరిగాయి. స్వాతంత్ర్యోద్యమంలో బెంగాల్ జాతీయవాదం కీలక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. బెంగాల్ చైతన్యశీలతపై కీలక ప్రభావం చూపిన రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, బంకించంద్ర ఛటర్జీ బెంగాల్‌లో పెల్లుబికిన నూతన జాతీయవాదానికి కారకులయ్యారు. బెంగాల్ యువతే ఎప్పుడో ఒకప్పుడు భారత్‌కు ఆధ్యాత్మిక మహోన్నతిని సాధిస్తుందని వివేకానందుడు విశ్వసించారు. బంకించంద్ర ఛటర్జీ బెంగాల్‌లోని శాక్తేయవాదాన్ని, వైష్ణవ ధర్మాన్ని సమ్మిళితం చేసి, దేశ భక్తి భావాలను పురిగొల్పేందుకు ఉపయోగించుకున్నారు. ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా సాధువులు తిరుగుబాటు చేసిన వైనాన్ని ఆయన తన నవల 'ఆనంద్ మఠ్'లో అభివర్ణించారు. స్వదేశీ స్ఫూర్తి బెంగాల్‌లోనే ప్రారంభమై దేశమంతటా విస్తరించిందని, అందుకు కర్జన్ చేపట్టిన విభజనే కారణమని గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన తర్వాత ఒక వ్యాసంలో రాశారు. గాంధీజీ నాయకత్వానికి, కాంగ్రెస్ పనితీరుకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసింది తొలుత బెంగాలీ జాతీయవాదులే. అరబిందోఘోష్, చిత్తరంజన్‌దాస్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వీరిలో ప్రముఖులు. స్థూలంగా చెప్పాలంటే జాతీయవాదం, హిందూయిజం, ముస్లిం వ్యతిరేకత బెంగాల్ రాజకీయాల్లో అంతర్లీనంగా సాగాయి. 1946లో దేశ విభజన వాతావరణం నెలకొన్న సమయంలో హుసేన్ షహీద్ సుహ్రావర్దీ హయాంలో జరిగిన హింసాకాండ, నౌఖాలీ అల్లర్లు చరిత్ర పుటల్లో కల్లోల ఘటనలుగా మిగిలిపోయాయి. కలకత్తాలో హిందువుల ఊచకోతను తీవ్రంగా వ్యతిరేకించిన హిందూ మహాసభ నాయకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశంలో తొలి హిందూవాద పార్టీ జనసంఘ్‌ను స్థాపించారు. ఆయన కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఇంత సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ.. ఆవిర్భవించిన నాలుగున్నర దశాబ్దాలకు గానీ, మోదీ అధికారంలోకి వచ్చిన పన్నెండు సంవత్సరాలకు గానీ పశ్చిమ బెంగాల్‌లో జయ పతాకను బీజేపీ ఎగురవేయలేకపోయింది. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవం ప్రారంభమయింది బెంగాల్‌లో. దేశంలో సంఘ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది కూడా బెంగాలే. దేశమంతటా విస్తరించిన మావోయిజం బెంగాల్‌లోనే ప్రభవించింది. బెంగాల్‌లోనే వామపక్ష శక్తులు మూడు దశాబ్దాలు రాజ్యమేలి ఇప్పుడు ఉనికి కోసం పోరాడుతున్నాయి. బెంగాల్‌లోనే దీదీ పాలన దశాబ్దంన్నర పాటూ సాగింది. గడచిన శతాబ్దంలో బెంగాల్ ఉదారవాద, స్వేచ్ఛావాద లౌకిక శక్తులకు, పలు భావాల సంఘర్షణకు, చైతన్యానికి ప్రతీకగా మారింది. రవీంద్రుడు మొదలు ఎందరో కళాకారులు, రచయితలు, గొప్ప సినీ దర్శకులు, నటులు, గాయకులు వంగభూమిలో ఉద్భవించారు. మరి ఇలాంటి బెంగాల్‌లో ఇప్పుడు భారతీయ జనతా పార్టీ ప్రభంజనం వీయడానికి కారణాలు ఏమిటి? సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అంగీకరించినట్లు.. వామపక్ష కార్యకర్తలే బీజేపీకి ఓటు వేసే వాతావరణం గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బెంగాల్‌లో ప్రవేశించింది. బెంగాల్ తన మూలాలను వెతుక్కుందా? తన అస్తిత్వాన్ని జాతీయ వాదంలో భాగం చేసిందా?

ఏమైనా, దేశ చరిత్రలో సంభవించిన అనేక మహోన్నత సంఘటనలకు కేంద్రంగా ఉన్న బెంగాల్‌లో జరిగిన ఈ రాజకీయ పెను మార్పునకు అంతర్లీన కారణాలు ఉండితీరతాయి. చరిత్రలో చోదకశక్తులు లేకపోతే ఏ భావనలూ భౌతిక శక్తిగా మారి పెల్లుబికే అవకాశాలుండవు. ఇప్పుడు బెంగాల్‌లో అదే జరిగిందని, అక్కడ జనం తమకోసం చేస్తున్న నిరీక్షణ ముగిసిందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. బీజేపీ నేతలు చరిత్ర చేసిన పాత గాయాలను రేపి, ప్రజల్లో హిందుత్వ భావనలను రేకెత్తించడంలో సిద్ధహస్తులు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విస్తృత కార్యకలాపాలు సరైన సమయంలో ఆజ్యం పోసేందుకు ప్రాతిపదిక కల్పిస్తాయి. ఏమైనా, నిద్రాణమైన బెంగాల్ ఆత్మ మళ్లీ మేల్కొంది. ఈ ఆవాహన ఏ పరిణామాలకు దారితీయనున్నదో ఇప్పుడే చెప్పడం కష్టం.

> గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 40శాతం ఓట్లు సాధించిన బీజేపీ ఈసారి అదనంగా మరో 5శాతం ఓట్లు సాధించడంలో సఫలమయింది. ఈ అసెంబ్లీ ఎన్నికలను ఒక యుద్ధంలా భావించి పోరాడింది. ముస్లిం ఓటు బ్యాంకు తమ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశాలు లేవని బీజేపీ మరోసారి రుజువు చేసింది.

బెంగాల్‌లో చొరబాటుదారుల వల్ల హిందువుల అస్తిత్వానికి నష్టమని, ముస్లింలకు మమతా బెనర్జీ ఇస్తున్న ప్రాధాన్యం జాతీయ భద్రతకు ప్రమాదకరమని ఎంతోకాలంగా ప్రచారం చేస్తున్న బీజేపీ, దాని మద్దతు దారులు ఈసారి విజయవంతమయ్యారు. పెద్ద ఎత్తున బలగాల్ని దించి, భయం వర్సెస్ భద్రత అన్న వాతావరణం ఏర్పరిచారు. ఎన్నికల కమిషన్ సహా అన్ని వ్యవస్థలూ వారికి అనుకూలంగా ఉన్నాయన్న ధీమా ఏర్పరిచారు. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 40శాతం ఓట్లు సాధించిన బీజేపీ ఈసారి అదనంగా మరో 5శాతం ఓట్లు సాధించేందుకు తీవ్ర యత్నాలు చేసి సఫలమయింది. ఈ ఎన్నికలను ఒక యుద్ధంలా భావించి పోరాడింది. ముస్లిం ఓటు బ్యాంకు తమ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశాలు లేవని బీజేపీ మరోసారి రుజువు చేసింది.

బెంగాల్‌లో బీజేపీ గెలుపు తర్వాత జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు తమ భవిష్యత్ గురించి పునరాలోచన చేయడం సహజం. ఈ ఓటములను ఎదుర్కొని లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం అయ్యేందుకు మరోసారి అన్ని శక్తులను ఏకం చేసే అవకాశం కాంగ్రెస్‌కు లేకపోలేదు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను పూచిక పుల్లలా తీసిపారేసిన మమతా బెనర్జీ, స్టాలిన్ ఇప్పుడు కాంగ్రెస్‌తో కలిసి పనిచేయక తప్పని పరిస్థితి నెలకొన్నది. బెంగాల్‌లో మమతా బెనర్జీ, తమిళనాడులో స్టాలిన్ ఓడిపోయినంత మాత్రాన వారి స్థానంలో బీజేపీని ఢీకొనగలిగిన శక్తి కాంగ్రెస్‌కు లేదు. మూడు దశాబ్దాల క్రితం సినీనటుడు రజనీకాంత్‌ను పీవీ నరసింహారావు ఢిల్లీకి పిలిపించి, మాట్లాడి కూడా ఆయనను రాజకీయాల్లోకి ప్రవేశించేలా చేయలేకపోయారు. అదే జరిగి ఉంటే ఇప్పుడు పరిణామాలు భిన్నంగా ఉండేవి. ఇప్పుడు కూడా సినీనటుడు విజయ్‌కు స్నేహహస్తం చాచేందుకు కాంగ్రెస్ తటపటాయించి వెనుకడుగు వేసింది. అందుకు కర్ణాటక నేత డీకే శివకుమార్ కారణమంటున్నారు. తమిళనాడులో టీవీకే విజయం నేటి తరం జెన్ జీ యువత వల్ల వచ్చిందని, ఇదే యువత 2029లో మోదీకి వ్యతిరేకంగా ఓటు వేసి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తుందని రాహుల్‌గాంధీ సన్నిహితుడొకరు వ్యాఖ్యానించారు. ఈ ఆలోచన 'ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగిరినట్లు' అన్న సామెతను గుర్తు చేస్తోంది. రాజకీయ శూన్యం ఉన్న చోటల్లా బీజేపీలా విస్తరించగల సామర్థ్యం లేకపోవడం మాత్రమే కాదు, బీజేపీని ముఖాముఖి ఓడించగల సామర్థ్యాన్ని కూడా కాంగ్రెస్ సంపాదించుకోలేకపోతోంది. అస్సాంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడమే ఇందుకు నిదర్శనం. కేరళలో పదేళ్ల ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని ఓడించి యూడీఎఫ్ అధికారంలోకి రావడం సహజంగానే జరిగి ఉండవచ్చు కానీ, ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే తాము విస్తరించడం సహజమని బీజేపీ నేతలు భావిస్తున్న విషయాన్ని విస్మరించరాదు.



బీజేపీలో ఉండే యుద్ధ స్ఫూర్తి, ఎంతో ముందుగా వ్యూహాలు రూపొందించే శక్తి, పోలింగ్ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయగలిగిన సామర్థ్యం కాంగ్రెస్‌లో కొరవడిన విషయం స్పష్టమవుతోంది. అయిదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతుండగానే మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ పేరిట దేశం దృష్టి మళ్లించి పెద్ద ఎత్తున మహిళలను తమవైపు తిప్పుకునేందుకు యత్నాలు చేసింది. ఇదే సమయంలో పంజాబ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆప్ ఎంపీలను లోబరుచుకుంది. తెలంగాణలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన తేదీని ఖరారు చేశారు. రాష్ట్రంలో చాప కింద నీరులాగా గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి కమిటీల నియామకం, సదస్సుల నిర్వహణ ఎప్పుడో ప్రారంభమైంది. పలు చోట్ల హిందూ ధార్మిక సమ్మేళనాలు జరుగుతుంటే అవెందుకో తెలియని స్థానిక కాంగ్రెస్ నేతలు అందులో పాల్గొనడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాజకీయాలు పార్ట్ టైమ్ వ్యాపకాలు కావు. బీజేపీ పైన, మోదీ పైన ఎన్ని విమర్శలైనా గుప్పించవచ్చు కానీ అవి జనాన్ని ప్రభావితం చేయగలుగుతున్నాయా అన్నదే అసలు ప్రశ్న. బీజేపీని ఎదుర్కోగల బలమైన పార్టీ యంత్రాంగాన్ని, అహర్నిశలూ పనిచేయగలిగిన కేడర్‌ను, ప్రజల్లోకి ప్రవేశించగల సైద్ధాంతిక భావనలను సృష్టించుకోకపోతే పార్లమెంట్‌లోనో, సభల్లోనో చేసే విన్యాసాలు ప్రహసనాలుగానే మిగిలిపోతాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

'విద్యుత్ విప్లవంతో' రాష్ట్రం బలోపేతం

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి చంద్రబాబు 'ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం'(పీపీపీ)తో పెట్టుబడులను ఆహ్వానించారు. థర్మల్–హైడల్ కొత్త ప్లాంట్ల ఏర్పాటుతో పాటు, ఉన్న ప్లాంట్ల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పవర్ సర్‌ప్లస్ దిశగా అడుగులు పడ్డాయి. సౌర, పవన, విద్యుత్ పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాముఖ్యాన్ని గుర్తించి వాటికి పునాదులు వేశారు. విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్, రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుల ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)ను గణనీయంగా పెంచేలా చేశారు. కాకినాడ వద్ద 'స్పెక్ట్రమ్', 'జీవీకే' వంటి ప్రాజెక్టులు ఆయన హయాంలోనే పట్టాలెక్కాయి. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ పవర్ హౌస్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా పీక్ డిమాండ్ సమయంలో తక్కువ ఖర్చుతో విద్యుత్ అందించే ప్రయత్నం చేశారు. విద్యుత్ సరఫరాలో జరిగే లైన్‌లాస్‌లను తగ్గించడానికి అధునాతన సాంకేతికతను ఉపయోగించారు. వంద శాతం మీటరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టారు. దూరదృష్టితో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి లక్షలాది ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాది సబ్‌స్టేషన్ల నిర్మాణం చేశారు. విద్యుత్ లైన్లను బలోపేతం చేశారు.


గృహ అవసరాలకు, వ్యవసాయానికి, పరిశ్రమలకు సరిపడినంత విద్యుత్‌ను అందజేయడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. ఆయన సంస్కరణలు ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ, పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలబెట్టాయి. నిరంతర విద్యుత్ సరఫరా వల్ల పరిశ్రమలు రాష్ట్రానికి రావడం ప్రారంభించాయి. ఈ సంస్కరణలు కేవలం ఒక్క విద్యుత్ శాఖలో మార్పులు మాత్రమే కాదు, అవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపయోగపడ్డాయి. క్రిసిల్–ఇక్రాల గుర్తింపు ద్వారా ఏపీ ట్రాన్స్‌కోను దేశంలోనే అత్యుత్తమ ఎలక్ట్రిసిటీ బోర్డుగా నిలిపారు చంద్రబాబు.

ఉమ్మడి రాష్ట్రంలో సబ్‌స్టేషన్ల సంఖ్యను 1,539 నుంచి 2,390కు పెంచి నాణ్యమైన విద్యుత్‌ను అందించారు. అలాగే 19 లక్షల విద్యుత్ కనెక్షన్లను క్రమబద్ధీకరించి 66.90 లక్షల కొత్త కనెక్షన్‌లతో మొత్తం 1.51 కోట్ల వినియోగదారులతో దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. వ్యవసాయ రంగానికి 37.04 శాతం విద్యుత్‌ను అందించారు. సౌర, పవన, విద్యుత్ ఉత్పత్తి రంగంలో కేంద్రంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని, అతి తక్కువ సమయంలో 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటును అధిగమించి 24 గంటలూ నిరంతర విద్యుత్ అందించిన తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు. నవ్యాంధ్రలో ఐదేళ్ళు పేద, మధ్య తరగతి వారిపై భారం పడకూడదని విద్యుత్ చార్జీలు పెంచకుండా పేదల పక్షపాతిగా నిలిచారు.

దేశంలో అయిదేళ్లలో 2014–19 మధ్య 14,655 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను నెలకొల్పారు. ఈ కాలంలో ఏడువేల మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను స్థాపించి 13 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. జగన్ తన బినామీ కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు పీపీఏ ఒప్పందాలు రద్దు చేసి యూనిట్ విద్యుత్ ధర గరిష్ఠంగా రూ.15లకు కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గత ఏడాది యూనిట్ విద్యుత్ ధర రూ.5.20లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు రూ.4.90లకు కొనుగోలు చేస్తోంది. 2029 నాటికి యూనిట్ విద్యుత్ రూ.1.19లకే కొనుగోలు చేసేలా లక్ష్యం పెట్టుకుంది. సౌర, పవన విద్యుత్ రంగంలో రూ.36 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో 160 మె.వా వాయుశక్తి ఆధారిత హైబ్రిడ్ విద్యుత్ ఉత్పత్తికి కృషి చేశారు. దేశంలో అత్యధికంగా నవ్యాంధ్రలో 2014–19 మధ్య 36లక్షల మోటార్లకు కొత్త కనెక్షన్లు ఇచ్చేలా చేశారు.

కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కాకుండా, పర్యావరణ హితమైన విద్యుత్ వైపు మొగ్గు చూపడం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం. ఏపీని సోలార్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ఆసియాలోనే అతి పెద్దదైన కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్‌లో వెయ్యి మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను స్థాపించారు. పవన విద్యుత్ ఉత్పత్తికి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పెద్ద ఎత్తున విండ్ మిల్స్ ఏర్పాటును ప్రోత్సహించారు. పునరుత్పాదక ఇంధన విప్లవం, పారిశ్రామిక రంగానికి చౌకధరకే విద్యుత్తును అందించడమే లక్ష్యంగా, అపారమైన సూర్యరశ్మి, తీరప్రాంత గాలిని సంపదగా మార్చేందుకు గ్రీన్ ఎనర్జీ పాలసీ 2024కు శ్రీకారం చుట్టారు. కేవలం విద్యుత్ భారాన్ని తగ్గించడమే కాకుండా, లక్షలాది యువతకు ఉపాధి కల్పించేందుకు ఐదు ప్రధాన విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించి గ్రీన్ ఎనర్జీ–సోలార్ విండ్–గ్రీన్ హైడ్రోజన్–గ్రీన్ అమ్మోనియా–పంప్డ్ స్టోరేజీ రంగాలలో రూ.3 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు తీసుకొచ్చారు. చంద్రబాబు లక్ష్యం ప్రకారం, ఆంధ్రప్రదేశ్ కేవలం విద్యుత్ వినియోగదారుగానే కాకుండా, దేశానికే ఇంధనాన్ని సరఫరా చేసే పవర్ హౌస్‌గా మారబోతోంది.

> చంద్రబాబు తెచ్చిన విద్యుత్ సంస్కరణల విప్లవం వల్ల రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి పెరిగి, సరఫరా స్థిరపడింది. పరిశ్రమలకు నమ్మకమైన విద్యుత్ అందుబాటులోకి రావడంతో పెట్టుబడులు పెరిగాయి. వ్యవసాయం, సేవా రంగాలు లాభపడ్డాయి. మొత్తంగా విద్యుత్ రంగం సంక్షోభం నుంచి బయటపడటమే కాకుండా, అభివృద్ధికి పునాది వేసింది.




పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధిని సమతుల్యం చేస్తూ చేపట్టిన ఈ ప్రణాళిక రాష్ట్ర రూపురేఖలను మార్చడమే కాకుండా, గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రాన్ని ప్రపంచపటంలో నిలుపుతుంది. సోలార్, విండ్ ఎనర్జీ, భవిష్యత్తు ఇంధనంగా పిలవబడే గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలపడం కోసం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల సామాన్య ప్రజలపై, పరిశ్రమలపై విద్యుత్ చార్జీల భారం తగ్గుతుంది.

సంస్కరణలతో పాటు చరిత్రలో తొలిసారి ట్రూ డౌన్ అమలు చేసి, ప్రజలపై కరెంట్ బిల్లుల భారం తగ్గించారు. ప్రజలపై పడిన రూ.20,288 కోట్ల ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరించి 1.30 కోట్ల గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చింది. వాణిజ్య కేటగిరీ వినియోగదారులకు యూనిట్ విద్యుత్ ధరను రూ.12.25 నుంచి రూ.9.95కు తగ్గించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరు లక్షల ఎస్సీ–ఎస్టీ కుటుంబాలకు రూ.1,200 కోట్లతో ఉచితంగా 2కేవీ రూఫ్‌టాప్ సోలార్లు ఏర్పాటుచేసి పేదల పక్షపాతిగా నిలిచారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందించారు. చంద్రబాబు తెచ్చిన విద్యుత్ సంస్కరణల విప్లవం వల్ల రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి పెరిగి, సరఫరా స్థిరపడింది. పరిశ్రమలకు నమ్మకమైన విద్యుత్ అందుబాటులోకి రావడంతో పెట్టుబడులు పెరిగాయి. వ్యవసాయం, సేవా రంగాలు లాభపడ్డాయి. మొత్తంగా విద్యుత్ రంగం సంక్షోభం నుంచి బయటపడటమే కాకుండా, అభివృద్ధికి పునాది వేసింది. విద్యుత్ సంక్షోభాన్ని అవకాశంగా మలచి, వ్యవస్థను పునర్నిర్మించిన నాయకుడిగా చంద్రబాబు నిలిచారు.

• **తొండపు దశరథ జనార్దన్**
టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com





ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సత్యకుమార్

20 నుంచి ఓపీ సేవలు

- అందుబాటులోకి పిడుగురాళ్ల బోధనాస్పత్రి ఓపీడీ
- వైద్య కళాశాల పనులను వేగవంతం చేయాలి
- ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం
- సమీక్షలో అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలు

గుంటూరు మెడికల్, మే 5 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య బోధనాస్పత్రిలో ఈ నెల 20 నుంచి ఔట్ పేషెంట్ సేవలు ప్రారంభిస్తామని మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రకటించారు. డాక్టర్లు, ఇతర సిబ్బంది నియామకాలు, కాలేజీ, హాస్టళ్ల నిర్మాణ పనుల ప్రగతిపై సచివాలయంలో మంత్రి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిడుగురాళ్ల బోధనాస్పత్రిలో ఈ నెల 20 నుంచి ఓపీడీ సేవలు అందుబాటులోకి వస్తాయన్న విషయాన్ని ఆ ప్రాంత ప్రజలకు

(మిగతా 8వ పేజీలో)

ఉత్పాదకత పెంపే లక్ష్యం

- వ్యవసాయ యాంత్రీకరణకు రూ.3.04 కోట్లు కేటాయింపు
- సబ్సిడీపై పరికరాలు అందజేత

8

రండి.. చేరండి.. చేర్పించండి

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం

సమీకరణ..

40 శాతం పూర్తి

- గ్రామ కంఠం, రోడ్డు నిర్వాసితుల సమస్యలు పరిష్కారం
- రైతుల సమస్యలపై 29 గ్రామాల్లో సీఆర్డీఏ కమిషనర్ సమావేశాలు
- సీఆర్‌డీఏ త్రిసభ్య కమిటీ సమావేశంలో పెమ్మసాని, నారాయణ, శ్రావణ్

నెలాఖరుకు రెండో దశ ల్యాండ్ పూలింగ్ సమాప్తం



సీఆర్డీఏ కార్యాలయంలో సమావేశమైన త్రిమెన్ కమిటీ

గుంటూరు (రాజధాని), మే 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి విస్తరణ నేపథ్యంలో తుళ్లూరు, అమరావతి మండలాల్లో జరుగుతున్న రెండో దశ ల్యాండ్ పూలింగ్ ఇప్పటికే 40 శాతం పూర్తి అయినట్లు మంత్రి నారాయణ తెలిపారు. తుళ్లూరు లోని సీఆర్‌డీఏ కార్యాలయంలో మంగళవారం త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. రాజధాని ప్రాంత భూ సంబంధిత సమస్యలు, గ్రామ కంఠాల అంశాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రభావితమవుతున్న నిర్వాసితుల సమస్యలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై కమిటీలోని రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ చర్చించారు. ఈ సమావేశం అనంతరం వివరాలను విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రాజధాని గ్రామాల్లో రైతులతో సీఆర్‌డీఏకి కొత్త కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయరామరాజు నేరుగా సమావేశాలు నిర్వహిస్తారని పెమ్మసాని తెలిపారు. గ్రామ కంఠాల సమస్యలు, ఎఫ్ఎస్ఐ అంశాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై అధికారులు స్వయంగా గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని కమిటీ సూచించినట్లు చెప్పారు. మంత్రి నారాయణ మాట్లాడు తూ రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని, తద్వారా స్థానిక సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చని కమిషనర్‌కు సూచించినట్లు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వస తులు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు, చెరువులు శ్మశానాల ఏర్పాటు వంటి పలు అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాలసీ ప్రకారమే సమస్యలకు పరిష్కారం అందిస్తామని, వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వబోమని మంత్రి స్పష్టం చేశారు. ఎల్‌పీఎస్ జోన్లలో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కౌలు పెంపు కారణంగా రైతులు సంతృప్తిగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాల కారణంగా ఇళ్లు కోల్పోతున్న వారికి ఎస్ఎస్‌పీ ద్వారా మెరుగైన పరిహారం కల్పించే అంశంపై చర్చించామన్నారు. గ్రామ కంఠాల సమస్యలు ఎవరికి ఇబ్బంది కలగకుండా పరిష్కరించాలని కమిటీ నిర్ణయించిందని చెప్పారు. సమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ భార్గవతేజ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెరగాలి

జలధార-జలహారతి సమీక్షలో కలెక్టర్ సాయికాంత్ వర్మ



గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): జలధార - జల హారతి కార్యక్రమంతో జిల్లాలో భూగర్భ జలమట్టాలు పెరగాలని కలెక్టర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జలధార-జలహారతి కార్యక్రమంపై మంగళవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన పనులు, నీటి సంరక్షణకు సాగునీటి వ్యవస్థ బలోపేతానికి తోడ్పడాలన్నారు. ప్రతి మండలంలో చెరువులు, వాటికి సంబంధించిన ఫీడర్ కాల్వలను పూర్తిగా పునరుద్ధరించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. గత ఆరు నెలల్లో భూగర్భ జలాలు, ప్రస్తుత భూగర్భ జలాలు విశ్లేషించి వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్న మండలాల్లో వాటి స్థాయిని పెంచేందుకు జలధార జలహారతి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. కాల్వలపై ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. గొలుసుకట్టు చెరువులపైనా శ్రద్ధ వహించాలన్నారు.

తలసరి ఆదాయం పెంచాలి

- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి
- ఎమ్మెల్యేల పని తీరు మరింతగా మెరుగుపడాలి
- పీజీఆర్ఎస్ ఫిర్యాదుల్ని సంతృప్తికరంగా పరిష్కరించాలి
- జిల్లా సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు



గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): 'తలసరి ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. పుష్కలంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ సేవలు పారదర్శకంగా ప్రజలకు అందించేలా చూడాలి..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఉండవల్లిలోని సీఎం నివాసంలో జిల్లా సమీక్ష జరిగింది. సమీక్షకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేశ్, ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఎస్పీ వకుల్‌జిందాల్ హాజరయ్యారు. నియోజకవర్గాల వారీగా రిపోర్టు తెప్పించుకుని ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది, ఎవరి ర్యాంకు ఎంతలో ఉన్నది, ఎక్కడెక్కడ మెరుగుపడాలనే అంశాలపై మార్గదర్శకం చేశారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతీ అర్జీని సంతృప్తికరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో సంతృప్తి శాతం మెరుగుపడాలని చెప్పారు. ప్రజలకు మంత్రులు, ఎమ్మెల్యేలే కాకుండా అధికారులు కూడా జవాబుదారీగా ఉండాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, గుంటూరు నగరానికి ఇతర ప్రాంతాల నుంచి కనెక్టివిటీ కలిగిన ప్రధాన రహదారుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. కృష్ణా పశ్చిమ కాల్వపై మంగళగిరి-తెనాలి - పెదపాలెన్ని కలిపే పాత వంతెన స్థానంలో కొత్త హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంపైన, తెనాలి-మంగళగిరి రోడ్డు, మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై కూడా చర్చ జరిగింది. గుంటూరు చానల్ ఆధునికీకరణకు రూ.369.20 కోట్లకు పరిపాలన అనుమతి మంజూరు చేసినందుకు ప్రజాప్రతినిధులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేల నివేదనలు ఇలా...

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆటో నగర్ అభివృద్ధికి రూ.40 కోట్లు అవసరమని ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ సీఎంకు నివేదించారు. ఎన్‌టీఆర్ మానస సరోవరం అభివృద్ధి చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న 16 వేల మంది పేదలకు దశల వారీగా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు.

బీసీ భవన్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, నిధులు మంజూరు చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి నివేదించారు. మోడల్ మార్కెట్‌గా పీపీపీ విధానంలో వీకే నాయుడు కూరగాయల మార్కెట్‌ని అభివృద్ధి చేయాలన్నారు.

గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ, గుంటూరు నల్లా డ్రెయిన్ అభివృద్ధి, గుంటూరు - పర్చూరు రహదారి సీసీ పేవ్‌మెంట్, కాకుమానులో డ్రెయినేజీ వ్యవస్థ, వింజనంపాడు రహదారి, గనికపూడి - ఉన్నవ రోడ్డు, పాండ్రపాడు - పుసులూరు - వరగాని రహదారి, మేడావారిపాలెం రహదారి పనులను త్వరితగతిన చేపట్టాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కోరారు.

గుంటూరు నల్లా అభివృద్ధికి భూసేకరణ, పొన్నూరు మీదగా వెళ్లే గుంటూరు - బాపట్ల రహదారి, బైపాసు రోడ్డు, పొన్నూరులో ఆటో నగర్ ఏర్పాటు, సుద్ధపల్లి, ముతుకూరు ఎత్తిపోతల పథకాలు, ఉప్పలపాడు పక్షుల కేంద్రం అభివృద్ధి, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల ప్రాంతాల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణంపై పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ సీఎంకు నివేదించారు.

తెనాలి - మంగళగిరి రోడ్డు అభివృద్ధి, రాజధానికి అనుసంధానంగా ఉండే జీటీ రోడ్డు పొన్నెకల్లు వరకు విస్తరణ, కొండవీటి వాగు అభివృద్ధి, ఎర్రవాగుపై వంతెన నిర్మాణం, పాండ్రపాడు -పుసులూరు - వరగాని రోడ్డు అభివృద్ధి, పొట్లపాడు - వెలవర్తిపాడు వరకు రహదారి, కొండవీటి కొండపై కార్మెల మాత చర్చికి ఘాట్ రోడ్డు, తాడికొండలోని శ్రీ కొండ మల్లికార్జునస్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ నివేదించారు.



వైకుంఠపురం ఆలయ గాలిగోపురానికి మెరుగులు

6

నేడు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వ్యాధుల స్క్రీనింగ్‌పై సమీక్ష

కేంద్ర వైద్య బృందం స్వయంగా పరిశీలన

గుంటూరు మెడికల్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బా స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు, నిర్వహిస్తున్న పలు రకాల వ్యాధుల స్క్రీనింగ్‌పై కేంద్ర వైద్య బృందం సమీక్షించింది. కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నుంచి జనాభా పరిశోధన సంస్థ బృందం మంగళవారం



జీజీహెచ్ వార్డుల్లో పర్యటిస్తున్న ఎన్ఆర్‌సీ కేంద్ర బృందం

జిల్లాలో పర్యటించింది. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన సీనియర్ రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ వై రమణ ఆధ్వర్యంలో ఈ బృందం మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని సందర్శించింది. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మితో సమావేశమై చర్చించింది. పుట్టుకతో వచ్చే రుగ్మతలు, వ్యాధులు, లోపాలు, ఎదుగుదలలో జాప్యం ఉన్న పిల్లలను, పరీక్షించి, తక్షణ చికిత్సల కోసం జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి రిఫర్ చేయడం, ఫాలో అప్ చేయడం, క్షేత్ర స్థాయిలో ఎదుర్కొనే సమస్యల గురించి సమీక్ష జరిపి, జిల్లా ప్రగతి కోసం మార్గదర్శకాలను సూచించింది. అనంతరం కేంద్ర బృందం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని, శిశు వైద్య విభాగంలో ఉన్న పౌష్టికాహార పునరావాస కేంద్రాన్ని, తెనాలి జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సత్వర చికిత్స కేంద్రాన్ని సందర్శించింది. ఆయా కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంది. కేంద్ర బృందం వెంట డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సుజాత, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్, మేనేజర్ శిరీష ఉన్నారు.

ఆర్టీసీ.. కిటకిట



- 100 శాతానికి చేరిన ఆక్యుపెన్సీ
- వేసవి సెలవులతో ప్రయాణాలు రద్దీ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవి శెలవుల నేపథ్యంలో జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ కొనసాగుతోంది. విద్యా సంస్థలకు సెలవులు, శుభకార్యాలతో ప్రయాణాలు పెరిగాయి. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ప్రయాణాలకు పలువురు ముందుకు వస్తున్నారు. జిల్లాలో సోమవారం ఐదు డిపోల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) వచ్చింది. ఆర్టీసీలో స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చిన నాటి నుంచి బస్సుల్లో మహిళల రద్దీ పెరిగింది. తాజాగా వేసవి శెలవులతో విద్యార్థులు స్వస్థలాలకు వెళ్లడంతో పలువురు బంధువుల ఊళ్లకు కూడా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఫలితంగా ఆర్టీసీ ప్రయాణాలు జోరందుకున్నాయి. సోమవారం గుంటూరు 1, 2 డిపోలతో పాటు మంగళగిరి, పొన్నూరు, తెనాలి డిపోలలో 100 శాతం ఓఆర్ దాటింది. గతంలో ఏదో ఒక డిపోలో 100 శాతం ఓఆర్ వచ్చిన సందర్భాలుండేవి. ఇప్పుడు అన్ని డిపోల పరిధిలో ఆక్యుపెన్సీ పెరుగుతోంది. ఒక్క సోమవారం వచ్చిన ఆక్యుపెన్సీతో జిల్లాలో చార్జీల ద్వారా రూ.81 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

పాలీసెట్‌లో.. 92.95 శాతం

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు

గుంటూరు(విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన పాలిసెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. గుంటూరు జిల్లా నుంచి 4894 మంది పరీక్షకు హాజరు కాగా 4589 మంది(92.95 శాతం) ఉత్తీర్ణులయ్యారు. పల్నాడు జిల్లా నుంచి 5034 మంది పరీక్షకు హాజరుకాగా 4653 మంది (92.47 శాతం), బాపట్ల జిల్లా నుంచి 2446 మందిలో 2243 మంది(91.70 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పాలిసెట్‌లో గుంటూరు జిల్లా నుంచి చేతన్ ఆనందరామ్ 132వ ర్యాంకు, చిలక సుజిత్ ప్రహర్ష 159, ఎస్ యశ్వంత్ 322 ర్యాంకులతో తొలి మూడుస్థానాల్లో నిలిచారు. బాపట్ల జిల్లా నుంచి శశిధర్ 569 ర్యాంకు, గర్నెపూడి నిషాంత్ 604, భవిరెడ్డి దివ్యతేజశ్రీ 695, పల్నాడు జిల్లా నుంచి షేక్ ఫజిలాతబసుమ్ 155, తాటిపర్తి బాలశంకర్ 189, అచ్యుత పార్ధ 253 ర్యాంకులతో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.




ఉష్ణోగ్రత

6-5-26	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	27
తెనాలి	37	27
నరసరావుపేట	41	26
రెంటచింతల	42	27
బాపట్ల	36	27
చీరాల	36	27

ఖరీఫ్‌కు.. ఎరువులు సిద్ధం

- ప్రణాళిక రూపొందించిన వ్యవసాయశాఖ
- 57 వేల ఎంటీలకుపైగా అవసరమని అంచనా
- ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన 50 శాతం నిల్వలు



గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): 2026 - 27 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌కు నెలవారీ ఎరువుల ప్రణాళికని జిల్లా వ్యవసాయ శాఖ రూపొందించింది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ(మ్యూరియేట్ ఆఫ్ పొటాష్), ఎస్ఎస్‌పీ (సింగిల్ సూపర్ ఫాస్పేట్) ఎరువులు ఏ నెలలో ఎంత మోతాదులో రైతులకు అవసరమౌతాయో ముందస్తుగానే అంచనా వేసింది. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదించింది. దాంతో సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు ఎరు వులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టింది. ఇరాన్ - అమెరికా యుద్ధం కారణం గా ఎరువుల రవాణాకు ఆటంకాలు తలెత్తుతు న్న దృష్ట్యా బయో ఫెర్టిలైజర్స్ వినియోగంపై అవగాహన కలిగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ఏప్రిల్, మే నెలల్లో రైతులు కొద్ది మోతాదులో యూరియా కొనుగోలు చేస్తారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న వ్యవసాయశాఖ ఈ సంవత్సరం ఏప్రిల్‌లో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ కలిపి 2030 మెట్రిక్ టన్నుల నిల్వలను అందుబాటులోకి తీసు కొచ్చింది. మే నెలకు 1139 మెట్రిక్ టన్నులు, జూన్‌లో 3345, జూలైలో 6520, ఆగస్టులో 21226, సెప్టెంబరుకు 23209 ఎంటీల యూ రియా నిల్వలు అవసరమౌతాయని అంచనా వేశారు. జిల్లాలో అధికంగా యూరియా 27,126, డీఏపీ 12799, కాంప్లెక్స్ 14439 మెట్రిక్ టన్నులకు డిమాండ్ ఉండటంతో వాటి స్టాక్స్ తెప్పించడంపై అధికారులు దృష్టి సారించారు.

గోదాముల్లో నిల్వలు ఇలా..

జిల్లాలో ప్రస్తుతం గోదాముల్లో యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎస్ఎస్‌పీ, కాంపోస్టు, ఎఫ్‌వోఎం కలిపి 11332.22 మెట్రిక్ టన్నులు నిల్వలున్నాయి. హోల్‌సేలర్ల వద్ద 11,160, రిటైలర్స్ వద్ద 6875.9, రవాణాలో 258.25 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. ఇవి ఖరీఫ్‌లో రైతుల నుంచి వచ్చే డిమాండ్‌ని ఇంచుమిం చుగా 50 శాతం వరకు తీరుస్తాయి. మిగతా స్టాకుని సాధ్యమైనంత త్వరగా తెప్పించడంపై అధికారులు దృష్టి సారించాలి.

నాటికల నుంచే సినిమాల్లోకి కళాకారులు

- సినీ రచయిత సాయిమాధవ్
- ఖాజీపేటలో ముగిసిన నాటికల పోటీలు

మొక్కజొన్న రైతులకు అంబటి దగా

క్యాంపస్ ఇంటర్వ్యూలో 55 మంది ఎంపిక

వన్‌టైం ఆపర్చునిటీకి షెడ్యూల్ విడుదల

రాష్ట్ర పండుగగా వెంకటాద్రి నాయుడి జయంతి

6

మారం.. మోసం

- ఆర్థిక మోసాలకు నయా రూపం
- వ్యాపార సంస్థల ధ్రువీకరణ పత్రాల ట్యాంపరింగ్
- రుణాలతో జల్సాలు.. కేసులున్నా పదేపదే అవే నేరాలు
- దర్యాప్తులో వెలుగుచూస్తోన్న మోహన్ గ్యాంగ్ మోసాలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఒక వ్యాపారం మొదలుపెడతారు. ఏజెన్సీల బ్యాంకు ఖాతాల వివరాలు, జీఎస్టీ వివరాలు సంపాదిస్తారు. వాటిని ఉపయోగించుకుని నకిలీలకు నయారూపం ఇస్తారు. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల నుంచి రూ.లక్షల్లో రుణాలు పొందుతారు. ఇదీ గుంటూరుకు చెందిన మారం మోహన్ అండ్ గ్యాంగ్ ఆర్థిక మోసాల తీరు. మోహన్‌తోపాటు పది మంది కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి మోసాలు చేస్తున్నారు. ఇటీవలే ఈ గ్యాంగ్‌లో మోహన్‌తోపాటు కొత్తవలస శ్రీనివాసరావును సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల దర్యాప్తులో మారం ముఠా చేసిన మోసాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. మారం మోహన్ గుంటూరు జిల్లాలో వస్త్రదుకాణం నిర్వహించగా కోవిడ్ సమయంలో నష్టం వచ్చింది. బెట్టింగ్‌లు, విలాసాలు అప్పులు ఊబిలోకి నెట్టేశాయి. దీంతో కొంతమంది స్నేహితులతో కలిసి గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి సులువుగా డబ్బులు సంపాదించడానికి ఆర్థిక మోసాలకు బాటలు వేశాడు. సరుకును సరఫరా చేసే ఏజెన్సీలతో సత్సంబంధాలు పెట్టుకుని వాటి జీఎస్టీ నంబర్లు, లేబర్ లైసెన్స్ నంబర్లు, బ్యాంక్ ఖాతాల నంబర్లను మార్ఫింగ్ చేయించి వాటి యజ మానుల పేర్ల స్థానంలో గ్యాంగ్‌లో ఉన్న వారి పేర్లను అమర్చేవాడు. వాటి ద్వారా ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల నుంచి రుణాలు మంజూరు చేయించుకునేవాడు. ఇలా ఈ గ్యాంగ్ 13 ఆర్థిక మోసాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇలా లబ్బీపేటలోని ఓ సంస్థ నుంచి రూ.2కోట్ల వరకు రుణం పొందడంపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి తర్వాత సీఐడీకి బదిలీ చేశారు.

ముందుకు రాని సంస్థలు

విజయవాడ రాజ్‌ఎంటర్‌ప్రైజెస్ యజమాని మధుసూదన్ ఫిర్యాదుతో మారం బ్యాచ్ బాగోతాలు బయటకు వచ్చాయి. సీఐడీ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత అతడు మళ్లీ ఆర్థిక మోసాలు మొదలుపెట్టాడు. విజయవాడలో మొత్తం మూడు ప్రైవేటు సంస్థల నుంచి కోట్లలో రుణాలను పొందాడు. ఈ మూడు సంస్థల్లో ఒకదానికి రుణానికి తిరిగి చెల్లించేశాడు. ఇప్పుడు ఆ సంస్థ ఫిర్యాదు చేయడానికి, వివరాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. మరో సంస్థను మూసివేశారు. ఇంకో సంస్థ పోలీసులకు సహకరించడం లేదు.

భూ సమీకరణకు 2,676 ఎకరాల అందజేత

9న మహాపురుషుడు మండలి నాటకం

- ఏఐ డిజిటల్ సాంకేతికత జోడింపు
- 45 మంది కళాకారులతో ప్రదర్శన

వీర్యకణాలు ఇక్కడ భద్రం

8

- పశుసంవర్ధకానికి అండగా చేబ్రోలులోని ఘన వీర్య కేంద్రం

నేడు బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వైకుంఠపురం ఆలయ ముఖద్వారం

తెనాలి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాంతంలో ప్రసిద్ధ వైకుంఠపురం ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి ఈ నెల 12 వరకు వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ప్రతిరోజు వాహనసేవతో గ్రామోత్సవం జరుపుతారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని తిలకించి తరించాలని ఆలయ కమిషనర్ అనుపమ కోరారు.

నాటికల నుంచే సినిమాల్లోకి కళాకారులు

● సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ ● ఖాజీపేటలో ముగిసిన నాటికల పోటీలు



స్త్రీ మాత్రే నమ: నాటికలో ఓ సన్నివేశం

తెనాలి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సినీ, టీవీ రంగంలో పేరొందిన కళాకారులంతా నాటక రంగం నుంచి వచ్చిన వారేనని సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ అన్నారు. రూరల్ మండలంలోని ఖాజీపేటలో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా రంగస్థలాన్ని ప్రోత్సహిస్తూ కళాకారులకు జీవన భృతిని కల్పిస్తున్న సంస్థలను అభినందించారు. ఈ సందర్భంగా గోపరాజు చక్రపాణి జీవిత సాఫల్య పురస్కారాన్ని కాకినాడకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు సీఎస్ ప్రసాద్‌కు ప్రదానం చేశారు. అనంతరం పూర్ణిమ రచించి, ఉదయ్ దర్శకత్వం వహించిన హైదరాబాద్ స్వర్ణ సూర్య డ్రామా లవర్స్ కళాకారులు ప్రదర్శించిన స్త్రీ మాత్రే నమ:, స్నిగ్ధ రచించి, రాజా దర్శకత్వం వహించిన దివిలి చంద్రమాంపల్లి స్నేహా ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన పుట్టింటి సంపద నాటికలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమాన్ని సుంకర శ్రీనివాసరావు, సూర్యనారాయణ, సుబ్బారావు, ఉదయ్, రమణ, విజయ్, తదితరులు పర్యవేక్షించారు.

మొక్కజొన్న రైతులకు అంబటి దగా



మామిళ్లపల్లిలో మొక్కజొన్న నిల్వ ఉంచిన గోదాము ముందు నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

పొన్నూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణ తన అనుచరులతో పెట్టుబడి పెట్టించి మొక్కజొన్న రైతుల వద్ద పంటను తక్కువ ధరకు కొని దగా చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో అంబటి మురళి ఇంటి వద్దనే ఉన్న గోదాం ముందు మంగళవారం టీడీపీ నాయకులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ, అంబటి మురళీకృష్ణ రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరు వేదికగా మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీ నేతలు మొక్కజొన్న రైతులకు మద్దతు ధర కల్పించాలని దొంగ దీక్ష చేశారని ఎద్దేవ చేశారు. ఆయన రైతుల నుంచి తక్కువ ధరకు మొక్కజొన్న కొనుగోలు చేసి నిల్వ ఉంచుకొని రూ. 500 ఎక్కువకు విక్రయించుకొని జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. దళారులకు నాయకత్వం వహిస్తూ మొక్కజొన్న అక్రమ నిల్వలు చేయడమే కాకుండా ప్రతి రోజు బురదజల్లుడు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో పొన్నూరు చేబ్రోలు పెదకాకాని మండలాల టీడీపీ అధ్యక్షులు బండ్లమూడి బాబురావు, ఫైల వెంకటరామరాజు, వలివేటి మురళీకృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, టీడీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, తదితరులు పాల్గొన్నారు. నిరసన అనంతరం టీడీపీ నాయకులు ప్రదర్శనగా పొన్నూరు పట్టణానికి చేరుకొని అంబటి మురళీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్‌కు వినతి పత్రాన్ని అందించారు.

ఎస్‌ఆర్‌ఎంలో అడ్వాన్స్‌డ్ అల్గారిథమ్స్ వర్క్‌షాప్

● ఐబీఎం క్వాంటమ్ టెక్నాలజీ నిపుణులతో సమగ్ర శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్

తుళ్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో మంగళవారం అడ్వాన్స్‌డ్ క్వాంటమ్ అల్గారిథమ్స్ వర్క్‌షాప్ జరిగింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌నకు దేశం నలుమూలల నుంచి సుమారు 300 మందికి పైగా విద్యావేత్తలు, పరిశోధక శాస్త్రవేత్తలు, వివిధ రంగాల నిపుణులు హాజరయ్యారు. ఐబీఎం నుంచి విచ్చేసిన క్వాంటమ్ టెక్నాలజీ నిపుణులు పలువురు క్వాంటమ్ టెక్నాలజీ, అల్గారిథమ్స్ అభివృద్ధిపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి పీఎస్ ప్రద్యుమ్న మాట్లాడుతూ, చాట్ జీపీటీ అందుబాటులోకి వచ్చాక వివిధ రకాల సమస్యలకు పరిష్కారం లభించినట్లే, క్వాంటమ్ టెక్నాలజీతో కూడిన కంప్యూటర్లు అందుబాటులోకి వస్తే దేశ స్వరూపమే మారిపోతుందన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ అందరికీ అందుబాటులో ఉండాలని, యువ శాస్త్రవేత్తలు, టెక్నాలజీ నిపుణులు టెక్నాలజీని అభివృద్ధి పరిచే విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ స్వాగత ఉపన్యాసం ఇచ్చి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, క్యుబిక్ ఫోర్స్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎల్.వెంకట సుబ్రమణియన్, ఐబీఎం గ్లోబల్ స్ట్రాటజిక్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ లీడ్ డాక్టర్ నిక్ బ్రాండ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న ఎస్సీ టెల్‌ఎగ్జామ్ ఉత్తీర్ణులైన ముగ్గురు గిరిజన పాఠశాల విద్యార్థినులకు వి.కృష్ణవేణి, సీహెచ్ భవానీ, ఆర్.విమోచనకు సర్టిఫికెట్లతో పాటు ఒక్కొక్కరికి రూ. 5వేలు నగదు పారితోషికాన్ని అందించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత సంస్థలు సీఎస్ఐఆర్, సీడాక్, ఎన్ఎస్టీఎల్, వివిధ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, ఎస్సీటెల్ క్వాలిఫై విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులు, పరిశోధక ప్రముఖులందరూ కలిపి సుమారు 300 మందికి పైగా హాజరయ్యారు.

డిజిటల్ పాలన మరింత బలోపేతం : మన్నవ మోహనకృష్ణ



మంత్రి లోకేశ్‌తో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిజిటల్ పాలనను మరింత బలోపేతం చేసే దిశగా ఏపీటీఎస్ కీలక కార్యక్రమాలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్‌తో మంగళ వారం ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీటీఎస్ చేపడుతున్న కీలక కార్యక్రమాలు, కొత్తగా అమలు చేస్తున్న సంస్కరణలు, ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు తీసుకొస్తున్న టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సుల గురించి మన్నవ మోహన కృష్ణ లోకేశ్‌కు వివరించారు. మంగళగిరిలో ఏపీటీఎస్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయబోయే ఆధునిక పార్క్ ప్రాజెక్టుపై చర్చించారు. గూగుల్ సంస్థతో రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, క్వాంటం వ్యాలీ వంటి అత్యాధునిక ప్రాజెక్టులపై కూడా చర్చ జరిగింది. ప్రపంచ స్థాయి సంస్థల ను ఆంధ్రప్రదేశ్‌కు ఆకర్షించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత పారదర్శక పాలన ద్వారానే అవినీతి నిర్మూలన సాధ్యమని నారా లోకేశ్ ఈ సందర్భంగా చెప్పినట్లు మోహనకృష్ణ తెలిపారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేశ్‌కు మోహన కృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 55 మంది ఎంపిక

● మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి



నియామక పత్రాలు అందజేస్తున్న ఇండోసోలార్ కంపెనీ ప్రతినిధులు

గుంటూరు (విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళ వారం నిర్వహించిన క్యాంపస్ ఇంట ర్వ్యూలో 55 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జాస్తి ఉషారాణి ఓ ప్రకటనలో తెలిపారు. సోలార్ ప్యానల్స్ తయారీ కంపెనీ ఇండోసోలార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 18 పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు. ఇంటర్వ్యూలకు మొత్తం 132 మంది హాజరు కాగా వీరిలో 55 మంది ఎంపికైనట్లు వివరించారు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.25 వేల వేతనం అందుతుందని తెలియజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	95,280
అమ్మకాలు	93,292
నిల్వ	28,766

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	22800
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	21500
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13500	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14500	22500
దేవనూరు డీలక్స్	15000	22000
ఆర్మూరు	13000	19200
334	----	----
నెంబరు. 5	----	----
273	----	----
341	----	----
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	----	----
బ్యాడిగి 355	----	----
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	11000

వన్‌టైం ఆపర్చునిటీకి షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో వన్ టైం ఆపర్చునిటీ కింద పలు పీజీ కోర్సుల పరీక్షలకు నోటి ఫికేషన్‌ను పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. 2016, 2017లో బీ ఫార్మసీ చదివిన విద్యార్థులు మూడు పేపర్ల కన్నా తక్కువుంటే రూ.6 వేలు, మూడు పేపర్ల కన్నా ఎక్కువుంటే ఒక్కొక్క పేపరుకు రూ.2వేలు ఫీజు చెల్లించాలన్నారు. ఎమ్ ఫార్మసీ మూడు పేపర్ల కన్నా తక్కువుంటే రూ.6వేలు, ఆపైన ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాలన్నారు. ఎల్ఎల్‌బీ 3,5 సంవత్సరాల కోర్సుకు మూడు పేపర్లకు రూ.6వేలు, ఆ పైన ఒక్కొక్క పేపర్‌కు రూ.1000 ఫీజు చెల్లించాలన్నారు. వై 14, వై 16, వై 17, వై 20 వారికి ఈ అవకాశం కల్పించామన్నారు. బీఈడీ మూడు పేపర్లకు రూ.6 వేలు, ఆ పైన ఒక్కొక్క సబ్జెక్టుకు ఫీజు రూ.1000 చెల్లించాలన్నారు. వై 15, వై 16, వై 23 వారికి అవకాశం కల్పించామన్నారు. విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని, 27న అపరాధ రుసుం రూ.500తో చెల్లించొచ్చన్నారు. ఈ పరీక్షలు జూలై 13వ తేదీన జరుగుతాయని సీఈ తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

● బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహణ

గుంటూరు (విద్య) మే 5 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రైల్వే రిక్రూట్మెంట్ (గ్రూప్ డీ), ఏపీ హైకోర్టు నిర్వహించే పోటీ పరీక్షలకు అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కె.మయూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్, స్టైఫండ్ అందజేస్తామని వెల్లడించారు. అభ్యర్థులు పదో తరగతి, డిగ్రీ మార్కుల జాబితా, ఆదాయ, కులధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో పాటు ఏపీ హైకోర్టు, రైల్వే గ్రూప్ డీ పరీక్షలకు దరఖాస్తు చేసినట్లు ఉన్న నకలు పంపించాలని సూచించారు. ఇతర వివరాలకు 0863-2350071 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర పండుగగా వెంకటాద్రి నాయుడి జయంతి

● సీఎం చంద్రబాబుకు రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ కృతజ్ఞతలు



సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలుపుతున్న రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్

గుంటూరు కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): అమరావతి జమీందార్ రాజా వాసిరెడ్డి జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడం అభినందనీయమని రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ అన్నారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సుధా స్వరూప్ మాట్లాడుతూ, వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడి సేవలకు గుర్తింపు లభించిందని అన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



డ్రైయిన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

వర్షాకాలానికి ముందే డ్రైయిన్ల నిర్మాణం పూర్తి కావాలి

● కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ముందే నగరంలో నిర్మాణంలో ఉన్న మేజర్ డ్రైయిన్ల నిర్మాణం పూర్తి కావాలని, ప్రతి అభివృద్ధి పనిలో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. నల్లపాడు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, జెకె రోడ్, సంతోష్ నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం నగరంలో ఏ ప్రాంతం ముంపునకు గురి కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో అభివృద్ధి పనుల్లో నాణ్యతపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, పనుల్లో నాణ్యతను థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీలతో పాటు, ఇతర ఏజెన్సీలతో కూడా తనిఖీ చేయిస్తామన్నారు. పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఈఈ విష్ణు, డీఈఈ శ్రీనివాస్, ఇంజనీరింగ్ ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా జీఎంసీ

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగాల ఔట్‌సోర్సింగ్ కార్మికులు బి.జగన్నాయక్ (రూ.5.15 లక్షలు), యస్.ప్రసాద్ (రూ.2లక్షలు), సి.హెచ్ కోటేశ్వర రావు (రూ.1 లక్షలు), యం.ఆంటోనీ (రూ.2.15లక్షలు) కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియాకి సంబంధించిన డీడీలను మంగళవారం కమిషనర్ చాంబర్‌లో అందించారు. కార్మికులకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించామని తెలిపారు.

ప్రైవేటు వెటర్నరీ సర్జన్స్ కావాలి

గుంటూరు కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి కుక్కల నియంత్రణ కోసం చేపట్టిన యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ), యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ (ఏఆర్‌వీ) కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి జీఎంసీ ఏబీసీ సెంటర్లతో పాటు, గౌరవ వేతనం ప్రాతిపదికన సేవలందించడానికి ఆసక్తి కలిగిన ప్రైవేట్ వెటర్నరీ క్లినిక్ నిర్వహిస్తున్న అనుభవజ్ఞులైన వెటర్నరీ సర్జన్లను ఆహ్వానిస్తున్నామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ఆసక్తి గల వైద్యులు గుంటూరు నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలోని మెడికల్ హెల్త్ ఆఫీసర్ లేదా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (76758 33612)ను సంప్రదించి తమ సమ్మతి, వివరాలను తెలియచేయాలని, అర్హులైన వారికి అవసరమైన సౌకర్యాలు, విధివిధానాలు, ప్రభుత్వ మార్గదర్శకాలపై పూర్తి సమాచారం అందిస్తామని తెలిపారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ విజయ, డాక్టర్ రాఘవశర్మ

అంకినీడు అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్‌కు జాతీయ గుర్తింపు

● స్ట్రోక్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నేషనల్ అవార్డు

గుంటూరు మెడికల్, మే 5 (ఆంధ్రజ్యోతి): లలిత (గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్)లోని అంకినీడు అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్.. జాతీయ స్థాయిలో నేషనల్ స్ట్రోక్ కాంక్లేవ్ అవార్డ్ 2026 వాయిస్ ఆఫ్ హెల్త్‌కేర్ విభాగంలో ప్రతిష్ఠాత్మకమైన స్ట్రోక్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డు కైవసం చేసుకుంది. పక్షవాత వైద్య చికిత్సల్లో అత్యున్నత ప్రమాణాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ కేంద్రం చూపుతున్న కృషికి ఈ పురస్కారం లభించింది. మే మూడో తేదీన న్యూఢిల్లీలో జరిగిన మూడో నేషనల్ స్ట్రోక్ కాంక్లేవ్ వేదికపై న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.విజయ, కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవశర్మ ఈ అవార్డును స్వీకరించారు. దేశవ్యాప్తంగా పక్షవాత చికిత్స వ్యవస్థలను బలోపేతం చేయడానికి వైద్యులు, పాలసీ నిర్ణేతలు, పరిశోధకులు, ప్రజారోగ్య నిపుణులు ఒక వేదిక పైకి వచ్చి పక్షవాత నివారణ, ముందస్తు గుర్తింపు నుంచి అత్యవసర చికిత్సలు, పునరావాసం వరకు అన్ని దశల్లోనూ భారతదేశాన్ని 'స్ట్రోక్‌రెడీ'గా మార్చడంపై న్యూఢిల్లీ నేషనల్ స్ట్రోక్ కాంక్లేవ్‌లో చర్చించారు. ఈ సదస్సులో "భారతదేశంలో స్ట్రోక్ అక్రెడిటేషన్, స్టాండర్డైజేషన్" అనే అంశంపై డాక్టర్ పి.విజయ ప్రసంగించారు. కాగా భారతదేశంలో మొట్టమొదటి అక్రెడిటెడ్ (గుర్తింపు పొందిన) అడ్వాన్స్‌డ్ స్ట్రోక్ సెంటర్‌గా అంకినీడు స్ట్రోక్ యూనిట్‌కు ప్రత్యేక గుర్తింపు కలిగి ఉంది. జాతీయ స్థాయిలోనే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలోనూ లలిత హాస్పిటల్ గతంలో పలు అవార్డులను కైవసం చేసుకుంది. వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ నుంచి గోల్డ్ స్టేటస్ అవార్డునేకాక, అంతర్జాతీయంగా గుర్తించిన ఇంటర్నేషనల్ రెస్క్యూ రిజిస్ట్రీ ద్వారా స్ట్రోక్ చికిత్సల్లో ప్రతిభకు గుర్తింపుగా డైమండ్ స్టేటస్ అవార్డును సాధించారు.

వాలీబాల్ లీగ్-4 పోటీల విజేత రెడ్ చిల్లీస్ కొలనుకొండ

● బహుమతులు అందజేసిన మంత్రి గొట్టిపాటి



టోర్నమెంట్ విజేత రెడ్ చిల్లీస్ జట్టుతో మంత్రి గొట్టిపాటి, తదితరులు

తాడేపల్లి టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ సహకారంతో తాడేపల్లి క్రీడా ప్రాంగణంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరుగుతున్న మంగళగిరి వాలీబాల్ లీగ్-4 పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 64 జట్లు పోటీపడ్డాయి. చివరిరోజు 6వ బెటాలియన్ లయన్స్ టీమ్, రెడ్ చిల్లీస్ కొలనుకొండ మధ్య ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రెడ్‌చిల్లీస్ కొలనుకొండ టీమ్ విజేతగా నిలిచింది. అనంతరం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ముత్తమల అశోక్ రెడ్డిలు హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి క్రీడాకారులలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు మంత్రి నారా లోకేశ్ క్రీడా పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.

నల్లపాడు రోడ్డు కాలనీల్లో తాగునీటి ఎద్దడి

● సమస్య పరిష్కారంలో జీఎంసీ యంత్రాంగం నిర్లక్ష్యం

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రోడ్డులోని పలు కాలనీల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడిపోతున్నారు. అసలే మండుటెండలు.. మరోవైపు తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుగుంట పక్కనున్న మురికిపేట, నల్లపాడు రోడ్డులోని దుర్గానగర్, శ్రీ లక్ష్మీనగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, ఆదర్శనగర్ ప్రాంతాల్లో వారం రోజులుగా తాగునీటి కొరత తీవ్ర రూపం దాల్చింది. మిర్చియార్డు ఎదురు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా సర్వీసు రోడ్డు పనులు చేపడుతున్నారు. అక్కడ ప్రొక్లెయిన్‌లతో రోడ్డు పనులు చేస్తుండటంతో పైపులైన్‌లు అస్తవ్యస్తంగా మారి తాగునీటి సరఫరాకు ఇబ్బందులు వస్తున్నాయని మునిసిపల్ సిబ్బంది చెబుతున్నారు. అయితే నెల రోజులకుపైగానే తమకు తాగునీటి సమస్య ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అసలు నీటి సరఫరా ఏ సమయంలో ఉంటుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని, కొన్ని సందర్భాల్లో అర్ధరాత్రుళ్లు నిద్ర మానుకొని నీటి కోసం జాగారం చేయాల్సి వస్తోందని వారు వాపోయారు. ఆదర్శనగర్‌లో ఐదు రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. వాటర్ ట్యాంక్‌లు అరకొరగా అక్కడకు వస్తున్నాయని వారు చెబుతున్నారు. తాగునీటిని వాటర్ ప్లాంట్స్ వద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి సరఫరా యథావిధిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.



లక్ష్మీనగర్ 2/4వ లైనులో మంచినీటి ట్యాంకు వద్ద క్యూలో నిల్చున్న మహిళలు



కారల్ మార్క్స్‌కు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పీడిత వర్గాలకు మార్క్సిజమే మార్గదర్శి

గుంటూరు(తూర్పు), మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పీడితవర్గాలకు మార్గదర్శి మార్క్సిజమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి అన్నారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం కారల్ మార్క్స్ 208వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్క్స్ రచనలు నేటికి ప్రపంచానికి దిక్సూచిగా నిలిచాయన్నారు. కార్మిక, శ్రామిక వర్గాలపై జరుగుతున్న దోపిడీని వెలికితీసిన మహనుభావుడు మార్క్స్ అని కొనియాడారు. దాస్ కాపిటల్ వంటి గ్రంథాలు సమాజంలోని అసమానతలను అర్థం చేసుకునేందుకు మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత కాలంలో యుద్ధాలు, మతోన్మాదం పెరుగుతున్నాయని, దేశంలో నరేంద్ర మోదీ మతవాదాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో మార్క్సిజం సారాంశాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకువెళ్ళాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, చిన్న, చైతన్య, పీవీ జగన్నాథం, శ్రీనాథ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

● తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు) మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో దళితుల రిజర్వేషన్లను పరోక్షంగా రద్దు చేయడానికి కుట్ర జరుగుతోందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం గుంటూరులో క్రిస్టియన్ సేవ సంఘ్ ఆధ్వర్యంలో దళితలకు క్రైస్తవ హోదా రద్దు అనే అంశంపై సభ నిర్వహించారు. మల్లెల రాజు అధ్యక్షతన జరిగిన సభలో కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులకు క్రైస్తవ హోదా రద్దు అంశాన్ని ముందుకు తెచ్చి, రాష్ట్రంలోని దళితులంతా క్రైస్తవులే అనే ప్రచారం ద్వారా రిజర్వేషన్లను తొలగించే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రద్దు చేయాలనే చర్చలతో పాటు, దళితులందరిని క్రైస్తవులుగా ముద్ర వేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. రిజర్వేషన్లు మతంతో సంబంధం లేకుండా కులం ఆధారంగా ఎదుర్కొన్న వివక్ష, వెనుకబాటుతనం కారణంగా కల్పించినవని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ మౌనంగా ఉండకుండా తమ హక్కుల కోసం మాట్లాడాలని పిలుపునిచ్చారు. ఈ సభలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కే రమేష్, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కొలికపూడి శ్రీనివాసరావు

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

● డీఎస్‌వో కోమలి పద్మ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులోని సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని రేషన్ కార్డులలో 16,74,646 మంది సభ్యులుండగా ఇప్పటి వరకు 16,43,743 మంది ఈకేవైసీ చేసుకున్నారని, ఇంకా 20,993 మంది ఈకేవైసీ చేయించుకోవలసి ఉందన్నారు. ఈ సారి చివరి అవకాశంగా మిగిలిన వారు వారికి సమీపంలోని రేషన్ షాపులలో, సచివాలయంలో సంప్రదించి వెంటనే ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకేవైసీ చేసుకోనివారికి భవిష్యత్తులో రేషన్ పంపిణీ విషయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని చెప్పారు.

పీడీఎస్ బియ్యాన్ని సద్వినియోగించుకోవాలి

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మంచి ఆహారం అందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం పోషకాలతో కూడిన బలవర్ధకమైన బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా పంపిణీ చేస్తోందని జిల్లా పౌరసరఫరాల అధికారి పి.కోమలి పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'బియ్యం... కయ్యం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. బియ్యాన్ని ఇతరులకు విక్రయించకూడదని స్పష్టం చేశారు. పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసినా, అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా రేషన్ షాపు స్టాకులో 1.5 శాతానికి మించి వ్యత్యాసం ఉంటే ఆ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేస్తామన్నారు. ఇప్పటివరకు 46 షాపులలో వ్యత్యాసం గుర్తించి చర్యలు తీసుకున్నామన్నారు. కొంతమంది డీలర్లు ఆరోపిస్తున్నట్లు తనిఖీ సిబ్బంది బియ్యం బస్తాలు తెచ్చి డంప్ చేస్తోందన్నది అవాస్తవమన్నారు. ఎవరి షాపులలో వ్యత్యాసం ఎక్కువగా ఉందో వాళ్లే ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని కోమలి పేర్కొన్నారు.



హోంగార్డులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, ఆప్ సబ్‌కీ ఆవాజ్ సంస్థ సభ్యులు శివకుమార్, తదితరులు

హోంగార్డులకు ఉచితంగా హెల్మెట్ల పంపిణీ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): 'ఆప్ సాబ్‌కీ ఆవాజ్' సంస్థ హోంగార్డులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసింది. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ వకుల్ జిందాల్ ముఖ్య అతిథిగా హాజరై హెల్మెట్లను పంపిణీ చేసి మాట్లాడుతూ, సమాజ సేవలో ముందుండే 'ఆప్ సబ్‌కీ ఆవాజ్' స్వచ్ఛంద సంస్థ హోం గార్డుల కోసం హెల్మెట్లను విరాళంగా అందించిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఇతర సంస్థలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయడం తమ ముఖ్య లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, ఇతర పోలీస్ అధికారులు, హోం గార్డులు, ఆప్ సబ్‌కీ ఆవాజ్ సంస్థ సభ్యులు శివ కుమార్, అహల్య ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ రాధామాధవి, కిరణ్ పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం

● జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బత్తుల విజయ్‌కుమార్

మంగళగిరి సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బత్తుల విజయ్‌కుమార్ అన్నారు. మంగళగిరి మండలం కాజ గ్రామంలో మంగళవారం కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. కిశోరి బాలికలు పోక్సో చట్టంపై తప్పకుండా అవగాహన కలిగివుండాలని, ఈ కార్యక్రమంలో సీడీపీవో సరిత, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎర్రబాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ శ్రీను, ఏఎన్ఎం దుర్గ, శ్రీవాణి, ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

● తాడేపల్లి టౌన్ : పట్టణ పరిధిలోని కృష్ణనగర్ కేంద్రంలో వేసవి సెలవుల కార్యక్రమం పేరిట భాగంగా పలు అంశాలపై పెనుమాక సెక్టార్ సూపర్‌వైజర్ పి.నీలిమ అవగాహన కల్పించారు. బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

అక్కడ చూస్తే కళకళ.. ఇక్కడ చూస్తే వెలవెల

● డివైడర్స్ మధ్య మొక్కల నిర్వహణలో ఇష్టారాజ్యం



హిందూ కళాశాల సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న డివైడర్స్‌లో పచ్చగా ఉన్న మొక్కలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : హిందు కళాశాల సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న డివైడర్స్ మధ్యలో మొక్కలు కళకళలాడుతూ కనిపిస్తాయి. నిత్యం కలెక్టర్, ఎస్పీ, నగరపాలక సంస్థ కమిషనర్, ఇతర జిల్లా స్థాయి అధికారులు ఆ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఉంటారు. దీంతో అక్కడ డివైడర్స్‌లో మొక్కలు పచ్చగా కళకళలాడుతూ ఉంటాయి. కలెక్టరేటుకు కూతవేటు దూరంలో ఉన్న జూట్ మిల్ నుంచి గుజ్జనగుండ్ల వరకు ఉన్న డివైడర్స్ లో మొక్కలు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటుంది. అదేవిధంగా తూర్పు నియోజకవర్గంలో బస్టాండ్ నుంచి జిన్నాటవర్ సెంటర్ వరకు ఇదే పరిస్థితి. ఇలా డివైడర్స్ మధ్యలో పచ్చదనం నిర్వహణలో లోపాలు నగరపాలక సంస్థ అధికారుల వైఫల్యానికి దర్పణం కలిగిస్తున్నాయి. సామాన్య ప్రజలు పర్యటించే ప్రాంతాల్లో డివైడర్స్ మధ్యలో మొక్కల నిర్వహణ పట్టించుకోని అధికారులు ఉన్నతాధికారులు పర్యటించే ప్రాంతాల్లో మాత్రం మొక్కల నిర్వహణపై ఎక్కడలేని శ్రద్ధ చూపుతున్నారు. ఇది ఎక్కడి చోద్యమంటూ నగర ప్రజలు ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు.



పాత బస్టాండ్ సెంటర్‌లోని డివైడర్స్ మధ్యలో మొక్కలు దుస్థితి ఇలా



జూట్ మిల్ సెంటర్ నుంచి గుజ్జనగుండ్ల వరకు డివైడర్స్ మధ్యలో కనిపించని మొక్కలు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు(విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇటీవల పదో తరగతి ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల కృషి అనితర సాధ్యమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జేకేసీ కళాశాలలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. డాక్టర్ ఏఎస్ రామకృష్ణ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో 55కుపైగా జీవోలు విడుదలయ్యేలా కృషి చేశారని, ఫలితంగా వేలాది మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని ఎమ్మెల్సీ ఆలపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు కోండ్రు మోహన్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ సీనియర్ నాయకుడు చెరుకూరి సుభాష్ చంద్రబోస్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హేమారావు, ఏపీ గురుకుల సొసైటీ జేఏసీ ఛైర్మన్ మధుసూదన్ రావు, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రావు, ఆర్‌యూపీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవిచంద్ర, పీఈటి అసోసియేషన్, గవర్నమెంట్ ప్రిన్సిపాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య , గవర్నమెంట్ జేసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్యాం బాబు, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

టీవీకే అధినేత విజయ్‌ని చూసి వైసీపీ నేతలు సిగ్గుపడాలి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి) : ఎటువంటి రాజకీయ వారసత్వం లేకుండా పార్టీ పెట్టిన రెండు సంవత్సరాలలోనే 107 సీట్లు సాధించిన టీవీకే అధినేత విజయ్‌ని చూసి వైసీపీ నేతలు సిగ్గుపడాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 30 సంవత్సరాలపాటు కాంగ్రెస్‌లో ఉండి, ఆరు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన రాజశేఖరరెడ్డి వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన జగన్ రెడ్డిని, విజయ్‌తో పోల్చటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కాగా, తన తండ్రి రాజశేఖరరెడ్డిని సోనియాగాంధీ చంపించిందని ఒకసారి, అంబానీ సోదరులు చంపించారని మరోసారి చెప్పి.. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారం దక్కించుకున్న జగన్‌కు, విజయ్‌కు పోలికేంటని ఎద్దేవా చేశారు. ఢిల్లీ నేతలను చూస్తే వణికిపోయే జగన్‌రెడ్డి, ఛీ పొమ్మన్నా బీజేపీ అగ్ర నేతల కాళ్ళు పట్టుకొని వేళాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఏ ఎన్నికల్లో అయినా సింహం సింగిల్‌గా వస్తుందని, వైనాట్ 175 అని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి పట్టుమని డజను సీట్లు కూడా గెలవలేకపోవటం ఆత్మహత్యాసదృశ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తనను జైల్లో పెట్టిందని ఉదర గొట్టే జగన్‌రెడ్డి ఆయన పార్టీ పేరులో కాంగ్రెస్ అని ఎందుకు పెట్టుకున్నాడో ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. కోడికత్తి, గులకరాయి, రక్త సంబంధీకులను హత్య చేయడం లాంటి జిమ్మిక్కులు లేకుండానే అధికారంలోకి వచ్చిన విజయ్‌కి టీడీపీ అభినందనలు తెలియజేస్తుందని కనపర్తి శ్రీనివాస్ అన్నారు.

గుంటూరు పశ్చిమలో మహిళా గ్రీవెన్స్

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నియోజకవర్గ కార్యాలయంలో తెలుగు మహిళా నేతలు మంగళవారం 'మహిళా గ్రీవెన్స్' కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, నంది సరస్వతి, పంచుమర్తి కల్పన, టీడీపీ గంటా మౌళిక పాల్గొని వినతులు స్వీకరించారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని మహిళా నేతలు హామీ ఇచ్చారు.



మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న తెలుగు మహిళలు

12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలి

● ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా

మంగళగిరి సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులు ఒక పీఆర్సీ నష్టపోయే ప్రమాదం ఉందని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా ఉద్యోగుల వేతనాలపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో 2023, అక్టోబరు నుంచి అక్కడి ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఐదు శాతం ఐఆర్ చెల్లిస్తున్నారని తెలిపారు. ఏపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్టు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరండల్ పేట పోలీసుల అరెస్టు చేశారు. శ్రీనివాసరావుపేట ఆరో లైన్‌కి చెందిన షేక్ షఫీ, షేక్ కరిముల్లా, కోదండ రామయ్య నగర్ మూడో లైన్ కి చెందిన నారిపోగు బాలాజీ, శ్రీనివాసరావుపేట 8వ లైనుకు చెందిన పాలేటి సాల్మన్ రాజు, అడవి తక్కెళ్ళపాడు టిడ్కో అపార్ట్మెంట్స్ కు చెందిన నంబూరి రాజకుమార్‌లు చెడు అలవాట్లకు లోనై వారి జల్సాల కోసం అవసరమైన డబ్బులు కోసం అరకు వెళ్లి గంజాయి తీసుకొచ్చి చిన్నచిన్న పొట్లాలుగా చేసి గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న అరండల్ పేట పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయి సీజ్ చేశారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో 590 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు మంగళవారం విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,900, గరిష్టధర రూ.10,850 మోడల్‌ధర రూ.10,611 పలికాయి. కాయ కనిష్టధర రూ.9,000, గరిష్టధర రూ.11,150, మోడల్‌ధర రూ.11,000 పలికాయి.

బహిరంగ ప్రకటన

సిద్దాబత్తిని కోమలాంగి తండ్రి విజయ రామయ్య అను వారికి గుంటూరు లో సర్వే నం. 505/3 లో 7 ఎకరముల పొలము కలదు. వీరికి పిల్లలు లేనందు వలన వీరి చెల్లెలు పిల్లలు మరియు దత్తత స్వకరించిన వారికి వీలునామా వ్రాసినారు. సదరు పొలమును 2025వ సంవత్సరము లో ఎం. వెంకట్రావు అను వారికి అగ్రిమెంట్ కొనుగోలు చేసినారు. ఈ విషయం లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంప్రదించగలరు.

విఠలదేవుని గణేష్ కుమార్,
అడ్వకేట్ & నోటరి,
చుట్టుగుంట, గుంటూరు, 98668 45868



● మండు వేసవిలో వరంలా తాటిముంజలు
● జోరుగా విక్రయాలు

ముంజలతో మేలెంతో..

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

వేసవి తాపాన్ని తగ్గించి ఒంట్లో వేడిని దూరం చేసే తాటిముంజలు మండు వేసవిలో ప్రజలకు దేవుడు అందించిన వరమనే భావించాలి. వేసవిలో మాత్రమే దొరికే తాటి ముంజలు పిల్లలు, పెద్దలు ఏ వయసు వారికైనా మేలు చేస్తాయి. ఎటువంటి రసాయనాల ప్రభావం లేకుండా సహజ సిద్ధంగా లభించే తాటికాయలలోని ముంజలు పోషకాలు, ఆరోగ్య పరంగా ఎంతో మంచి ఆహారం. వేసవిలో తాటి ముంజలు తింటే శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చల్లదనాన్ని ఇస్తాయి. ముంజలలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి తక్షణ శక్తినివ్వడమే కాకుండా శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉన్న కారణంగా ఇవి జీర్ణక్రియకూ సహాయ పడతాయి. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిలో పొటాషియం, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలతో పాటు బీ, సీ విటమిన్లు ఉంటాయి. కాకపోతే ఒకే రోజు, ఒకే విడత వీటిని ఎక్కువ మొత్తంలో తినకూడదు. రోజుకు 100 గ్రాముల వరకు తినొచ్చు. 100 గ్రాముల ముంజల్లో 43 కేలరీలు లభిస్తాయి. 11 గ్రాముల కార్బోహైడ్రేట్లు అందుతాయి. ఇక పిల్లలకు పాలిచ్చే తల్లులు ముంజలను తినడం మంచిది. ఇవి తల్లిపాలను వృద్ధి చేస్తాయి. వేసవిలో తాటి ముంజలు తినడం ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది.

● జోరుగా విక్రయాలు

వేసవిలో ఎన్నో ప్రయోజనాలను అందించే తాటిముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు పల్లెల నుంచి పట్టణాలకు తాటికాయలను ఆటోలలో తీసుకువచ్చి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విక్రయిస్తున్నారు. పట్టణాల్లో వీటి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తాటికాయ ధర రూ. 20 వరకు పలుకుతోంది.

వీర్యకణాలు ఇక్కడ భద్రం



ఘన వీర్య కేంద్రంలో ఏర్పాటు చేసిన లిక్విడ్ నైట్రోజన్ ట్యాంక్

● పశుసంవర్ధకానికి అండగా చేబ్రోలులోని ఘన వీర్య కేంద్రం
● ఏడాదికి 4.25 లక్షల డోసులు సరఫరా

చేబ్రోలు, మే 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలులో జిల్లా ఘనీకృత వీర్యకేంద్రం, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ భవనం 2016లో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ చొరవతో సుమారు రూ.46లక్షల డీఎల్‌డీఏ నిధులతో ప్రారంభించారు. గుంటూరు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేబ్రోలులో ఏర్పాటు చేసిన ఘన వీర్య కేంద్రం ఉమ్మడి గుంటూరు జిల్లాల పశుసంవర్ధక రంగానికి ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. ఈ కేంద్రం నుంచి కృతిమ గర్భాదానం కోసం అవసరమైన ఘన వీర్య డోసులను ద్రవ నత్రజని (లిక్విడ్ నైట్రోజన్)లో భద్రపరచి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పశువైద్యశాలలకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ భద్రపరిచిన ఎద (ఏఐ) ఇంజక్షన్లు ప్రత్యేక ట్యాంకుల్లో ద్రవ నత్రజనితో నిల్వ చేస్తారు. ఈ టెక్నాలజీతో వీర్యకణాల నాణ్యత కాపాడటంతో పాటు అవసరమైన సమయంలో రైతులకు అందుబాటులోకి తీసుకెళ్తున్నారు. ప్రతి 45 రోజులకు ఒకసారి ఈ వీర్యకణాలను భద్రపరిచేందుకు ద్రవ నత్రజనితో నింపుతారు. చేబ్రోలు కేంద్రం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు, కృత్రిమ గర్భధాన కేంద్రాలకు ఈ డోసులు పంపిణీ అవుతుండటం విశేషం. జెర్సీ వంటి మెరుగైన జాతి వీర్యకణాలను ఉపయోగించడం ద్వారా స్థానిక పశువుల జాతి మెరుగుపడటంతో పాటు పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోందని పశువైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆదాయం పెరగడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోంది.



వీర్య డోసులను ద్రవ నత్రజనితో నింపుతున్న సిబ్బంది

● ప్రతి ఏడాది 4.25 లక్షల డోసులు సరఫరా

ప్రతి సంవత్సరం సుమారు 4 లక్షల 25 వేల ఘన వీర్య డోసులను చేబ్రోలులోని జిల్లా ఘనీకృత వీర్య కేంద్రం నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలకు సరఫరా చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువైద్యశాలలకు నిరంతరంగా ద్రవ నత్రజని అందుబాటులో ఉంచి సేవలను నిరాటంకంగా కొనసాగిస్తున్నాం.

-జిల్లా ఘన వీర్యకేంద్రం ఉప సంచాలకులు డాక్టర్ వై. సుధాకర్



జిల్లా ఘనీకృత వీర్య కేంద్రం, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం


రండి.. చేరండి.. చేర్పించండి

● కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం ● విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం

నకరికల్లు, మే 5 ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో విద్యార్థులకు ఆకట్టుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలు ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తే తమ పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందనే అపోహను విద్యార్థుల తల్లిదండ్రులకు దూరం చేస్తూ... ప్రైవేటు పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని ఇంకా చెప్పాలంటే అంతకు మించి ప్రభుత్వ పాఠశాలలు అందించే మెరుగైన విద్యతో పాటు సౌకర్యాలను వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నాయి. రండి.. చేరండి.. చేర్పించండి అనే నినాదంతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించే విధంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నారు. విద్యకు కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు.

● మార్కులే మా పనితనానికి నిదర్శనం

మార్కులే మా పనితనానికి నిదర్శనమంటూ నకరికల్లు జడ్పీ పాఠశాల ప్రచారం నిర్వహిస్తోంది. 2026 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఈ పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. వారందరి ఫోటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ అందర్నీ ఆకట్టుకుంటోంది. హై స్కూల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించే మరో ఫ్లెక్సీని ప్రదర్శించారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళికతో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు. విద్యా రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



నకరికల్లు ఎస్‌వీవీఆర్ జడ్పీ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పీవీ సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం

గుంటూరు సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పాలడుగు వెంకట సత్యనారాయణ అందించిన సేవలు ప్రశంసనీయమని సాగునీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ నూతన వైస్ చాన్స్‌లర్‌గా ఆయన నియమితులైన సందర్భంగా మంగళవారం యూనివర్సిటీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, రాష్ట్ర నాయకులు వీరమాచినేని భవానీ ప్రసాద్, జాస్తి విజయభూషణ్ కుమార్, మండవ లక్ష్మణరావు తదితరులు డాక్టర్ పీవీ సత్యనారాయణకు దుశ్శాలువా కప్పి, పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ, మార్టేరు, రాగోలు వంటి వరి పరిశోధనా కేంద్రాల ద్వారా డాక్టర్ సత్యనారాయణ రైతులకు 42 రకాల నూతన వరి వంగడాలను అందించారని తెలిపారు. ప్రస్తుతం ఎంటీయూ-1318, ఎంటీయూ-1262, ఆర్‌జీఎల్-7034 వంటి వంగడాలు విస్తృతంగా సాగులో ఉన్నాయని చెప్పారు. ఆయన అభివృద్ధి చేసిన వరి వంగడాలు రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో సుమారు 80 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయని వివరించారు. నాన్ బాస్మతి వరి విభాగంలో 'మెగా రైస్ బ్రీడర్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన డాక్టర్ సత్యనారాయణ నాయకత్వంలో యూనివర్సిటీ మరింతగా రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



డాక్టర్ పీవీ సత్యనారాయణను సన్మానిస్తున్న సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు

ప్రజలు శాంతియుతంగా మెలగాలి

● గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తుని భాగ్యయ్య

పెదనందిపాడు, మే 5(ఆంధ్రజ్యోతి): భక్తులు క్రీస్తుపై విశ్వాసం ఉంచి శాంతియుతంగా మెలగాలని గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తుని భాగ్యయ్య అన్నారు. మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో మూడు రోజులుగా జరుగుతున్న వేళాంగిణి మాత తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి, విచారణ గురువులు వేళాంగిణి రెడ్డి, సహాయ గురువులు నవీన్ జపమాల, దివ్యపూజాబలి నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం కోలాట కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తుని భాగ్యయ్య మహోత్సవ సమిష్టి గురువుల దివ్యపూజాబలి నిర్వహించి భక్తులకు సందేశమిచ్చారు. ఆంధ్రక్రైస్తవ నాట్యమండలి జి.గుమ్మడి జీవన్‌కుమార్ బృందం విజయవాడ వారు లాజరు ధనవంతుడు నాటిక ప్రదర్శించారు. కార్యక్రమాలను విచారణ గురువులు పర్యవేక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.



భక్తులకు సందేశమిస్తున్న గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తుని భాగ్యయ్య

టీసీఎస్ ఇంటర్వ్యూల్లో

● 262 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఆర్వీఆర్‌జేసీ విద్యార్థుల సత్తా

గుంటూరు (విద్య), మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్పొరేట్ సంస్థ టీసీఎస్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారని అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు రూ. 3.5 నుంచి రూ.9 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో వివిధ క్యాంపస్ డ్రైవ్‌ల ద్వారా 1,054 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇందులో ప్రైమ్ కేటగిరీలో రూ.9 లక్షలకు ఏడుగురు, డిజిటల్ కేటగిరీలో రూ.7 లక్షల ప్యాకేజీలతో 54 మంది, నింజా కేటగిరీలో రూ.3.5 లక్షల ప్యాకేజీలతో 201 మంది విద్యార్థులు నియమితులయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్ బాబు, తదితరులు అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

20 నుంచి ఓపీ సేవలు

(5వ పేజీ తరువాయి)

తెలియచేయాలన్నారు. ఆయా వైద్య సేవలను సద్వినియోగం చేసుకునే దిశగా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల ప్రజలు పిడుగురాళ్ల సర్వజన ఆస్పత్రికి వచ్చేందుకు అవసరాల మేరకు కొంతకాలం రవాణా సదుపాయం కల్పించాలని సూచించారు. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది నియామకాలతో పాటు పలు నిర్మాణాలను వేగవంతం చేసినట్లు తెలిపారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్ల అవసరాలను, జరిగిన నియామకాలపై ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. ఈ నెలాఖరులోగా నియామకాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిలో బోధనా సిబ్బందిని నియమించుకోవాలని మంత్రి సూచించారు. ప్రధానమైన నిర్మాణ పనులను వేగంగా నిర్వహించాలని, నెలాఖరులోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. మే 20లోగా ప్రధాన నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఫోన్‌లో నిర్మాణ సంస్థ యాజమాన్యాన్ని మంత్రి ఆదేశించారు. కళాశాల, బోధనాస్పత్రులకు అవసరమైన పలు రకాల పరికరాలు, ఫర్నిచర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్, ఇన్‌చార్జి డీఎంఈ డాక్టర్ రాధికారెడ్డి, డీపీహెచ్ డాక్టర్ పద్మావతి, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్వీ రమణ, ఏపీ ఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజనీర్ నెహ్రూ, గుంటూరు ఆర్‌డీ శోభాదేవి, గుంటూరు డీఎంహెచ్వో డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ సమీకరణకు 2,676 ఎకరాల అందజేత

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రెండో దఫా భూ సమీకరణ చేస్తున్న పల్నాడు జిల్లాలోని నాలుగు, గుంటూరు జిల్లాలోని 3 రెవెన్యూ గ్రామాలలో 2,250 మంది రైతులు 2,676 ఎకరాల భూమిని ఇచ్చేందుకు అంగీకారపత్రాలు అందజేశారు. గ్రామాల వారీగా అమరావతి మండలంలోని ఎండ్రాయి లో 692 మంది రైతులు 694 ఎకరాలు, కర్లపూడిలో 509 మంది రైతులు 818 ఎకరాలు, పెదమద్దూరులో 332 మంది రైతులు 412 ఎకరాలు, వైకుంఠపురంలో 109 మంది రైతులు 146 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించగా, తుళ్లూరు మండల పరిధిలోని హరిశ్చంద్రపురంలో 43 మంది రైతులు 69 ఎకరాలు, పెదపరిమిలో 402 మంది రైతులు 350 ఎకరాలు, వడ్డమానులో 163 మంది రైతులు 185 ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చేందుకు అంగీకరించారు. సగటున ఇప్పటి వరకు 19 శాతం మంది రైతులు 16 శాతం భూమిని ఇచ్చేందుకు అంగీకరించారు. 11,624 మంది రైతుల నుంచి 16,839 ఎకరాలు సమీకరించాల్సి ఉంది.

ఉత్పాదకత పెంపే లక్ష్యం

● వ్యవసాయ యాంత్రీకరణకు రూ.3.04 కోట్లు కేటాయింపు
● సబ్సిడీపై పరికరాలు అందజేత

గుంటూరు సిటీ,మే 5 (ఆంధ్రజ్యోతి): స్మామ్ (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకానైజషన్) పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాలో రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ పరికరాల పంపిణీకి చర్యలు ప్రారంభమయ్యాయి. 2025-26 సంవత్సరానికిగాను జిల్లాకు రూ.3.04 కోట్లు కేటాయించగా, మే 5వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ పథకం కింద రైతులు ట్రాక్టర్ పనిముట్లు, పవర్ టిల్లర్లు, రోటావేటర్లు, స్ప్రేయర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు, మినీ ట్రాక్టర్లు వంటి పరికరాలను సబ్సిడీపై పొందవచ్చు.

● దరఖాస్తు ఇలా..

రైతులు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా స్వయంగా లేదా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) సహాయంతో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణ మే 5 నుంచి మే 19 అర్ధరాత్రి వరకు కొనసాగుతుంది. అనంతరం మండలాల వారీగా, సామాజిక వర్గాల వారీగా ఆన్‌లైన్ లాటరీ విధానంలో లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు.

● సబ్సిడీ అందజేత

ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, మహిళా లబ్ధిదారులకు యంత్రాలపై 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. గత సంవత్సరం సబ్సిడీ పొందిన రైతులు ఈ సారి అర్హులు కారు. ఎంపికైన రైతులు తమ వాటా మొత్తాన్ని 15 రోజుల్లో ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అనంతరం డీలర్లు 15 రోజుల్లోపే పరికరాలు సరఫరా చేయాలి. రూ.లక్షకు పైగా ఖరీదు చేసే యంత్రాలకు వినియోగాన్ని ట్రాక్ చేసే ఏఐ ఆధారిత టెలిమాటిక్స్ కిట్‌ను అమర్చనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా ఉత్పాదకత పెంపు లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని, ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

9న మహాపురుషుడు మండలి నాటకం

● ఏఐ డిజిటల్ సాంకేతికత జోడింపు
● 45 మంది కళాకారులతో ప్రదర్శన

తెనాలి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాకు చెందిన ప్రముఖ దివంగత రాజకీయ నేత మండలి వెంకటకృష్ణారావు శత జయంతిని పురస్కరించుకొని మహాపురుషుడు మండలి నాటక ప్రదర్శన ఈ నెల 9న నిర్వహించనున్నట్లు నటుడు, దర్శకుడు గంగోత్రి సాయి తెలిపారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగోత్రి సాయి మాట్లాడుతూ, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలి ప్రజాసేవను వివరించే క్రమంలో నాటక ప్రదర్శన చేపట్టామన్నారు. 45 మంది కళాకారులతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏఐ పరిజ్ఞానాన్ని డిజిటల్ సాంకేతికతను జోడించి నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు ప్రదర్శన ప్రారంభం అవుతుందని తెలిపారు. మండలి వెంకటకృష్ణారావు దివిసీమ ప్రాంతంలో పలు రాజకీయ పదవులు నిర్వహించి ఆ ప్రాంత ప్రజానీకానికి ఎంతో సేవ చేశారని ఆయన జీవితం భావితరాలకు ఆదర్శం కావాలనే ఉద్దేశ్యంతో నాటక ప్రదర్శన చేపట్టామన్నారు. ఈ నాటకాన్ని ప్రముఖ రచయిత దీర్ఘాసి విజయభాస్కర్ రచించారని తెలిపారు. నాటక ప్రదర్శన ముందుగా శత జయంతి సభలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు చందు సుబ్బారావు, గరికపాటి సుబ్బారావు, బెల్లంకొండ వెంకట్, మొవ్వా సత్యనారాయణ, సూర్య, మధు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు


సమావేశ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ఆర్-5 జోన్ పూర్తిగా వెనక్కి

- మాస్టర్‌ప్లాన్‌కు నష్టం జరగకుండా 2023కు ముందు స్థితికి
- 900 ఎకరాలు వెనక్కి ఇవ్వాలని రెండు జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు
- రాజధాని రైతులకు స్పష్టం చేసిన త్రిసభ్య కమిటీ
- సెంటు పట్టాల పేరుతో గత ప్రభుత్వం కుట్ర
- ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 51 వేల మందికి పట్టాలు
- లబ్ధిదారులకు సొంత జిల్లాల్లోనే భూములు కేటాయిస్తామన్న కమిటీ

గుంటూరు(రాజధాని), మే 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్‌ను దెబ్బతీసేలా గత ప్రభుత్వం రూపొందించిన ఆర్-5 జోన్‌ను పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నట్టు త్రిసభ్య కమిటీ స్పష్టం చేసింది. రాజధాని రైతుల సమస్యలపై సీఆర్డీఏ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశం అనంతరం కమిటీ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్, పొంగూరి నారాయణ, తెనాలి శ్రావణ్ కుమార్ సమావేశ నిర్ణయాలను మీడియాకు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌కు విఘాతం కలగకుండా ఉండేదుకు వీలుగా 2023కు ముందు స్థితికి ఆర్ 5 జోన్‌ను తీసుకువస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం రెవెన్యూ శాఖకు బదిలీ చేసిన 900 ఎకరాలను తిరిగి తీసుకుంటున్నామని, ఇప్పటికే ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కాగా లబ్ధిదారులకు వారి సొంత జిల్లాల్లోనే భూములు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

కీలక ప్రాంతాలను దెబ్బతీయడానికే ఆర్-5 జోన్

రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్‌ను దెబ్బతీయడమే లక్ష్యంగా గత ప్రభుత్వం 'పేదలకు భూహక్కు' పేరుతో రాజధానిలోని పలు గ్రామాల్లో సెంటు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా నవ నగర ఆర్థిక, సాంకేతిక అభివృద్ధికి కీలకంగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని ఇళ్ల పట్టాలు జారీ చేసింది. రాజధాని పరిధిలోని కురగల్లు, కృష్ణాయపట్నం, తుళ్లూరు, రాయపూడి, మందడం పరిధిలోని నాలెడ్జ్ సెంటర్లు, ఎలక్ట్రానిక్ రీజియన్లలోని 900 ఎకరాలను రెవెన్యూ శాఖకు బదిలీ చేసింది. పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన 51 వేల మందికి సెంటు పట్టాలు ఇచ్చింది. హడావుడిగా రూ.110 కోట్లు ఖర్చు చేసి ప్లాట్లు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు వేసింది. రైతులు హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లినా పట్టించుకోకుండా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టాలు జారీ చేశారు. హడావుడిగా ఇళ్లు కూడా నిర్మాణం ప్రారంభించారు. సుప్రీంకోర్టు తీర్పుతో సెంటు పట్టాల వ్యవహారానికి బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా ఆర్ 5 జోన్‌పై నిర్ణయం తీసుకుంది.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు మేడే ఆఫర్

- 7 వేల పని దినాలు కల్పించినవారూ కొనసాగింపు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు కూటమి సర్కార్ మేడే ఆఫర్ ఇచ్చింది. ఉపాధి పథకంలో కీలకంగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా పంచాయతీల్లో ఏడాదికి 7500 పనిదినాలు కల్పిస్తేనే ఆతర్వాత ఏడాది వారిని కొనసాగిస్తారు. ఆమేరకు ఆ తర్వాత సంవత్సరానికి వారి కాంట్రాక్టును పొడిగిస్తారు. మేడే సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వారికి వెసులుబాటు కల్పిస్తూ 2025-26 సంవత్సరంలో 7500 కాకుండా 7000 పనిదినాలు కల్పించినప్పటికీ... ఫీల్డ్ అసిస్టెంట్లుగా కొనసాగిస్తూ వచ్చే ఏడాది కూడా వారి కాంట్రాక్టును రెన్యువల్ చేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 1223 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు ఊరట కలిగింది. గత ఆర్థిక సంవత్సరంలో సాంకేతిక సమస్యలు, యాప్‌లలో లోపాలు, పనుల పరిమితి వంటి ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, కనీస అర్హతను 7500 నుంచి 7000 పని దినాలకు తగ్గించారు.

నేడు టీటీడీ బోర్డు సమావేశం

తిరుమల, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం టీటీడీ బోర్డు సమావేశం జరుగనుంది. ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమావేశం కానున్నారు. దాదాపు 74 అంశాలపై రూపొందించిన అజెండాపై చర్చ జరగనుంది.



సమీక్షలే కాదు.. కార్మికుల సమస్యలూ చూస్తా!

'కేవలం సమీక్షలతో సరిపెట్టే వ్యక్తిని కాదు.. క్షేత్రస్థాయిలో సమస్యలనూ స్వయంగా చూస్తా. టన్నెల్ లోపల కార్మికుల కష్టాన్ని స్వయంగా తెలుసుకుంటా' అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వెలిగొండ టన్నెల్లో కార్మికుల కష్టాన్ని స్వయంగా చూసేందుకు మంగళవారం రాత్రి ఆయన టన్నెల్‌లోకి వెళ్లారు. చీకటిగా ఉన్నా అక్కడక్కడ అమర్చి ఉన్న లైట్ల వెలుగులోనే ఆయన అధికారులతో కలిసి పనులు పరిశీలించారు. ఐదు గాంట్రీల వద్ద ఉన్న కార్మికులు, మిషనరీలకు మధ్య సమన్వయం పెంచి పనుల లక్ష్యాన్ని తానే సూచిస్తానని తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, మార్కాపురం/పెద్దదోర్నాల

రాష్ట్రంలో వాతావరణ అనిశ్చితి

- ఓవైపు ఎండలు.. మరోవైపు పిడుగులతో వర్షాలు

అమరావతి, విశాఖపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంగళవారం 9 జిల్లాల పరిధిలోని 45 మండలాల్లో 41 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా బనగానపల్లెలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఉక్కపోత, ఎండ తీవ్రత ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని పలుచోట్ల వర్షం కురిసింది. శ్రీకాకుళం జిల్లా హరిపురంలో 73, కొర్లాంలో 61.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న మూడు రోజులు అక్కడక్కడా వర్షాలు, కొన్నిచోట్ల ఎండ ప్రభావం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం ఉత్తర కోస్తా, రాయలసీమలో పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని తెలిపింది.

12న బంగాళాఖాతంలో అల్పపీడనం

నైరుతి బంగాళాఖాతంలో ఈ నెల రెండోవారంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనున్నది. దీని ప్రభావంతో ఈ నెల 11 లేదా 12వ తేదీన అల్పపీడనం ఏర్పడనున్నదని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు.

ఆరోగ్య శాఖకు అవినీతి క్యాన్సర్

- శస్త్రచికిత్స అనివార్యం
- అందరిదీ బాధ్యతారాహిత్యమే
- సీఎం జోక్యం చేసుకుంటేనే మార్పు
- కీలక అధికారి అవినీతి పరాకాష్ఠకు ఢిల్లీ కంపెనీలకు అత్యంత 'గౌర'వం
- అక్కడే కలెక్షన్లు.. ఆంధ్రాలో ఆర్డర్లు
- కార్పొరేషన్‌లో చెప్పిందే శాసనం
- సొమ్ములిస్తేనే టెండర్లు, బిల్లులు
- పరికరాల కొనుగోలులో నాణ్యతకు చెల్లు
- రూ.50 కోట్లకు పైగా ప్రజాధనం వృథా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



వైద్య ఆరోగ్య శాఖకు అవినీతి క్యాన్సర్ పట్టింది. ఇప్పుడా శాఖకు శస్త్ర చికిత్స అనివార్యమైంది. శాఖలో కింది నుంచి పైస్థాయి వరకు అధికారులంతా అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. ఎవరికి వారు సొంత సామ్రాజ్యాలను ఏర్పాటు చేసుకుని 'మా వాటా ఎంతిస్తారో చెప్పండి' అంటూ బహిరంగ బేరాలకు దిగుతున్నారు. సూది, దూది దగ్గర నుంచి వైద్య పరికరాల కొనుగోలు వరకూ ప్రతిదాంట్లో సెటిల్‌మెంట్లే. మంత్రి సమీక్షల పేరుతో సమస్యలపై ఫోకస్ పెట్టినా లోతుల్లోకి వెళ్లడం లేదు. దీంతో అధికారులు ఆరోగ్యశాఖను భ్రష్టుపట్టిస్తున్నారు. ముఖ్యంగా శాఖలో కీలక అధికారి అవినీతి పరాకాష్ఠకు చేరింది. సివిల్, డ్రగ్స్, ఎక్విప్‌మెంట్.. ఇలా అన్ని విభాగాల్లో కమీషన్లు కొట్టేస్తున్నారు. చివరికి మెగా నిర్మాణ సంస్థలను కూడా వదిలి పెట్టడం లేదు. వారాంతానికి ఢిల్లీ వెళ్లే సదరు అధికారి డీల్స్ మొత్తం అక్కడే చేసుకుంటున్నారు. శని, ఆదివారాల్లో డీల్స్ మాట్లాడుకుంటారు. సోమవారం ఆంధ్రాకు వచ్చి ఆర్డర్లు ఇస్తారు. వచ్చిన పర్సంటేజ్ తీసుకుంటారు. ఇది ఆయనకు రొటీన్‌గా మారింది. ఆరోగ్యశాఖలో కీలకమైన ఏపీఎంఎస్ఐడీసీ (మందుల కార్పొరేషన్) ఆయన చేతుల్లో ఉంది. దీంతో కార్పొరేషన్‌లో ఆయన సొంత రూల్స్ అమలు చేస్తూ.. మొత్తం శాఖనే శాసిస్తున్నారు. ప్రజాధనం వృథా అవుతుందన్న విషయాన్ని అసలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ప్రశ్నిస్తుందన్న ఆలోచన కూడా లేదు.

టెండర్ పిలిస్తే నాకేంటి

టెండర్ ఏదైనా పర్సంటేజ్ మాత్రం కామన్ అన్నట్లు సదరు అధికారి తీరు ఉంటోంది. రాష్ట్రంలో విశాఖ, విజయవాడ, తిరుపతిలలో కేంద్రం నిధులతో సెంట్రల్ డయాగ్నోస్టిక్ సెంటర్లను నిర్మించారు. వీటి ద్వారా ఆయా జిల్లాల్లో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. విశాఖలోని సెంట్రల్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రభుత్వం పీపీపీకి ఇవ్వాలని నిర్ణయించింది. విజయవాడ, తిరుపతిలో మాత్రం హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని భావిస్తోంది. హైబ్రిడ్ విధానంలో ప్రభుత్వమే వైద్య పరికరాలు సమకూర్చి, వాటి నిర్వహణ బాధ్యత మొత్తం ప్రైవేటు సంస్థకు అప్పగిస్తుంది. విశాఖలో మాత్రం వైద్య పరికరాలన్ని పీపీపీ సంస్థలే ఏర్పాటు చేసుకోవాలి. ఏడాది క్రితమే సెంట్రల్ డయాగ్నోస్టిక్ భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ ఇప్పటి వరకూ వీటిని అందుబాటులోకి తీసుకురాలేదు. పీపీపీ, హైబ్రిడ్ విధానంలో టెండర్ పిలిచి, వెంటనే నిర్వహణ సంస్థను ఎంపిక చేయాలని సీఎం చంద్రబాబు అనేకసార్లు చెప్పారు. అయినా శాఖలో కీలక అధికారి టెండర్ ప్రక్రియకు వెళ్లడం లేదు. ఈ మధ్య కాలంలో డయాగ్నోస్టిక్ సెంటర్ల టెండర్ల కోసం ఎదురుచూస్తున్న కొన్ని సంస్థల ప్రతినిధులు సదరు అధికారిని సచివాలయంలో కలిశారు. డయాగ్నోస్టిక్ సెంటర్ల టెండర్లు వెంటనే పిలవాలని కోరారు. సంస్థల ప్రతినిధులు చెప్పిందంతా విన్న సదరు అధికారి వారికి ఊహించని షాక్ ఇచ్చారు. 'టెండర్లు పిలవాలా..? టెండర్లు పిలిస్తే నాకేమిస్తారు? మీరు ఎంత పర్సంటేజ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారో చెప్పండి? అప్పుడు టెండర్ గురించి ఆలోచిద్దాం' అంటూ బహిరంగంగానే అడిగేశారు. దీంతో ఆయా కంపెనీల ప్రతినిధులు మారు మాట్లాడకుండా సైలెంట్‌గా బయటకు వచ్చేశారు.

సీఎంవోకు ఫిర్యాదు

రాష్ట్రంలో కోట్ల రూపాయల సివిల్ వర్కులు చేసే పెద్ద కంపెనీ యజమానికి కూడా సదరు అధికారి నుంచి వింత అనుభవం ఎదురైంది. మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్న ఆ కంపెనీ యజమాని తమ పెండింగ్ బిల్లుల కోసం ఆ అధికారిని కలిశారు. తమ కంపెనీకి సంబంధించిన బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. వచ్చింది ఎవరన్నది కూడా చూడకుండా కనీసం 8 శాతం పర్సంటేజ్ ఇవ్వాలని సదరు అధికారి డిమాండ్ చేశారు. ఇది విని షాక్ అయిన యజమాని నేరుగా సీఎంవోకు వెళ్లి విషయం చెప్పారు. ఆరోగ్యశాఖలో దాదాపు ప్రతి కాంట్రాక్టర్, సప్లయర్స్‌కు సదరు అధికారితో ఇదే విధమైన అనుభవాలు ఎదురయ్యాయి. తక్షణం ఆరోగ్య శాఖ ప్రక్షాళనకు సీఎం జోక్యం చేసుకోవాలి. అలా కాకుండా ఇలానే వదిలిస్తే ఆ ఎఫెక్ట్ ప్రభుత్వంపై పడే ప్రమాదం ఉంది.

ఇంటెలిజెన్స్ హెచ్చరించినా...

ముఖ్యంగా వైద్య పరికరాల కొనుగోలు ప్రక్రియలో సదరు అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరోగ్యశాఖలో నాణ్యమైన మందులు, నాణ్యమైన వైద్య పరికరాలు ఉంటేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఈ విషయాన్ని గాలికి వదిలేసిన ఆ అధికారి నాణ్యతకు చెల్లుచీటీ ఇచ్చి.. జేబు నింపుకొనే పనిలో పడ్డారు. ముఖ్యంగా ఢిల్లీ కంపెనీలకు అత్యంత 'గౌర'వం ఇస్తూ..వారినే ప్రోత్సహిస్తున్నారు. శాఖకు వచ్చిన ఏడు నెలల్లో దాదాపు రూ.50 కోట్లపైగా ప్రజాధనం వృథా చేసినట్లు తెలుస్తోంది. కమీషన్లు ఇచ్చిన కంపెనీల కోసం అవసరం లేకపోయినా కోట్లాది రూపాయలు వెచ్చించి వైద్య పరికరాలు కొనుగోలు చేయడం, టెండర్లలో రూల్స్ బ్రేక్ చేసి మరీ అర్హత లేని కంపెనీని ఎంపిక చేయడం చేస్తున్నారు. ఒకటి, రెండు కాదు ప్రతీ టెండర్ విషయంలో ఇదే ధోరణి. సదరు అధికారి వ్యవహార శైలిపై అనేక ఫిర్యాదులు రావడంతో ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన కీలక అధికారి ఫోన్ చేసి మరీ హెచ్చరించారు. అయినా ఆ అధికారి తీరులో ఎలాంటి మార్పూ రాకపోగా... పర్సంటేజ్ పెంచి మరీ కమీషన్లు తీసుకుంటున్నారు.

అంతర్జాతీయ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

రూ.19.70 లక్షల నగదు స్వాధీనం

- బ్యాంకు ఖాతాల్లోని రూ.18.20 లక్షలు ఫ్రీజ్
- పరారీలో కీలక నిందితుడు, మరొకరు
- స్థానికుల పేరుతో బ్యాంకు ఖాతాలు
- లావాదేవీల కోసం ఇతరుల పేరుతో సిమ్ కార్డులు
- కారు, నాలుగు బైక్స్, ఇతర సామగ్రి సీజ్
- క్రికెట్ బెట్టింగ్ జోలికి వెళితే కఠిన చర్యలు: అనంతపురం ఎస్పీ


బెట్టింగ్ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులను పరిశీలిస్తున్న అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్, ఇతర పోలీసు అధికారులు

అనంతపురం క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పోలీసులు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు చేశారు. ఫిలిప్పీన్స్ కేంద్రంగా ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాలోని 10 మంది సభ్యులను అరెస్టు చేశారు. ఫిలిప్పీన్స్‌లో ఉంటున్న బెట్టింగ్ ముఠా కింగ్ పిన్ శివ, కర్ణాటకకు చెందిన సచిన్ పరారీలో ఉన్నారు. ఈ కేసు వివరాలను అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్న శివ ఫిలిప్పీన్స్‌లో ఉంటూ తొమ్మిది మందితో కలిసి అంతర్జాతీయ నిషేధిత ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహిస్తున్నాడు. ఫిలిప్పీన్స్‌లోని మాకాటి మెట్రో మనిలా అనే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నాడు. నిషేధిత డ్రీమ్ ప్లే-1 యాప్ ద్వారా మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో క్యాసినో, రోలెంట్, డ్రాగన్, మోనోపోలో, క్రికెట్ బెట్టింగ్, ఇతర నిషేధిత గేమ్స్ ఆడిస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన తలారి మధు(33)తో శివకు పరిచయమైంది. క్రికెట్ బెట్టింగ్‌కు సహకరిస్తే వచ్చే ఆదాయంలో 40 శాతం ఇస్తానని మధుకు ఎరవేశాడు. డబ్బుకు ఆశపడిన మధు, కళ్యాణదుర్గానికి చెందిన వేపరాళ్ల మహమ్మద్, షేక్ బాబ్జాన్, షేక్ రోషన్ వలీ, మాకొడికి శ్రీనివాసులు, తిమ్మయ్యను ఏజెంట్లుగా పెట్టుకున్నాడు. ఏలూరు జిల్లాకు చెందిన పవన్‌కుమార్, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన కిరణ్, జగిత్యాల జిల్లాకు చెందిన ప్రశాంత్, విజయవాడకు చెందిన మణికంఠ రాజు వీరికి జతకలిశారు. తలారి మధు ఫిలిప్పీన్స్‌లో ఉంటున్న శివకు టచ్‌లో ఉంటూ, ఈ ముఠాలో కీలకంగా వ్యవహరించాడు. డ్రీమ్ ప్లే-1 యాప్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తూ వచ్చారు.

పాస్‌బుక్ ఉంటే రూ.10 వేలు

బెట్టింగ్ లావాదేవీల కోసం సుమారు 70 మంది స్థానికుల చేత తలారి మధు బ్యాంకు ఖాతాలను తెరిపించాడు. వివిధ బ్యాంకుల పాస్ బుక్స్‌ను సిద్ధం చేసుకున్నాడు. పాస్ బుక్ ఉన్న ఒక్కొక్కరికి రూ.10 వేలు ఇచ్చాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ లావాదేవీలన్నీ ఫోన్ పే ద్వారా నిర్వహించారు. ఫోన్ పే లావాదేవీల కోసం ఇతరుల పేరిట సిమ్‌కార్డులు తీసుకుని, వాటిని ఢిల్లీలోని తోటి ముఠా సభ్యులకు కార్గో జీన్స్ ప్యాంట్ల పార్సిళ్లలో చేరవేశాడు. వాటిని అక్కడి నుంచి ఫిలిప్పీన్స్‌కు చేరవేశారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో బెట్టింగ్ నియంత్రణకు జిల్లా ఎస్పీ జగదీష్ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐలు హరినాథ్, వెంకటరమణ, పలువురు ఎస్ఐలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ఈ నెల 4వ తేదీన కళ్యాణదుర్గం పట్టణంలోని సిద్ధపవంక వీధిలోని ఓ ఇంటిపై దాడులు నిర్వహించి బెట్టింగ్ ముఠాలోని తలారి మధు సహా పదిమందిని అదుపులోకి తీసుకుంది. వారి నుంచి రూ.19.70 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. బెట్టింగ్ లావాదేవీలకు వినియోగిస్తున్న 49 మంది బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.18.20 లక్షల నగదును ఫ్రీజ్ చేయించింది. నిందితులకు చెందిన ఒక కారు, నాలుగు బైక్స్, 15 సెల్‌ఫోన్లు, 15 సిమ్స్, మూడు ల్యాప్‌ట్యాప్‌లు, ఒక ట్యాబ్, 13 ఏటీఎం కార్డులు, నాలుగు చెక్‌బుక్స్, పలు పెన్‌డ్రైవ్‌లు, పవర్ బ్యాంక్‌లు, బ్లూటూత్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 60 లక్షలు ఉంటుందని ఎస్పీ జగదీష్ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గృహనిర్మాణ సంస్థ జీఎంగా రమేశ్

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ (పరిపాలన)గా కె.రమేశ్‌ను డిప్యుటేషన్‌పై నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందుల వ్యవసాయ కళాశాలలో సాయిల్ సైన్స్, వ్యవసాయ, రసాయన శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న రమేశ్.. గత కొంతకాలంగా ఏపీ స్టేట్ ఈబీసీ వెల్ఫేర్ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజరుగా డిప్యుటేషన్‌పై సేవలందిస్తున్నారు. తనను హౌసింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్‌గా నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సమ్మతి తెలిపారు. దీంతో రమేశ్‌ను హౌసింగ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ (పరిపాలన)గా నియమిస్తూ గృహనిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టరు పి.వెంకటరమణను మాతృ శాఖకు పంపించారు.

అడవి నుంచి గిరిజనులను తరిమేస్తే ఎలా?

- రాష్ట్రాన్ని ప్రశ్నించిన మోటా సెక్రటరీ రంజనా చోప్రా

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులైన గిరిజన కుటుంబాలను ఏజెన్సీ ప్రాంతం నుంచి దూరంగా తరిమేస్తే ఎలా? అని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మోటా) కార్యదర్శి రంజనా చోప్రా రాష్ట్రాన్ని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, సహాయ కార్యక్రమాలపై రాష్ట్ర అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా రంజనా చోప్రా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్ఆర్ అధికారి అభిషేక్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రాజెక్టు తొలి దశ పనులు పూర్తికానున్న నేపథ్యంలో నిర్వాసితులకు సహాయ, పునరావాస కార్యక్రమాలను వేగంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రంజనా జోక్యం చేసుకుంటూ అటవీ ఉత్పత్తులను సేకరించుకునేందుకు అడవిలోకి వెళ్లేందుకు గిరిజనులను అనుమతిస్తున్నారా.. లేదా? అని ప్రశ్నించారు. వరద ప్రభావం లేని ప్రాంతానికి నిర్వాసితులను తరలిస్తున్నామని అధికారులు చెప్పగా.. దీని వల్ల గిరిజనులు వారి సంస్కృతీ సంప్రదాయాలకు క్రమంగా దూరమైపోరా? అని సందేహం వ్యక్తం చేశారు. ఇది సామాజికంగా, ఆర్థికంగా సరైనదేనా? అని ప్రశ్నించారు. గిరిజనులను సంప్రదాయ వృత్తులకు దూరం చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని తొలి దశ, రెండో దశ అంటూ విభజించడం ఎందుకని రంజనా చోప్రా అడిగారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై అసభ్యకర పోస్టులు

- కడప జిల్లాకు చెందిన నిందితుడి అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిని గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కడప జిల్లా బద్వేల్ మండలం రామాంజనేయనగర్‌కు చెందిన పి.చిన్న రామయ్య కుమారుడు సురేశ్ సామాజిక మాధ్యమాల్లో నాయకులపై అసభ్య ప్రచారం, మార్ఫింగ్ వీడియో పోస్టులు పెడుతున్నాడు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పాత గుంటూరు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. సామాజిక మాధ్యమాలలో తప్పుడు పోస్టులు పెట్టినా, అసత్య ప్రచారం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

నిధి యాప్‌లో పెన్షనర్ల వార్షిక ధ్రువీకరణ పత్రాలు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లింపుల కోసం అభివృద్ధి చేసిన నిధి యాప్‌లో పెన్షనర్లు తమ వార్షిక ధ్రువీకరణ పత్రాలు సమర్పించే వెసులుబాటును ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈమేరకు మంగళవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ పొందడానికి ప్రతి ఏడాది ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వానికి సమర్పించాలి. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్, మీ సేవా కేంద్రాలు, కామన్ సర్వీసు సెంటర్లు, బయోమెట్రిక్ సౌకర్యం ఉన్న పెన్షనర్ సంఘాల ద్వారా ఈ ధ్రువీకరణ పత్రాలు సమర్పించవచ్చు. ఇప్పుడు కొత్తగా నిధి యాప్ ద్వారా ఈ పత్రాలను సమర్పించే వెసులుబాటును ప్రభుత్వం తీసుకొచ్చింది. పెన్షనర్లు తమ మొబైల్‌లోకి నిధి యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని, లాగిన్ అవ్వాలి. హోమ్ పేజీలోని ఏవీసీ టైల్‌ను ఉపయోగించాలి. అందులో ఉన్న ఆ పెన్షనర్ వ్యక్తిగత వివరాలను అప్‌డేట్ చేస్తూ ధ్రువీకరించాలి. ధ్రువీకరణ పూర్తయ్యాక ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి ఏవీసీ అథెంటికేషన్ బటన్ ఉపయోగించాలి.

మహిళా వ్యతిరేక పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పారు

- ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

న్యూఢిల్లీ, మే 5(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను అడ్డుకున్న ప్రతి పార్టీకి తాజా అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పారని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. నారీ శక్తిని చాటేందుకు ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఓటేశారని తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయ సాధికారితలో మహిళలకు భాగస్వామ్యం కోసం చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు "నారీ శక్తి వందన్" ద్వారా అవకాశం కల్పించాలని ఎన్డీయే సంకల్పిస్తే.. ఇండి కూటమి అడ్డుకుందని దీంతో దేశవ్యాప్తంగా మహిళలు వారికి బుద్ధి చెబుతున్నారన్నారు.

బిజినెస్


మహీంద్రా లాభంలో 48% వృద్ధి

ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. 2025-26 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.5,259 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం ఏకంగా 48.5 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.42,585.67 కోట్ల నుంచి రూ.54,891.55 కోట్లకు పెరిగింది. అయితే వ్యయాలు మాత్రం రూ.39,113.61 కోట్ల నుంచి రూ.49,615.48 కోట్లకు పెరిగాయి. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.33 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

పీఎన్‌బీ లాభం రూ.5,225 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ).. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.5,225.12 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 12.54 శాతం వృద్ధి చెందింది. రైటాఫ్ చేసిన రుణాల నుంచి రికవరీలు పెరగటం, ఫీజు బేస్ అధికంగా ఉండటం కలిసివచ్చిందని బ్యాంక్ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.36,705 కోట్ల నుంచి రూ.36,319 కోట్లకు తగ్గింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో షేరుకు రూ.3 డివిడెండ్‌ను బ్యాంక్ బోర్డు సిఫారసు చేసింది.

రెమిటెన్స్‌ల్లో భారత్ టాప్



ఐక్యరాజ్య సమితి: రెమిటెన్స్‌ల రూపంలో అత్యధిక నిధులు అందుకున్న ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. విదేశాల్లో స్థిరపడిన వారు స్వదేశంలోని తమ సంబంధీకులకు పంపే సొమ్మును రెమిటెన్స్ అంటారు. 2024లో ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) ఏకంగా 13,767 కోట్ల డాలర్ల (రూ.13.01 లక్షల కోట్లు) సొమ్మును స్వదేశంలోని తమవారికి రెమిటెన్స్‌ల రూపంలో పంపారు. అంతే కాదు, 10,000 కోట్ల డాలర్లకు పైగా రెమిటెన్స్‌లు అందుకున్న ఏకైక దేశం కూడా. మెక్సికో, ఫిలిప్పీన్స్, ఫ్రాన్స్ వరుసగా 2,3,4 స్థానాల్లో నిలిచాయి. ఐక్యరాజ్య సమితిలో వలసలకు సంబంధించిన ఏజెన్సీ 'ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్' (ఐఓఎం) తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది.

- 2010 నుంచి భారత్ అత్యధిక రెమిటెన్స్‌లు అందుకుంటున్న దేశంగా అగ్రస్థానంలో కొనసాగుతోంది.
- 2024లో దక్షిణాసియాకు వచ్చిన రెమిటెన్స్‌లో అత్యధికంగా 11.8 శాతం వృద్ధి నమోదైంది. విదేశాలకు వలసపోయిన భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వాసులు స్వదేశానికి భారీగా సొమ్ము పంపడం ఇందుకు దోహదపడింది.
- అగ్రరాజ్యం అమెరికా సహా అభివృద్ధి చెందిన దేశాల నుంచే అధిక శాతం రెమిటెన్స్‌లు లభించాయి.

2024లో రెమిటెన్స్‌ల ప్రవాహం

ఏ దేశం నుంచి ఎంత..?

దేశం	కోట్ల డాలర్లు
అమెరికా	10,000
సౌదీ అరేబియా	4,600
స్విట్జర్లాండ్	4,000
జర్మనీ	2,400

విద్యార్థుల వలసలు ఆసియా నుంచే అధికం

విదేశాల్లో చదువుతున్న వారిలో ఆసియా విద్యార్థులే అధికం. 2022లో 10 లక్షలకు పైగా చైనా విద్యార్థులు ఉన్నత చదువు కోసం విదేశాలకు వెళ్లారు. భారత్ నుంచి 6.20 లక్షల మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లారు. ఉజ్బెకిస్థాన్ (1.50 లక్షలు), వియత్నాం(1.34 లక్షలు), జర్మనీ (1.26 లక్షల మంది) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అమెరికా, ఫ్రాన్స్, నైజీరియా, సిరియన్ అరబ్ రిపబ్లిక్, నేపాల్ నుంచి 95,000-1.15 లక్షల స్థాయిలో విద్యార్థులు చదువు కోసం విదేశాలకు వెళ్లారు. కాగా, వలస విద్యార్థుల్లో సగానికి పైగా యూరప్, ఉత్తర అమెరికాలోనే చదువుకుంటున్నారు.

ఎంఎస్ఎంఈలు, ఎయిర్‌లైన్స్‌కు దన్ను

రూ.18,100 కోట్లతో రుణ హామీ పథకాన్ని ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధంతో ప్రభావితమైన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు), విమానయాన సంస్థలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రూ.18,100 కోట్లతో ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ (ఈసీఎల్‌జీఎస్)ను ప్రకటించింది. ఈ పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. దీని ద్వారా విమానయాన సంస్థలకు కేటాయించిన రూ.5,000 కోట్లతో సహా రూ.2.55 లక్షల కోట్ల అదనపు రుణ సదుపాయం అందుబాటులోకి రానుంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దెబ్బతిన్న ఎయిర్‌లైన్స్‌తో పాటు ఎంఎస్ఎంఈలకు ఈ పథకం అండగా నిలుస్తుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ప్యాసింజర్ ఎయిర్‌లైన్స్ తమ గరిష్ఠ క్రెడిట్‌లో 100 శాతం వరకు అంటే గరిష్ఠంగా రూ.1,500 కోట్ల వరకు పొందేందుకు అర్హత ఉంటుందన్నారు. ఇతర సంస్థలు తమ నిర్వహణ మూలధనంలో 20 శాతం వరకు, గరిష్ఠంగా రూ.100 కోట్ల వరకు రుణం పొందవచ్చని మంత్రి తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల తలెత్తే సవాళ్లను వ్యాపార సంస్థలు అధిగమించేందుకు వీలు కల్పించడమే ఈ పథకం లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఎంఎస్ఎంఈలకు 100% రుణ హామీ

ఈ స్కీమ్‌లో భాగంగా ప్రభుత్వం నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్ట్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సీజీటీసీ) ద్వారా ఎంఎస్ఎంఈలకు 100 శాతం, నాన్ ఎంఎస్ఎంఈలు, ఎయిర్‌లైన్ రంగానికి 90 శాతం రుణ హామీని అందిస్తుంది. అర్హులైన రుణ గ్రహీతలకు అందించిన అదనపు రుణాల డిఫాల్ట్‌లకు ఈ హామీ వర్తిస్తుంది. ఈ పథకం కింద రుణాన్ని తిరిగి చెల్లించే విషయంలో ఒత్తిడి లేకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఎంఎస్ఎంఈలు, నాన్-ఎంఎస్ఎంఈలకు ఐదేళ్ల కాలపరిమితితో రుణాలు ఇస్తారు. ఇందులో అసలు తిరిగి చెల్లింపుపై ఒక ఏడాది మారటోరియం ఉంటుంది. ఎయిర్‌లైన్స్‌కు ఏడేళ్ల కాలానికి రుణం ఇస్తే రెండేళ్ల మారటోరియం ఉంటుంది. నోటిఫికేషన్ ఇచ్చిన తేదీ నుంచి 2027 మార్చి 31 వరకు మంజూరు చేసే అన్ని రుణాలకు ఈ పథకం వర్తించనుంది.

జేఎల్ఆర్ కార్ల ధరలు రూ.75 లక్షల వరకు తగ్గింపు

బ్రిటన్ నుంచి దిగుమతయ్యే మోడళ్లకు మాత్రమే

న్యూఢిల్లీ: భారత్-యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) దృష్టిలో ఉంచుకుని జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) ఇండియా మంగళవారం కీలక ప్రకటన చేసింది. యూకే నుంచి నేరుగా కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ) రూపంలో దిగుమతి చేసుకునే తన రేంజ్ రోవర్ మోడళ్లపై ధరను రూ.75 లక్షల వరకు తగ్గిస్తున్నట్టు వెల్లడించింది. రేంజ్ రోవర్ ఎస్‌వీ, రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్‌వీ మోడళ్లపై ఈ ప్రయోజనం అందుతుందని పేర్కొంది. రేంజ్ రోవర్ ఎస్‌వీ ధరను రూ.4.25 కోట్ల నుంచి రూ.3.5 కోట్లకు (ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర), రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్‌వీ ధరను రూ.2.75 కోట్ల నుంచి రూ.2.35 కోట్లకు తగ్గించినట్టు తెలిపింది. సవరించిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని కంపెనీ పేర్కొంది. భారత్‌లో తయారు చేసే రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్, రేంజ్ రోవర్ ఎవోక్, రేంజ్ రోవర్ వెలార్, డిస్కవరీ స్పోర్ట్ వంటి మోడళ్ల ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని తెలిపింది.

కిరణ్ మజుందార్ వారసురాలిగా క్లేర్

మేన కోడలికి భవిష్యత్‌లో బయోకాన్ పగ్గాలు



బెంగళూరు: ప్రముఖ బయోఫార్మా కంపెనీ బయోకాన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా తన వారసురాలిని ప్రకటించారు. తన మేనకోడలు (సోదరుడు రవి మజుందార్ కూతురు) క్లేర్ మజుందార్‌కు బయోకాన్ పగ్గాలను అప్పగించనున్నట్లు ఫార్చ్యూన్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. అయితే, తాను ఇప్పుడే బాధ్యతల నుంచి తప్పుకోవట్లేదని, సరైన సమయంలో క్లేర్‌కు సారథ్యం అప్పగించనున్నట్లు కిరణ్ స్పష్టం చేశారు. బయోకాన్‌లో క్లేర్‌కు నాయకత్వ బాధ్యతల్లో తన సోదరుడు ఎరిక్ మజుందార్, భర్త థామస్ రాబర్ట్స్ తోడుగా ఉంటారని కిరణ్ పేర్కొన్నారు. కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రొఫెసర్ అయిన ఎరిక్ మజుందార్ కృత్రిమ మేధ నిపుణుడు కూడా. క్లేర్ భర్త థామస్ రాబర్ట్స్ ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు. ప్రస్తుతం మసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నారు.

క్లేర్‌కే ఎందుకు..?

కిరణ్ మజుందార్ షాకు పిల్లలు లేరు. క్లేర్ కూడా కిరణ్ లాగానే బయోటెక్నాలజీ కంపెనీని నిర్వహిస్తున్నారు. 37 ఏళ్ల క్లేర్ మజుందార్.. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి బయోలాజికల్ ఇంజనీరింగ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పూర్తి చేశారు. అంతేకాదు, స్టాన్‌ఫోర్డ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ నుంచి క్యాన్సర్ బయాలజీలో పీహెచ్‌డీ పొందారు. ప్రస్తుతం 160 కోట్ల డాలర్ల (రూ.15,200 కోట్లు) మార్కెట్ విలువ కలిగిన నాస్‌డాక్ లిస్టెడ్ కంపెనీ బికారా థెరప్యూటిక్స్‌కు సీఈఓగా ఉన్నారు. క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే ఔషధాలను అభివృద్ధి చేస్తున్న క్లినికల్ స్టేజ్ బయోటెక్నాలజీ కంపెనీ ఇది. బికారాలో బయోకాన్ 10 శాతం వాటా కూడా కలిగి ఉంది. బికారా సీఈఓగా బాధ్యతలు చేపట్టకముందు క్లేర్.. థర్డ్ రాక్ వెంచర్స్‌లో సీనియర్ అసోసియేట్‌గా పనిచేశారు. రియోస్ మెడిసిన్స్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్, కార్పొరేట్ స్ట్రాటజీ విభాగ అధిపతిగా బాధ్యతలు నిర్వహించారు.

మార్కెట్ మళ్లీ నష్టాల్లోకి..

సెన్సెక్స్ 252 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం మళ్లీ నష్టాల్లో పయనించాయి. సెన్సెక్స్ ఒక దశలో 754.37 పాయింట్లు క్షీణించి 76,515 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 251.61 పాయింట్ల నష్టంతో 77,017.79 వద్ద స్థిరపడింది. ఒక దశలో 24,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ.. చివర్లో 86.50 పాయింట్ల నష్టంతో 24,032.80 వద్ద ముగిసింది. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన, హోర్ముజ్ జల సంధిలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత ఎగబాకడం, రూపాయి క్షీణత ఇందుకు కారణమయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 నష్టపోయాయి. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసల లాభంతో రూ.95.18 వద్ద ముగిసింది. భారత స్టాక్ మార్కెట్‌పై దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐ) క్రమంగా పట్టు పెంచుకుంటున్నారు. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నిఫ్టీ 500 కంపెనీల్లో డీఐఐల ఈక్విటీ వాటా సరికొత్త రికార్డు స్థాయి 20.9 శాతానికి పెరిగింది. అదే సమయంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) వాటా 17.1 శాతానికి తగ్గింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	515
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	విజయవాడ	128
వరంగల్	135	గుంటూరు	128
కరీంనగర్	135	ఒంగోలు	128
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	121
కర్నూలు	135	నెల్లూరు	126
విశాఖపట్నం	124	అనంతపురం	126
గోదావరి	128		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,49,180▼	1,36,750▼	2,65,000▼
విజయవాడ	1,53,000▼	1,41,000▼	2,48,000▼
విశాఖపట్నం	1,49,180▼	1,36,750▼	2,65,000▼
రాజమండ్రి	1,49,000▼	1,36,000▼	2,65,000▼
ప్రొద్దుటూరు	1,50,700▼	1,38,640▼	2,44,000▼
ముంబై	1,47,636▼	1,35,235▼	2,40,465▲

2026-27లో రూ.24,000 కోట్ల ప్రీమియం వసూళ్ల లక్ష్యం

స్టార్ హెల్త్ ఎండీ ఆనంద్ రాయ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో రూ.24,000 కోట్ల ప్రీమియం వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ ఆనంద్ రాయ్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే పోలిస్తే ఇది రూ.3,600 కోట్లు ఎక్కువ. వచ్చే ఆర్థిక సంవత్సరానికి తమ స్థూల ప్రీమియం వసూళ్లు రూ.30,000 కోట్లకు చేరే అవకాశం ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26) కంపెనీ దేశవ్యాప్తంగా వసూలు చేసిన రూ.20,400 కోట్ల ప్రీమియంలో రూ.2,268 కోట్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సమకూరింది. తమ కంపెనీ ప్రీమియం వసూళ్ల వృద్ధిలో రెండు తెలుగు రాష్ట్రాలది కీలకపాత్ర అని ఆనంద్ రాయ్ చెప్పారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఈ రెండు రాష్ట్రాల్లో తమ వ్యాపార వృద్ధి రేటు కూడా ఎక్కువన్నారు. గత ఆర్థిక సంవత్సరం ఏపీ, తెలంగాణల్లో 1.8 లక్షల ఆరోగ్య బీమా పాలసీల క్లెయిమ్‌లను పరిష్కరించి పాలసీదారులకు రూ.1,254 కోట్లు చెల్లించింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 24 శాతం ఎక్కువని రాయ్ చెప్పారు. వ్యాపార వృద్ధి కోసం ఇక నాన్ మెట్రో నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపై ప్రత్యేక దృష్టి పెట్టబోతున్నట్టు వెల్లడించారు.

స్పోర్ట్స్

ఐపీఎల్‌లో ఏవీ.. ఆ యార్కర్లు?



ఒకప్పుడు టీ20 క్రికెట్‌లో డెత్ ఓవర్లు అంటే.. యార్కర్లతో బ్యాటర్లను బెంబేలెత్తించేవారు. అందుకోసం స్పెషలిస్ట్ బౌలర్‌వైపే కెప్టెన్ చూసేవాడు. కానీ, ఐపీఎల్‌లో మాత్రం యార్కర్‌కు కఠిన సవాలే ఎదురవుతోంది. పక్కా బ్యాటింగ్ పిచ్‌లు సిద్ధం చేస్తున్న పరిస్థితుల్లో ర్యాంప్ షాట్లు, రివర్స్ స్కూప్‌లతో చెలరేగుతుండడంతో అంతిమ ఓవర్లలో ప్రధానాస్త్రంగా భావించే యార్కర్‌కు కాలం చెల్లిందనే టాక్ వినిపిస్తోంది. ఒకప్పుడు బ్యాటర్లను బెంబేలెత్తించిన యార్కర్.. ఇటీవలి కాలంలో హైరిస్క్ డెలివరీగా మారింది. బ్యాటింగ్ విప్లవంలో యార్కర్ కనుమరుగవుతుందా? అనే అనుమానం ఐపీఎల్ మ్యాచ్‌లను చూస్తుంటే కలుగుతోంది.

లోపాలు బహిర్గతం..

లసిత్ మలింగ, బుమ్రాలాంటి వారు యార్కర్లు వేయడంలో తమదైన ప్రతిభను ప్రదర్శించారు. కానీ, మెగా లీగ్‌లో బుమ్రా ధారాళంగా పరుగులు సమర్పించుకొంటున్నాడు. అతడి పదునైన యార్కర్లను కూడా బ్యాటర్లు అలవోకగా బౌండ్రీ ఆవలకు తరలిస్తున్నారు. అయితే, యార్కర్‌ను సంధించే సమయంలో ఖచ్చితత్వం ఎంతో అవసరమని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ మదన్‌లాల్ అన్నాడు. ఏ చిన్నతేడా జరిగినా.. లో ఫుల్‌టాస్ పడుతుందని చెప్పాడు. కాగా, ఐపీఎల్ అనేది యార్కర్లను చంపేయలేదని, అందులోని లోపాలను మాత్రమే బహిర్గతం చేసిందని క్రీడా పండితులు అంటున్నారు.

విన్యాసాలు చేస్తుండడంతో..

క్రీజులో కదలకుండా నిలబడే సమయంలో యార్కర్లు భయపెట్టాయని.. కానీ, ఇప్పుడు బ్యాటర్లు విన్యాసాలు చేస్తుండడంతో సరికొత్తగా ఆలోచించాల్సి వస్తోందని భారత మాజీ వికెట్ కీపర్ దీప్‌దాస్ గుప్తా చెప్పాడు. అందుకే ప్రముఖ బౌలర్లు మూస ధోరణిని వీడి.. వైవిధ్యంతో కూడిన స్లో బంతులు, స్వింగ్‌తోపాటు బ్యాటర్లను బోల్తా కొట్టించే యాంగిల్స్‌లో వేస్తూ ప్రయోగాలు చేస్తున్నారు. బ్యాటర్‌ను ఆశ్చర్యపరచే విధంగా అప్పుడప్పుడు యార్కర్లు సంధిస్తున్నారు. కాగా, భారత యువ బౌలర్లు అన్షుల్ కాంబోజ్ (సీఎస్‌కే), వైశాక్ విజయ్ కుమార్ (పంజాబ్), కార్తీక్ త్యాగి (కోల్‌కతా) వైడ్ యార్కర్లతో బ్యాటర్లను కట్టడి చేస్తున్నారు. 'రివర్స్ స్వింగ్ లభిస్తుంటే యార్కర్ కంటే మంచి బాల్ మరోటి ఉండదు. నా దృష్టిలో వైడ్ యార్కర్లు వేయడంపై పట్టుసాధించడం చాలా కష్టం' అని టీమిండియా మాజీ స్పిన్నర్ శరణ్‌దీప్ సింగ్ అభిప్రాయపడ్డాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

హెచ్‌సీఏలోకి రాయుడు

క్రికెట్ ఆపరేషన్స్ చీఫ్‌గా నియామకం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశవాళీ క్రికెట్‌లో హైదరాబాద్‌ను పవర్ హౌస్‌గా మారుస్తానని మాజీ క్రికెటర్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ (హెచ్ఓఓ)గా నియమితుడైన అంబటి రాయుడు అన్నాడు. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన విలేకర్ల సమావేశంలో హెచ్‌సీఏ కార్యదర్శి మన్నె జీవన్ రెడ్డి కొన్ని కీలక నిర్ణయాలను ప్రకటించారు. రాయుడుని హెచ్ఓఓగా, అవినీతి నిరోధక శాఖ-భద్రతా విభాగం చైర్మన్‌గా రిటైర్డ్ జస్టిస్ విజేందర్‌ను నియమించారు.

నెంబర్‌వన్‌గానే టీమిండియా

దుబాయ్: అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా తమ అగ్రస్థానాన్ని నిలబెట్టుకొంది. టీ20 వరల్డ్‌కప్ చాంపియన్‌గా నిలిచిన భారత జట్టు ఖాతాలో 274 రేటింగ్ పాయింట్లున్నాయి. 2024లోనూ వరల్డ్‌కప్ గెలిచిన భారత్ ఆ తర్వాత రెండేళ్ల కాలంలో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌ల్లో అజేయంగా నిలిచింది. ఇక ఇంగ్లండ్ (262), ఆస్ట్రేలియా (258) జట్లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

వినేశ్‌కు ఐటీఏ నోటీసులు



న్యూఢిల్లీ: పోటీలు లేని సమయాల్లో నిర్వహించే డోపింగ్ టెస్ట్‌కు అందుబాటులో లేకపోవడంపై ఒలింపిక్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) నోటీసులు జారీ చేసింది. గతేడాది డిసెంబరు 18న పరీక్షకు ఫొగట్ హాజరుకాలేదు. గత 12 నెలల్లో తాము ఎక్కడున్నామన్న ఉనికిని తెలియపరచే నిబంధనను ఆమె ఉల్లంఘించడం ఇదే తొలిసారి. ఈ క్రమంలో జనవరి 19న వినేశ్ ఇచ్చిన వివరణను సమీక్షించే క్రమంలో పరీక్ష గైర్హాజరీని రికార్డు చేసినట్టు ఐటీఏ తెలిపింది. తాజా నోటీసు తమ ఉనికి గురించిన అంశాన్ని అప్రమత్తం చేయడానికే కానీ.. డోపింగ్ ఉల్లంఘన కాదు.

నేటి మ్యాచ్

వేదిక హైదరాబాద్

సన్‌రైజర్స్ x పంజాబ్ రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	9	6	2	1	13	0.855
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	10	6	4	0	12	0.644
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	10	6	4	0	12	-0.147
చెన్నై	10	5	5	0	10	0.151
ఢిల్లీ	10	4	6	0	8	-0.949
కోల్‌కతా	9	3	5	1	7	-0.539
ముంబై	10	3	7	0	6	-0.649
లఖ్‌నవూ	9	2	7	0	4	-1.076

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు

రాజస్థాన్ బిడ్డింగ్ నుంచి తప్పుకోలేదు

సోమాని గ్రూప్ ప్రకటన

న్యూఢిల్లీ: రాజస్థాన్ రాయల్స్‌ను కొనుగోలు చేసే చాన్స్ చేజారడంపై కల్ సోమాని కన్సార్టియం నిరాశ వ్యక్తం చేసింది. అయితే, బిడ్డింగ్ నుంచి తాము తప్పుకోలేదని తెలిపింది. సోమాని నేతృత్వంలోని కన్సార్టియం నిధుల సమీకరణలో ఆలస్యమవడంతో.. స్టీల్ దిగ్గజం లక్ష్మీ మిట్టల్ అండ్ కో రూ. 15,600 కోట్లకు రాజస్థాన్‌ను దక్కించుకొంది. దీంతో, బిడ్డింగ్ నుంచి సోమానీ గ్రూప్ తప్పుకొందని రాజస్థాన్ యాజమాన్యం ప్రకటించింది. 'మొత్తం ప్రక్రియను ముగించడానికి 6 నెలల గడువు కోరాం. కానీ, మాపై ఒత్తిడి తెచ్చారు. నిధులకు ఎలాంటి లోటూ లేదు. బిడ్డింగ్ నుంచి తప్పుకోలేద'ని సోమానీ గ్రూప్ ఓ ప్రకటనలో తెలిపింది.

రాధే రాధే.. జై శ్రీరామ్


స్పిన్నర్ రఘు శర్మ సంబరాలు



ముంబై: లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్ రఘు శర్మ కెరీర్‌లో తొలి వికెట్ సాధించగానే భావోద్వేగానికి లోనయ్యాడు. అక్షత్‌ను అవుట్ చేసిన వెంటనే తన జేబులో నుంచి ఓ కాగితం తీసి డ్రెస్సింగ్ రూమ్ వైపు చూపడం అందరినీ ఆకర్షించింది. 'రాధే రాధే.. గత 15 ఏళ్లు ఎంతో బాధగా ముగిశాయి. ఆ గురుదేవుని దయ వల్ల నేటితో ఆ బాధ తీరింది. ఈ అవకాశం ఇచ్చినందుకు ముంబై ఇండియన్స్‌కు ధన్యవాదాలు. ఎప్పటికీ మీకు రుణపడి ఉంటాను.. జై శ్రీరామ్' అని అందులో ఉంది. ఇప్పుడీ నోట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గతేడాది ముంబై జట్టులో చేరిన 33 ఏళ్ల రఘు ఈనెల రెండున చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేసినా వికెట్ తీయలేకపోయాడు.

అలాగైతే బాయ్‌కాట్ చేద్దాం

ఫ్రెంచ్ ఓపెన్ ప్రైజ్‌మనీపై సబలెంక



రోమ్: ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ ఆదాయంలో ఆటగాళ్లకు దక్కాల్సిన ప్రైజ్‌మనీ వాటా శాతాన్ని నిర్వాహకులు తగ్గించడంపై భగ్గుమంటున్న టాప్ ప్లేయర్లు తమ స్వరాన్ని తీవ్రతరం చేస్తున్నారు. ఈ విషయంలో నిర్వాహకులు దిగిరాకపోతే.. ఏకంగా బాయ్‌కాట్ చేద్దామంటూ మహిళల నెంబర్‌వన్ సబలెంక సహచరులకు పిలుపునిచ్చింది. 2024 ఫ్రెంచ్ ఓపెన్‌లో టోర్నీ ఆదాయంలో క్రీడాకారులకిచ్చే మొత్తం 15.5 శాతం ఉండగా.. ఈసారి దాన్ని 14.9 శాతానికి తగ్గించారు. ఓవరాల్ ప్రైజ్‌మనీని పెంచినా, ఆటగాళ్ల ఆదాయంలో వాటాను తగ్గించడంపై స్టార్ ప్లేయర్లు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

సంజూ.. సూపర్

ఢిల్లీపై 8 వికెట్లతో చెన్నై విజయం



న్యూఢిల్లీ: సీజన్ ఆరంభంలో తడబడిన చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం నిలకడైన ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. బౌలర్లు విశేషంగా రాణించిన చోట.. స్టార్ ఓపెనర్ సంజూ శాంసన్ (52 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 87 నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో తుదికంటా నిలిచాడు. దీంతో మంగళవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 8 వికెట్లతో ఘన విజయం సాధించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 7 వికెట్లకు 155 పరుగులు చేసింది. సమీర్ రిజ్వీ (24 బంతుల్లో 4 సిక్సర్లతో 40 నాటౌట్), స్టబ్స్ (31 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 38) రాణించారు. నూర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 159 పరుగులు చేసి గెలిచింది. సంజూకు కార్తీక్ శర్మ (31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41 నాటౌట్) సహకరించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా శాంసన్ నిలిచాడు.

శాంసన్-కార్తీక్ శతక భాగస్వామ్యం: ఓ మాదిరి ఛేదనలో చెన్నై ఓపెనర్ సంజూ శాంసన్ నిలకడను చూపాడు. బంతి బ్యాట్‌పైకి రావడం కష్టంగా మారినా క్రీజులో ఓపిగ్గా నిలిచాడు. కుదురుకునేందుకు కాస్త సమయం తీసుకున్నాక.. ఎదురుదాడికి దిగడంతో ఢిల్లీకి నిరాశ తప్పలేదు. యువ బ్యాటర్ కార్తీక్ శర్మ మరోసారి ఆకట్టుకుని సంజూతో శతక భాగస్వామ్యం అందించాడు. ఆరంభంలో ఢిల్లీ బౌలర్లు కట్టడి చేయడంతో చెన్నై ఇన్నింగ్స్ నిదానంగానే సాగింది. ఓపెనర్ రుతురాజ్ (6)ను పేసర్ ఎన్‌గిడి అవుట్ చేయగా, ఉర్విల్ (17) రెండు సిక్సర్లతో పవర్‌ప్లేలో జట్టు 44/1తో ఫర్వాలేదనిపించింది. స్పిన్నర్ అక్షర్ బౌల్డ్ చేయడంతో ఉర్విల్ వెనుదిరిగాడు. కానీ ఏడో ఓవర్ నుంచి శాంసన్-కార్తీక్ జోడీ క్రీజులో పాతుకుపోయింది. శాంసన్ అడపాదడపా బౌండరీలతో స్కోరులో వేగం పెంచాడు. కుల్దీప్ వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో 6,6,4తో 32 బంతుల్లో తను హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. స్టార్క్ ఓవర్‌లోనూ శాంసన్ రెండు ఫోర్లతో ఆకట్టుకోవడంతో 13వ ఓవర్‌లో స్కోరు వంద దాటింది. పేసర్ నటరాజన్ ఓవర్‌లో మరింత చెలరేగిన సంజూ 6,6,4తో 20 పరుగులు అందించాడు. అటు కార్తీక్ 6,4తో మరో 15 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు. ఇద్దరి మధ్య మూడో వికెట్‌కు అజేయంగా 114 పరుగులు జత చేరడం విశేషం.

ఆదుకున్న రిజ్వీ-స్టబ్స్: టాస్ గెలిచిన ఢిల్లీ బ్యాటింగ్ తీసుకున్నప్పటికీ ఇన్నింగ్స్ మాత్రం నత్తనడకన సాగింది. దీనికి తోడు చెన్నై స్పిన్నర్ల ధాటికి ఆరంభం నుంచే వికెట్లను కూడా కోల్పోయింది. టాప్-4 బ్యాటర్లు రెండంకెల స్కోర్లు సాధించినా ఏ ఒక్కరూ 20 పరుగులు చేయలేకపోయారు. కెప్టెన్ అక్షర్ (2) పేలవ ఫామ్ మరోసారి కొనసాగించాడు. ఈ స్థితిలో స్టబ్స్, రిజ్వీ అండగా నిలిచి జట్టుకు గౌరవప్రదమైన స్కోరునందించారు. పవర్‌ప్లేలో కేవలం 37 పరుగులే చేసిన ఢిల్లీ.. ఓపెనర్లు నిస్సాంక (19), రాహుల్ (12) వికెట్లను కోల్పోయింది. ఇక స్పిన్నర్ నూర్ తన వరుస ఓవర్లలో కరుణ్ నాయర్ (13), నితీశ్ రాణా(15)లను వెనక్కి పంపగా.. అక్షర్ పోరాటం ఆరు బంతులకే ముగిసింది. దీంతో ఢిల్లీ 69 పరుగులకే 5 వికెట్లు చేజార్చుకుంది. అప్పటికి మరో 9 ఓవర్లు మిగిలి ఉన్నాయి. పిచ్‌పై రన్స్ సాధించడం కష్టం కావడంతో స్టబ్స్, ఇంపాక్ట్ ప్లేయర్ రిజ్వీ ఓపికగా ఆడారు. వికెట్ కాపాడుకుంటూనే అడపాదడపా బౌండరీలపై దృష్టి సారించారు. 11వ ఓవర్‌లో స్టబ్స్ క్యాచ్‌ను నూర్ వదిలేయడం కలిసివచ్చింది. 18వ ఓవర్‌లో రిజ్వీ రెండు సిక్సర్లతో బ్యాట్ ఝుళిపించాడు. ఆ తర్వాతి ఓవర్‌లో స్టబ్స్‌ను పేసర్ ఒవర్టన్ అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక చివరి ఓవర్‌లో అశుతోష్ (14) రెండు సిక్సర్లు బాది రనవుట్ కాగా, ఆఖరి బంతిని రిజ్వీ సిక్సర్‌గా మలిచి స్కోరును 150 దాటించాడు.

స్కోరుబోర్డు

ఢిల్లీ: నిస్సాంక (సి) బ్రెవిస్ (బి) ముకేశ్ 19, రాహుల్ (సి) గైక్వాడ్ (బి) హుస్సేన్ 12, నితీశ్ (సి) కార్తీక్ (బి) నూర్ 15, కరుణ్ (సి) గుర్జపనీత్ (బి) నూర్ 13, అక్షర్ (సి) హుస్సేన్ (బి) గుర్జపనీత్ 2, స్టబ్స్ (సి) ముకేశ్ (బి) ఒవర్టన్ 38, రిజ్వీ (నాటౌట్) 40, అశుతోష్ (రనౌట్) 14, స్టార్క్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 155/7; వికెట్ల పతనం:** 1-29, 2-36, 3-52, 4-61, 5-69, 6-134, 7-149; **బౌలింగ్:** అకీల్ 4-0-19-1, ముకేశ్ 4-0-31-1, అన్షుల్ 4-0-49- 0, నూర్ అహ్మద్ 3-0-22-2, గుర్జపనీత్ 4-0-29-1, ఒవర్టన్ 1-0-5-1.

చెన్నై: సంజూ (నాటౌట్) 87, రుతురాజ్ (సి) రిజ్వీ (బి) ఎన్‌గిడి 6, ఉర్విల్ (స్టంప్డ్) రాహుల్ (బి) అక్షర్ 17, కార్తీక్ శర్మ (నాటౌట్) 41, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 17.3 ఓవర్లలో 159/2; వికెట్ల పతనం:** 1-24, 2-45; **బౌలింగ్:** స్టార్క్ 4-0-30-0, అక్షర్ 4-0-25-1, ఎన్‌గిడి 4-0-30-1, కుల్దీప్ 3-0-34-0, నటరాజన్ 2.3-0-39-0.

ఆంధ్రజ్యోతి
గుంటూరు ● బుధవారం 6 మే 2026

హైదరాబాద్- చండీగఢ్
విమానంలో పేలిన పవర్ బ్యాంక్

» చండీగఢ్‌లో విమానం ల్యాండైన కాసేపటికే ఘటన

» ప్రయాణికులు సురక్షితం, ఓ మహిళకు గాయాలు


ప్రయాణికులను అత్యవసరంగా విమానం నుంచి దింపేస్తున్న సిబ్బంది

శంషాబాద్ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి చండీగఢ్‌కు వెళ్లిన ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. విమానం ల్యాండ్ అయ్యే సమయంలో ఓ ప్రయాణికుని వద్ద ఉన్న పవర్ బ్యాంకు పేలి విమానమంతా మంటలు, పొగ వ్యాపించాయి. దీంతో అత్యవసర ద్వారాన్ని తెరిచి ప్రయాణికులను సురక్షితంగా కిందకు దింపారు. ఈ ఘటనలో ఓ మహిళకు గాయాలయ్యాయి. ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 200 మంది ప్రయాణికులతో ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం మంగళవారం మధ్యాహ్నం 1.25 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో బయలుదేరి 3.29 గంటలకు చండీగఢ్‌లోని షహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. విమానం ల్యాండైన తర్వాత 'బే' వైపు వెళ్తుండగా ఒక్కసారిగా మంటలతో పొగ వచ్చింది. క్షణాల్లో విమానమంతా పొగ వ్యాపించి లోపల ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. అయితే, అప్రమత్తమైన సిబ్బంది అత్యవసర ద్వారాలను తెరిచి గాలితో నింపిన స్లైడ్‌ల ద్వారా ప్రయాణికులను కిందకు దింపారు. ఈ సమయంలో జరిగిన తోపులాటల్లో ఓ ప్రయాణికురాలికి గాయాలయ్యాయి. ఓ ప్రయాణికుడు తనకు ఎదురుగా ఉన్న సీటు వెనుక చిన్నచిన్న వస్తువులు పెట్టుకునేందుకు ఉండే పౌచ్‌లోనే పవర్ బ్యాంక్ పెట్టారని, అదే పేలి మంటలు, పొగ వచ్చాయని అధికారులు తెలిపారు.

కేజ్రీవాల్ తరఫున వాదనలకు
కోర్టే లాయర్లను నియమిస్తుంది

» ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ప్రకటన



న్యూఢిల్లీ, మే 5: మద్యం విధానం కేసులో ఆప్ నాయకులు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, దుర్గేష్ పాఠక్‌ల తరఫున వాదనలు వినిపించడానికి ఢిల్లీ హైకోర్టే న్యాయవాదులను నియమించనుంది. ముగ్గురు సీనియర్ లాయర్లను అమికస్ క్యూరీలుగా నియమిస్తామని న్యాయమూర్తి స్వర్ణకాంత శర్మ మంగళవారం తెలిపారు. ఆప్ నాయకులపై సీబీఐ నమోదు చేసిన కేసును తొలుత ట్రయల్ కోర్టు కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో అప్పీలు చేయగా, ఆ పిటిషన్ జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం ముందుకు వెళ్లింది. ఆమె పక్షపాతంతో వ్యవహరిస్తారని, అందువల్ల విచారణకు హాజరుకాబోమని ఆప్ నాయకులు తెలిపారు. తమ తరఫున న్యాయవాదులను కూడా నియమించబోమని చెప్పారు. దాంతో ఆప్ నాయకుల తరఫున న్యాయవాదులు లేకుండా విచారణ ప్రారంభించడం సరికాదని భావించిన న్యాయమూర్తి కేసును ఈ నెల ఎనిమిదో తేదీకి వాయిదా వేశారు. వారి తరఫున వాదనలు వినిపించడానికి న్యాయవాదులను నియమిస్తామని తెలిపారు. వారి పేర్లను శుక్రవారం ప్రకటిస్తామని చెప్పారు.

ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా పేల్చేస్తా!

వాణిజ్య నౌకలను హోర్ముజ్ దాటించేందుకు 'ప్రాజెక్టు ఫ్రీడమ్'

» ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక




ఇరాన్ దాడులతో ఫుజైరా చమురు కేంద్రంలో మంటలు

వాషింగ్టన్/దుబాయ్/న్యూఢిల్లీ, మే 5: పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకున్న వాణిజ్య నౌకలను తమ యుద్ధ నౌకల రక్షణ మధ్య హోర్ముజ్ జలసంధి దాటిస్తామని.. ఇందుకోసం 'ప్రాజెక్టు ఫ్రీడమ్' చేపట్టామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. హోర్ముజ్ జలసంధిలో తమ నౌకలపై గనుక దాడి చేస్తే.. ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా పేల్చేస్తానని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండటానికి వీల్లేదని పేర్కొన్నారు. శ్వేతసౌధంలో జరిగిన ఓ కార్యక్రమంలో, ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. పర్షియన్ గల్ఫ్ నుంచి గల్ఫ్ ఆఫ్ ఒమన్ వరకు అమెరికా మిలిటరీ ఆధిపత్యమే కొనసాగుతోందని.. ఇరాన్ వైమానిక, నావికా దళాలను, రాడార్లు, ఇతర వ్యవస్థలన్నీ నాశనం చేశామని చెప్పారు. ప్రస్తుతం ఇరాన్ నాయకత్వ సమస్యతో కొట్టుమిట్టాడుతోందన్నారు. అమెరికా ఇంతకు ముందు వినియోగించని శక్తివంతమైన, వ్యూహాత్మక ఆయుధాలను సన్నద్ధంగా ఉంచిందని, అవసరమైతే వాటిని వినియోగిస్తామని పేర్కొన్నారు. చర్చల విషయంలో ఇరాన్ కాస్త దిగివచ్చిందని, కానీ అది సరిపోదని వ్యాఖ్యానించారు. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న తమ నౌకల వైపు వచ్చిన ఆరు ఇరాన్ బోట్లను పేల్చివేశామని ట్రంప్ చెప్పారు.

ప్రాంతీయ భద్రతకు విఘాతం: ఘలీబఫ్

కాల్పుల విరమణను ఉల్లంఘించేలా అమెరికా వ్యవహరిస్తున్న తీరు పశ్చిమాసియాలో ప్రాంతీయ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘలీబఫ్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణను తప్పించేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలపై తాము ఇంకా పూర్తిస్థాయిలో ప్రతిస్పందించ లేదన్నారు. కాగా, ఆరు ఇరాన్ బోట్లను ముంచేశామన్న అమెరికా ప్రకటనను ఇరాన్ సైన్యం ఖండించింది. రెండు ఇరాన్ సరుకు రవాణా బోట్లపై దాడి జరిగిందని, ఐదుగురు పౌరులు మరణించారని పేర్కొంది.

యూఏఈపై దాడులు సరికాదు: మోదీ

యూఏఈపై క్షిపణి, డ్రోన్ దాడులను ప్రధాని మోదీ ఖండించారు. ఇలా పౌర, మౌలిక సదుపాయాలను లక్ష్యం చేసుకోవడం ఏమాత్రం అంగీకారయోగ్యం కాదని 'ఎక్స్'లో పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధిలో భద్రమైన, ఎలాంటి అంతరాయం లేని నౌకా రవాణా అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. 'ప్రాజెక్టు ఫ్రీడమ్' పేరిట హోర్ముజ్‌ను తెరిచేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఇరాన్ ప్రతిచర్యలకు దిగిన సంగతి తెలిసిందే. యూఏఈలోని ఫుజైరా చమురు క్షేత్రంపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించగా.. అక్కడ పనిచేస్తున్న ముగ్గురు భారతీయ సిబ్బంది గాయపడ్డారు.

అమెరికా ట్యాంకర్ విమానం అదృశ్యం!

అమెరికా సైన్యానికి చెందిన కేసీ-135 స్ట్రాటో ట్యాంకర్ విమానం మంగళవారం పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో అదృశ్యమైంది. యూఏఈలోని అల్ ధాఫ్రా ఎయిర్‌బేస్ నుంచి బయలుదేరిన ఈ విమానం ఖతార్ గగనతలానికి సమీపంలో ప్రయాణిస్తుండగా '7700' అంటూ అత్యవసర ప్రమాద సంకేతాన్ని పంపింది. ఫ్లైట్‌రాడార్24 వెబ్‌సైట్ ట్రాకింగ్ డేటా ప్రకారం గల్లంతవడానికి ముందు ఈ కేసీ-135 విమానం పర్షియన్ గల్ఫ్‌లోనే పలుమార్లు చక్కర్లు కొట్టింది. ల్యాండ్ అయ్యేందుకు ఖతార్‌వైపు మళ్లింది. కాసేపటికే రాడార్ల నుంచి అదృశ్యమైంది. యూఏఈ వైపు ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లలో ఏదైనా తగిలిందా? మరేదైనా సాంకేతిక కారణంతో కూలిపోయిందా అన్న దానిపై స్పష్టత రాలేదు. అమెరికా యుద్ధ విమానాలకు గాల్లోనే ఇంధనాన్ని నింపేందుకు, అత్యవసర పరిస్థితుల్లో రవాణా కోసం బోయింగ్ కేసీ-135 విమానాలను ఉపయోగిస్తారు.

సముద్రంలో చిక్కిన.. భారత నావికులకు పాక్ సాయం!

నౌకలో సాంకేతిక సమస్య తలెత్తి సముద్రంలో చిక్కుకున్న భారత నౌకలోని సిబ్బందికి పాకిస్థాన్ నౌకాదళం సాయం అందించింది. దీనిపై పాక్‌కు చెందిన డాన్ పత్రిక కథనం ప్రచురించింది. ఒమన్ నుంచి భారత్‌కు వస్తున్న ఎంవీ గౌతమ్ నౌక పాక్‌కు సమీపంలో అరేబియా సముద్రంలో సాంకేతిక సమస్యలతో నిలిచిపోయింది. అందులో ఆరుగురు భారతీయులు, ఒక ఇండోనేషియన్ ఉన్నారు. దీనిపై ముంబైలోని భారత మ్యారీటైమ్ రెస్క్యూ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు పాక్ మ్యారీటైమ్ సెక్యూరిటీ ఫోర్స్ స్పందించి.. ఎంవీ గౌతమ్ నౌకలోని సిబ్బందికి ఆహారం, మందులు, ఇతర సహాయాన్ని అందించినట్టు డాన్ పత్రిక పేర్కొంది.


సుపర్ణ శర్మ


ఆనందర్ ఆర్కే

ఇద్దరు భారత
జర్నలిస్టులకు పులిట్జర్

న్యూయార్క్, మే 5: భారత జర్నలిస్టులు ఆనంద్ ఆర్కే, సుపర్ణ శర్మ ప్రతిష్ఠాత్మక పులిట్జర్ అవార్డును గెలుచుకున్నారు. డిజిటల్ నిఘా, సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్టులపై వారు ప్రజల్లో అవగాహన పెంచడానికి చేసిన కృషికి గాను వారికి ఈ బహుమతి లభించింది. 'వివరణాత్మక రిపోర్టింగ్, వ్యాఖ్యానం' విభాగంలో వీరిద్దరికి ఈ అవార్డును ప్రకటించారు. ఆనంద్, సుపర్ణతో పాటు బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థ రిపోర్టర్ నటాలీ ఒబికో కూడా ఇదే విభాగంలో పులిట్జర్ బహుమతికి ఎంపికయ్యారు. అంటే ముగ్గురికి కలిపి ఈ అవార్డును ప్రకటించారు. వీరు ముగ్గురు సంయుక్తంగా బ్లూమ్‌బర్గ్ కోసం రాసిన 'ట్రాప్‌డ్' అనే వార్తా కథనం రాశారు. కాగా, కొలంబియా యూనివర్సిటీ పులిట్జర్ బహుమతులను అందజేస్తుంది. జర్నలిజం, సాహిత్యంలో దీనికి అత్యున్నత అవార్డుగా భావిస్తారు.

సివిల్స్ విజేతల ఉపకులాల వివరాలు నమోదు చేయండి

» ప్రభుత్వానికి సమాచార కమిషన్ సిఫారసు

న్యూఢిల్లీ, మే 5: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసు పరీక్షల్లో తుది విజయం సాధించిన అభ్యర్థుల ఉపకులాల వివరాలను ఇక నుంచి రికార్డుల్లో నమోదు చేయాలని ప్రభుత్వానికి కేంద్ర సమాచార కమిషన్ సిఫార్సు చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కులాల వారీగా ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు ఈ సమాచారం ఉపకరిస్తుందని అభిప్రాయపడింది. 1995 నుంచి ఐఏఎస్‌కు ఎంపికైన అభ్యర్థుల కులాల వివరాలు ఇవ్వాలంటూ సమాచార హక్కు చట్టం కింద దాఖలైన దరఖాస్తుపై రెండోస్థాయి విచారణ జరిపిన కమిషన్ ఈ సూచన చేసింది. అంతకుముందు కేంద్రం ఈ ఉపకులాల వివరాల రికార్డులు లేవని కమిషన్‌కు తెలిపింది.

మీరేమైనా మన దేశానికి ప్రధాన పూజారా?

శబరిమల కేసులో పిటిషనర్‌ను ప్రశ్నించిన సీజేఐ


జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ, మే 5: 'మీరెందుకు ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు? మీరేమైనా మన దేశానికి ప్రధాన పూజారా?' అంటూ పిటిషన్‌దారును సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. శబరిమల ఆలయంతోపాటు, దేశంలోని మతపరమైన స్థలాల్లో మహిళల ప్రవేశంపై ఆంక్షలకు సంబంధించి దాఖలైన పిటిషన్ల మీద సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ కొనసాగించింది. పిటిషనర్లలో ఒకరైన 'ఇండియన్ యంగ్ లాయర్స్ అసోసియేషన్' తరఫున న్యాయవాది రవిప్రకాశ్‌గుప్తా వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా, ధర్మాసనంలో ఉన్న జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. 'అయ్యప్పస్వామిలో విశ్వాసం ఉన్న వాళ్లు సంబంధిత సంప్రదాయాల్ని పాటిస్తారు. కానీ, విశ్వాసం లేని వాళ్లను అనుమతించాలని మీరు చెబుతున్నారు. దానిని కోర్టు ప్రోత్సహించదు. మీరు నిజమైన భక్తులు కాదు. మీ సంస్థకు మరే పని లేదా? ఇది వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన విషయం. మీ వంటి ఒక న్యాయపరమైన సంస్థకు (మతపరమైన) విశ్వాసాలుంటాయా' అని ప్రశ్నించారు. ఈ సమయంలో సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ.. పిల్ ఎందుకు దాఖలు చేశారు? మీరేమైనా మన దేశానికి ప్రధాన పూజారా? అని ప్రశ్నించారు. దీనికి న్యాయవాది సమాధానమిస్తూ.. 2006లో వార్తాపత్రికల్లో ప్రచురించిన కొన్ని వార్తల ఆధారంగా అదే ఏడాది ఆలయంలోని అందరినీ అనుమతించాలంటూ పిల్ దాఖలైందని గుర్తు చేశారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. 'వార్తా పత్రికల్లో వచ్చే వార్తల ఆధారంగా పిల్ దాఖలు చేస్తారా? పిల్ వేయటం కోసం పత్రికల్లో వార్తలు రాయించటం సులువైన పని' అని వ్యాఖ్యానించారు. జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. 'ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఇప్పుడు ప్రైవేట్ ఇంట్రెస్ట్ లిటిగేషన్, పబ్లిసిటీ ఇంట్రెస్ట్ లిటిగేషన్, పైసా ఇంట్రెస్ట్ లిటిగేషన్, పొలిటికల్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌లలాగా మారిపోయింది. కానీ, నిజమైన పిల్‌లను మాత్రమే మేం అనుమతిస్తాం. అని పేర్కొన్నారు.

కాంగ్రెస్ విజేతల్లో
అత్యధికులు ముస్లింలే

» అసోం, కేరళల్లో 80 శాతం స్ట్రైకింగ్ రేటు

న్యూఢిల్లీ, మే 5 : నాలుగు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచినవారిలో అత్యధికులు ముస్లింలే ఉన్నారు. రాష్ట్రాలవారీగా చూస్తే.. అసోంలో కాంగ్రెస్ 19 సీట్లు దక్కించుకోగా, 18 చోట్ల ముస్లింలు విజయం సాధించారు. ఇక్కడ 20 మంది ముస్లింలకు ఆ పార్టీ టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ మిత్రపక్షం రాయిజోర్ దళ్ నుంచి గెలిచిన ఇద్దరిలో ఒకరు ముస్లిం. కేరళను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంది. 140 సీట్లు కలిగిన ఈ రాష్ట్రంలో 35 చోట్ల ముస్లింలు వేర్వేరు పార్టీల నుంచి పోటీచేసి గెలిచారు. ఇందులో 30 మంది కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి నుంచే బరిలోకి దిగారు. ఇందులో ఎనిమిది మంది కాంగ్రెస్, తక్కిన 22 మంది మిత్రపక్షాల నుంచి పోటీచేశారు. బెంగాల్‌లో కాంగ్రెస్ గెలిచిన రెండు సీట్లలోనూ ముస్లిములే విజేతలుగా నిలిచారు. ఇక్కడ కాంగ్రెస్ మొత్తం 63 మంది ముస్లింలకు సీట్లు ఇచ్చింది. తమిళనాడులో పొత్తులో భాగంగా తనకు దక్కిన కొద్ది సీట్లలో రెండు ముస్లింలకు ఇవ్వగా, ఒకరు గెలిచారు. ఇక.. కేరళ, అసోంల్లో కాంగ్రెస్, మిత్రపక్షాలు నిలిపిన ముస్లిముల్లో గెలుపు శాతం 80 శాతం ఉన్నట్టు ఓ అధ్యయనంలో తేలింది.

రాష్ట్రపతి వద్దకు 'ఆప్' పంచాయితీ

'ఆప్' తమను వేధిస్తోందని చద్దా ఫిర్యాదు

న్యూఢిల్లీ, మే 5: ఆమ్ ఆద్మీ పార్టీలోని అసమ్మతి పంచాయితీ చివరకు రాష్ట్రపతిభవన్‌కు చేరింది. ఆప్‌ను వీడి తన ఆరుగురు సహచరులతో కలిసి బీజేపీలో విలీనమైన రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా; వీరికి వ్యతిరేకంగా పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఒకేరోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి పరస్పరం ఫిర్యాదులు చేశారు. పార్టీని వీడిన ఎంపీలపై ఆప్ నాయకత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని చద్దా ఆరోపించారు. ఆప్‌ను వీడిన నేతల్లో ఒకరైన సందీప్ పాఠక్‌పై పంజాబ్ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, ఆయన కోసం గాలింపు చేపట్టడాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లినట్టు మీడియాకు ఆయన తెలిపారు. 'ఇది అత్యంత ప్రమాదకర ప్రతీకార చర్య' అంటూ చద్దా దుయ్యబట్టారు. రాజకీయ కక్ష సాధింపుల కోసం అధికార యంత్రాంగాన్ని వినియోగించడం గర్హనీయమన్నారు. సందీప్ పాఠక్‌పై అవినీతి ఆరోపణలు మోపి అరెస్టు చేయడానికి ప్రయత్నించడంతోపాటు ఎంపీ, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్‌పై దాడి జరిగిందని, మరో ఎంపీ రాజేందర్ గుప్తా వ్యాపారాలను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చద్దా ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, ఇటీవల బీజేపీలో విలీనమైన 'ఆప్' ఎంపీల రాజ్యసభ సభ్యత్వాలను రద్దుచేయాలని రాష్ట్రపతిని పంజాబ్ సీఎం మాన్ అభ్యర్థించారు. విధి నిర్వహణలో విఫలమైన ప్రజాప్రతినిధులను తొలగించే రీకాల్ హక్కును ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిందని ఆయన తెలిపారు. ఆప్‌కు రాజ్యసభలో 10మంది సభ్యులు ఉండగా, వారిలో ఏడుగురు గత నెల 24వ తేదీన ఆ పార్టీని వీడారు. వారిలో స్వాతి మాలీవాల్‌ను తప్పించి, తక్కిన ఆరుగురూ పంజాబ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రాజీనామా చేయను

(మొదటిపేజీ తరువాయి)


తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతున్న మమతా బెనర్జీ

బీజేపీ పూర్తిస్థాయిలో దుర్వినియోగపరిచిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం దారుణ హత్యకు గురైందని, చరిత్రలో ఇదో చీకటి అధ్యాయమని అన్నారు. ఓటరు జాబితాలోనూ అక్రమాలకు పాల్పడ్డారని మమత ఆక్షేపించారు. రాష్ట్రంలో 90 లక్షల ఓట్లను తొలగించారని, తాము కోర్టుకు వెళితే 32 లక్షల పేర్లను తిరిగి చేర్చారని తెలిపారు. పోలింగ్ సమయంలో, ఓట్ల లెక్కింపు సందర్భంగా కూడా తమ పార్టీ కార్యకర్తలపై తీవ్రంగా దాడులు జరిగాయని చెప్పారు. మొదటి రౌండ్ లెక్కింపు తరువాత ఓ వర్గం మీడియా బీజేపీ గెలుస్తోందంటూ ప్రచారం మొదలుపెట్టిందని, ఆ తరువాత ఆ పార్టీ కార్యకర్తలు కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించి తమ కార్యకర్తలపై దాడులు ప్రారంభించారని తెలిపారు. తనపై కూడా దాడి చేశారని, బయటికి గెంటేశారని చెప్పారు.

ఇలాంటి ఎన్నికలను ఎప్పుడూ చూడలేదు..

తన రాజకీయ జీవితంలో ఇలాంటి ఎన్నికలను ఏనాడూ చూడలేదని మమత అన్నారు. ఎన్నికల అనంతర హింసను, క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకునేందుకు తమ పార్టీ తరఫున 10 మందితో నిజనిర్ధారణ కమిటీని నియమించినట్లు ప్రకటించారు. తనకు అధికారం ముఖ్యం కాదని, ప్రజల సంక్షేమమే ముఖ్యమని మమతా బెనర్జీ అన్నారు. పులిలా పోరాడిన చరిత్ర తమదని, ఇకపైనా పోరాటం కొనసాగిస్తామని, మళ్లీ పుంజుకుంటామని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఇండియా కూటమి నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, అరవింద్ కేజ్రీవాల్, ఉద్ధవ్ ఠాక్రే, హేమంత్ సోరేన్, తేజస్వియాదవ్ తనతో మాట్లాడారని, సంఘీభావం తెలిపారని చెప్పారు. ఇకపై దేశవ్యాప్తంగా ఇండియా కూటమిని బలోపేతం చేయడంపై తాను దృష్టి పెడతానన్నారు. కేంద్రంలో ఎల్లప్పుడూ తామే అధికారంలో ఉండబోమనే విషయాన్ని బీజేపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. అధికారం కోల్పోయిన రోజు చరిత్ర పునరావృతమవుతుందని హెచ్చరించారు.

రాజీనామా చేయకపోయినా ముగిసినట్లే!

సీఎం పదవికి రాజీనామా చేయనని మమత అంటున్నా.. అసెంబ్లీ రద్దుతో ఆమె పదవి ఆటోమేటిక్‌గా పోతుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. ఈ నెల 7తో బెంగాల్ అసెంబ్లీ గడువు ముగియనున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. "మమతకు రాజీనామా చేయడం తప్ప మరో మార్గం లేదు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశాక.. రాష్ట్రానికి ఇద్దరు ముఖ్యమంత్రులు ఉండరు కదా!" అని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి అన్నారు. శాసనసభ ఉన్నంతవరకే ప్రభుత్వం ఉంటుందని, అది రద్దయ్యాక ప్రభుత్వమూ రద్దయినట్టేనని తెలిపారు. కాగా, కొత్త ముఖ్యమంత్రి ప్రమాణం చేశాక.. గవర్నరే మమతను డిస్మిస్ చేయవచ్చని న్యాయకోవిదుడు రాకేశ్ ద్వివేది అన్నారు. రాజీనామా చేయకపోతే గవర్నర్ తప్పక డిస్మిస్ చేయాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుష్యంత్ దవే పేర్కొన్నారు. సీనియర్ అడ్వకేట్ అజిత్ సిన్హా మాత్రం కొత్త ప్రభుత్వం ఏర్పాటై.. అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకునేదాకా మమత ఉండే అవకాశం ఉంటుందన్నారు. కొత్త సీఎం బలం నిరూపించుకున్న వెంటనే ఆమె వైదొలగినట్లే అవుతుందన్నారు. కాగా, మమత దిగిపోకపోతే డిస్మిస్ చేయాలని అసోం సీఎం హిమంత అన్నారు. బెంగాల్ ఆమెను ఇప్పటికే చాలాకాలం భరించిందని వ్యాఖ్యానించారు.

మమత ఓటమిపై సంబరాలు వద్దు: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, మే 5: ఇండియా కూటమిలో భాగమైన టీఎంసీ ఓటమిని చూసి బెంగాల్‌లో కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకోవడంపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అసహనం వ్యక్తం చేశారు. "టీఎంసీ ఓడిపోయిందని సంబరపడుతున్న వారు ఒక్క విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి. బెంగాల్, అస్సాంలలో ప్రజాతీర్పును అపహరించడం ద్వారా దేశ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే దిశగా బీజేపీ మరో ముందడుగు వేసింది. ఇది కేవలం ఒక పార్టీకి సంబంధించిన గెలుపోటముల అంశం కాదు. ఇది దేశ అస్తిత్వానికి సంబంధించిన సమస్య" అని పేర్కొన్నారు. చిల్లర రాజకీయాలను పక్కన పెట్టి, దేశం కోసం బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బెంగాల్‌లో 100కు పైగా స్థానాలను బీజేపీ దొంగిలించిందన్న మమత ఆరోపణలతో ఏకీభవిస్తున్నామని అన్నారు.

బెంగాల్ కొత్త బాస్ ఎవరు?

» సువేందు, దిలీప్ పేర్లపై జోరుగా చర్చ

» 9న కొలువుదీరనున్న ప్రభుత్వం


సువేందు అధికారి, దిలీప్ ఘోష్

న్యూఢిల్లీ, మే 5 (ఆంధ్రజ్యోతి): బెంగాల్‌లో బీజేపీ కొత్త సీఎం ఎవరనే దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. సీఎం రేసులో ఐదారుగురు కీలక నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. సీఎం మమతా బెనర్జీని గత, ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించిన సువేందు అధికారి పేరు ఈ జాబితాలో ప్రస్తుతం ప్రముఖంగా వినిపిస్తోంది. మమతా బెనర్జీని భవానీపూర్‌లో 15వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించిన సువేందు క్షేత్రస్థాయిలో బలమైన పట్టున్న నేత కావడంతో ఆయనకే సీఎం పగ్గాలు అప్పజెప్పే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. మరోవైపు బీజేపీని గ్రామగ్రామానికి తీసుకెళ్లిన నేతగా దిలీప్ ఘోష్ పేరు తెచ్చుకున్నారు. ఖరగ్‌పూర్ సదర్ నుంచి భారీ మెజారిటీతో గెలిచిన ఈయన పేరును కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశమని అభిప్రాయపడుతున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికల వ్యూహాలను సమర్థంగా అమలు చేసిన సమిక్ భట్టాచార్య కూడా సీఎం రేసులో ఉన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షాకు సన్నిహితుడు, మేధావి వర్గానికి చెందిన స్వపన్‌దాస్ గుప్తా పేరు కూడా పరిశీలనలో ఉంది. మహిళా నేతకు సీఎం పీఠం అప్పగించి సరికొత్త సంకేతాలు పంపాలని బీజేపీ భావిస్తున్నట్లు కూడా చెప్తున్నారు. ఈ క్రమంలో సౌత్ అసన్‌సోల్ నుంచి గెలిచిన ఫ్యాషన్ డిజైనర్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అగ్నిమిత్ర పౌల్, రూపా గంగూలీ పేర్లు తెరపైకి వచ్చాయి. అవసరమనుకుంటే మహిళా నేత కోసం ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా సృష్టించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని మే 9న బెంగాల్‌లో నూతన ప్రభుత్వం కొలువు తీరనుంది. బెంగాల్‌లో పార్టీ శాసనసభా పక్ష నేతను నిర్ణయించడానికి పార్టీ కేంద్ర పరిశీలకుడిగా అమిత్ షా, సహపరిశీలకుడిగా ఒడిశా సీఎం మోహన్ మాఝీ నియమితులయ్యారు.

బీజేపీని అడ్డుకోవడం సెక్యులర్ పార్టీల వల్ల కాదు

» పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపై అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీని నిలువరించడం సెక్యులర్ పార్టీలకు సాధ్యం అయ్యే పని కాదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ(ఆప్), మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీలే దీనికి ఉదాహరణ అని గుర్తు చేశారు. మంగళవారం పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన ఆయన.. బెంగాల్ ప్రజల్లో టీఎంసీ పట్ల వ్యతిరేకత పెరిగిందని అన్నారు. 15 ఏళ్ల అధికారంలో ఉన్నప్పటికీ.. మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో ముస్లింల వెనకబాటుతనాన్ని తొలగించే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు ప్రభుత్వంలో అవినీతి, ముస్లింలలో వ్యతిరేకత కారణంగా ఎన్నికల్లో టీఎంసీ ఓడిపోయిందని ఆయన విశ్లేషించారు. బెంగాల్‌లో తాము పోటీచేసిన అన్నిచోట్ల ప్రజలు ఆదరించారని, బలమైన ఓటు బ్యాంకు ఉందని ధీమా వ్యక్తం చేశారు.

నిలువునా చీలిన మైనారిటీ ఓట్లు

» టీఎంసీ ఓటుబ్యాంకును దెబ్బతీసిన కాంగ్రెస్, సీపీఎం, కబీర్

కోల్‌కతా, మే 5: బీజేపీ భయంతో బెంగాల్లోని ముస్లిం ప్రాబల్య నియోజకవర్గాల్లో వారి ఓట్లన్నీ తనకే పడతాయనుకున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అంచనాలు తలకిందులయ్యాయి. మైనారిటీ ఓట్లు చీలిపోవడంతో బీజేపీ అనూహ్యంగా భారీగా లబ్ధి పొందింది. టీఎంసీ ముస్లిం ఓటుబ్యాంకుకు కాంగ్రెస్, సీపీఎం, హుమయూన్ కబీర్ నేతృత్వంలోని ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ(ఏజేయూపీ) గండికొట్టాయి. చివరకు 50 శాతానికిపైగా ముస్లిం జనాభా ఉన్న జిల్లాలు ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర దీనాజ్‌పూర్ జిల్లాల్లో సైతం టీఎంసీకి సంఘటితంగా ఉన్నాయనుకున్న మైనారిటీల ఓట్లు చీలిపోయాయి. ఈ మూడు జిల్లాల్లో మొత్తం 43 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత ఎన్నికల్లో టీఎంసీ ఏకంగా 35 చోట్ల గెలిచింది. కానీ ఈసారి 22కే పరిమితమైంది. బీజేపీ స్థానాలు 8 నుంచి 17కి పెరిగాయి. మిగతా నాల్గింటిలో కాంగ్రెస్, టీఎంసీ, ఏజేయూపీ గెలిచాయి. ఈ నియోజకవర్గాల్లో మైనారిటీ ఓట్లు మూడు పార్టీలకూ వెళ్లాయని.. ఈ చీలికతో బీజేపీ లబ్ధి పొందినట్లు ఓట్ల డేటా స్పష్టం చేస్తోందని విశ్లేషకులు అంటున్నారు. రాణినగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జుల్ఫికర్ అలీ 2,701 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. అలీకి 79,423 ఓట్లు, సమీప టీఎంసీ అభ్యర్థికి 76,722 ఓట్లు వచ్చాయి. ఇక్కడ సీపీఎం అభ్యర్థి 48,587 ఓట్లు సాధించారు. అంటే ముస్లిం ఓట్లు ఈ ముగ్గురి నడుమా చీలిపోయాయి. చాలా స్థానాల్లో కాంగ్రెస్, లెఫ్ట్ అభ్యర్థులు సాధించిన ఓట్లు.. టీఎంసీ అభ్యర్థుల ఓటమి మార్జిన్ల కంటే ఎక్కువగా ఉండడం గమనార్హం.

మమత సహా 22 మంది మంత్రులు అవుట్

కోల్‌కతా, మే 5: మమతా బెనర్జీ క్యాబినెట్‌లో 35 మంది మంత్రులు ఉండగా.. ఆమెతో పాటు 22 మంది మంత్రులు తాజా ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఆమె ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతకు ఇదే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మమత (భవానీపూర్), అరూప్ బిశ్వాస్ (టోలీగంజ్), బ్రాత్య బసు (డమ్‌డమ్), చంద్రిమ భట్టాచార్య (డమ్‌డమ్ ఉత్తర్), శశి పాంజా (శ్యామ్‌పుకుర్), సుజిత్ బోస్ (బిధాన్‌నగర్), ఇంద్రనీల్ సేన్ (చందన్‌నగర్), బేచరమ్ మన్నా (సింగూర్), స్వపన్ దేబ్‌నాథ్ (పూర్బస్థలి దక్షిణ్), బులాచిక్ బరాయక్ (మాల్), ప్రదీప్ కె.మజుందార్ (దుర్గాపూర్ పూర్బ), బీర్బహ హంస్దా (బీన్‌పూర్), మానసరంజన్ భునియా (సాబంగ్), మలయ్ ఘాతక్ (అసన్‌సోల్ ఉత్తర్), సిదికుల్లా చౌధురి (మోంటేశ్వర్), ఉదయన్ గుహ (దిన్హాట), బంకించంద్ర హజ్రా (సాగర్), సంధ్యారాణి టుడు (మన్‌బజార్), ఉజ్వల్ బిశ్వాస్ (కృష్ణనగర్), స్నేహశీశ్ చక్రవర్తి (జాంగిపారా), శ్రీకాంత్ మహతో (సల్బోని), సత్యజిత్ బర్మన్ (హెమ్టాబాద్).. బీజేపీ అభ్యర్థుల చేతుల్లో పరాజయంపాలయ్యారు. ఈ మంత్రుల్లో అత్యధికులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే. ఇక, రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాలకు గాను 9 జిల్లాల్లో టీఎంసీ ఖాతాయే తెరవలేదు. ఈ 9 జిల్లాలు.. పూర్బ మేదినీపూర్, పురూలియా, బంకురా, ఝార్గ్రామ్, డార్జిలింగ్, కలింపాంగ్, జల్పాయ్‌గురి, ఆలీపుర్‌ద్వార్, పశ్చిమ బర్ధమాన్‌లోని మొత్తం 68 స్థానాలనూ బీజేపీయే గెలుచుకోవడం మరో విశేషం.

సొంతూరికి చందు మృతదేహం

▸ ఉద్యోగం రాదేమోనని గతనెల 28న అమెరికాలో ఆత్మహత్య



శిరివెళ్ల, మే 5(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఆత్మహత్య చేసుకున్న కర్నూలు యువకుడు ఇరగనబోయిన చందు(26) మృతదేహం సొంతూరుకు చేరుకుంది. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలంలోని స్వగ్రామమైన వీరారెడ్డిపల్లెలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇరగనబోయిన కేశవ కుమారుడు చందు అమెరికా, షికాగోలోని డీపాల్ వర్సిటీలో ఎంఎస్ పూర్తి చేశాడు. గత కొన్ని నెలలుగా అమెరికాలో నెలకొన్న పరిస్థితుల వల్ల తనకు ఉద్యోగం రాదన్న అభద్రత, కుటుంబానికి భారమవుతానేమోనన్న ఆందోళనతో గత నెల 28న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది తెలిసిన వెంటనే మంత్రి లోకేశ్ స్పందించారు. కుటుంబం సభ్యులను ఓదార్చి మృతదేహాన్ని వీలైనంత త్వరగా సొంతూరుకు తీసుకొని రావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, తానా 'టీం స్క్వేర్' ప్రతినిధులతో మాట్లాడి మృతదేహం స్వగ్రామానికి రావడానికి కృషి చేశారు.

దేవదాయ శాఖ ఏసీ శాంతికి రిమాండ్ పొడిగింపు

విజయవాడ, మే 5(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కాళింగిరి శాంతికి ఏసీబీ కోర్టు 19 వరకు రిమాండ్‌ను పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న ఆమెను రిమాండ్ గడువు ముగియడంతో మంగళవారం కోర్టులో హాజరుపరిచారు.

భార్య లావుగా ఉందని చంపేసిన భర్త

▸ యూట్యూబ్ చూసి.. పాలకోవాలో విషం కలిపి.. కడపలో ఘటన



కిరణ్

ప్రొద్దుటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): భార్యను అడ్డు తొలగించుకోవాలని ప్లాన్ వేసి.. పాలకోవాలో విషం కలిపి హత్య చేశాడు. సాధారణ మరణంగా చిత్రీకరించే యత్నం చేసి.. చివరికి పోలీసులకు దొరికిపోయాడు. మంగళవారం ప్రొద్దుటూరు డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ విభూ కృష్ణ ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రొద్దుటూరుకు చెందిన బద్రిపల్లె కిరణ్ (35)కు కడప జిల్లా ముద్దనూరుకు చెందిన పద్మజతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల కుమార్తె ఉంది. కిరణ్ ముద్దనూరులోనే భార్య, అత్తమామలతో ఉండేవాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసే కిరణ్, ఐదేళ్లుగా వర్క్‌ఫ్రం హోం చేస్తున్నాడు. గత నెల 24న ప్రొద్దుటూరులో తన తల్లిదండ్రులను చూడటానికి భార్యతో వచ్చాడు. రాత్రి నిద్రకు ఉపక్రమించాక భార్య తన పక్కన లేదని.. వెతకగా బాత్రూంలో పడిపోయిందని వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరీక్షించి అప్పటికే మరణించిందని చెప్పారని కట్టు కథ అల్లాడు. ఆమె తండ్రి అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టంలో పద్మజపై విషప్రయోగం జరిగిందని తేలింది. భార్యకు పాలకోవాలో విషం కలిపి ఇచ్చి హత్య చేసినట్లు కిరణ్ విచారణలో అంగీకరించాడు. తన భార్య ఊబకాయురాలని, ఎప్పుడూ ఫాస్టుఫుడ్ కావాలని వేధించేదని.. అందుకే తాను వేరే మహిళను ప్రేమించానని, ఆ విషయం తెలియడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవని తెలిపాడు. భార్యను చంపడానికి యూట్యూబ్‌లో వీడియోలు చూసి విషద్రావణం కొని.. పాలకోవాలో పెట్టి తినిపించి.. ఆమె మత్తులోకి వెళ్లాక దిండు ముఖం మీద అదిమి పెట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. కిరణ్‌ను హత్యా నేరం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌బీ చౌదరి మృతికి బాబు, పవన్ సంతాపం

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): సూపర్‌గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్‌బీ చౌదరి మృతిపై సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆయన మృతి తెలుగు చిత్రపరిశ్రమకు తీరని లోటన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కూడా దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.



'డయాబెటిక్ ఫుట్' సమస్యకు..

కొత్త 'సొల్యూషన్'

కాళ్లకు, వేళ్లకు ఇన్ఫెక్షన్లు సోకినా.. వాటిని తొలగించాల్సిన పనిలేకుండా చేసే ఔషధం

▸ ఎముకల ఇన్ఫెక్షన్లను తగ్గించడంతో పాటు వాటిని పునర్నిర్మించే సెరామెంట్ జి

▸ అభివృద్ధి చేసిన స్వీడన్ కంపెనీ 'బోన్ సపోర్ట్'

▸ భారత్‌లో అందుబాటులోకి తెచ్చిన అపోలో ఆస్పత్రి

హైదరాబాద్ సిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): డయాబెటిక్ ఫుట్ సమస్యతో బాధపడేవారికి, అత్యంత సంక్లిష్టమైన ఎముక ఇన్ఫెక్షన్ల నివారణకు ఉపయోగపడే 'సెరామెంట్ జి' అనే అత్యాధునిక ఎముక పునరుత్పత్తి విధానాన్ని అపోలో ఆస్పత్రి దేశంలో తొలిసారి అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఈ పరిజ్ఞానాన్ని ఆవిష్కరించారు. సెరామెంట్ జి అనేది.. ఒకరకమైన సిరామిక్ సొల్యూషన్. స్వీడన్‌కు చెందిన బోన్ సపోర్ట్ అనే సంస్థ దీన్ని అభివృద్ధి చేసింది. ఎముక దెబ్బ తిన్నప్పుడు, తొలగించినప్పుడు.. ఆ ప్రదేశంలో ఈ సొల్యూషన్‌ను ఇంజెక్ట్ చేస్తే కొత్త ఎముక పెరగడానికి ఇది దోహదం చేస్తుంది. అలాగే, ఇందులో ఉండే యాంటీబయాటిక్ ఔషధం (జెంటామైసిన్.. 'సెరామెంట్ జి'లో జి అంటే జెంటామైసినే. అదే సెరామెంట్ వి అని ఉంటే.. అందులో వ్యాంకోమైసిన్ అనే యాంటీబయాటిక్ ఉంటుంది).. నేరుగా ప్రభావిత ప్రాంతంలోనే పనిచేసి, ఇన్ఫెక్షన్‌ను వేగంగా తగ్గిస్తుంది. మధుమేహ బాధితుల్లో ఎక్కువగా కనిపించే సమస్య డయాబెటిక్ ఫుట్. అంటే దీర్ఘకాలంపాటు రక్తంలో చక్కెరస్థాయిలు అధికంగా ఉండడం వల్ల పాదాల్లోని రక్తనాళాలు, నరాలు దెబ్బతింటాయి. దీనివల్ల స్పర్శ తగ్గుతుంది. పాదాలకు దెబ్బతగిలినా, ముల్లు గుచ్చుకున్నా నొప్పి అంతగా తెలియదు. అదే సమయంలో.. రక్తనాళాలు, నరాలు దెబ్బతింటం వల్ల పాదాలకు రక్త ప్రసరణ తగ్గుతుంది. ఫలితంగా ఏదైనా గాయం అయితే అది ఒక పట్టాన మానదు. యాంటీబయాటిక్ మందులు వేసుకున్నా అది రక్తం ద్వారా.. కాలికిగాయం అయిన ప్రదేశం దాకా సరిగ్గా వెళ్లదు. ఫలితంగా, ఇన్ఫెక్షన్ పెరిగి, అది ఎముక వరకూ సోకి.. ఆ భాగం వరకూ తొలగించాల్సిన (యాంప్యుటేట్ చేయాల్సిన) పరిస్థితి వస్తుంది. అలాంటి సందర్భాల్లోనే సెరామెంట్ జి పనికొస్తుంది. అలా తొలగించిన ఎముక భాగంలో ఈ సొల్యూషన్‌ను ఇంజెక్ట్ చేస్తే.. యాంటీ బయాటిక్ మందు ఇన్ఫెక్షన్‌ను తగ్గిస్తుంది. సెరామిక్ పదార్థం మళ్లీ కొత్త ఎముక పెరిగేలా చేస్తుంది. గ్యాంగ్రీన్ వల్ల కుళ్లిన కణజాలాన్ని తొలగించి, ఆ భాగంలో దీన్ని ఇంజెక్ట్ చేస్తే.. ఇన్ఫెక్షన్ ఎముక దాకా వెళ్లకుండా నివారిస్తుంది. మధుమేహ బాధితులకు, ఎముక ఇన్ఫెక్షన్లతో బాధపడేవారికి ఎంతగానో ఉపయోగపడే ఈ సొల్యూషన్‌కు సంబంధించి మంగళవారం జూబ్లీహిల్స్ అపోలోలో వైద్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. లండన్‌లోని కింగ్స్ కాలేజ్ హాస్పిటల్‌కు చెందిన ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు ప్రొఫెసర్ వేణు కవర్తపు నేతృత్వంలో కెడవరిక్ వర్క్ షాప్, లైవ్ సర్జరీలు, అకడమిక్ సెషన్లు నిర్వహించారు. డయాబెటిస్‌కు సంబంధించిన ఎముక ఇన్ఫెక్షన్లు చాలా క్లిష్టమైనవని.. కాళ్లకు ఏవైనా గాయాలైనా, చాలా మంది బాధితులు ఆలస్యంగా తమ వద్దకు వస్తారని.. ఈ కొత్త చికిత్స ద్వారా వారికి త్వరగా చికిత్స అందించి, వారి కాళ్లను రక్షించవచ్చని అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి వివరించారు. బహుళ దశల శస్త్రచికిత్సలకు బదులుగా ఈ విధానంలో ఒకే దశలో చికిత్స అందించవచ్చని ప్రొఫెసర్ డాక్టర్ వేణు కవర్తపు తెలిపారు. ఇన్ఫెక్షన్‌ను నియంత్రించడంతోపాటు.. ఎముక పునర్నిర్మాణం చేయగలగడం ఈ విధానం ప్రత్యేకత అని, దీంతో మళ్లీ మళ్లీ శస్త్రచికిత్సలు చేయాల్సిన అవసరం తగ్గుతుందని వెల్లడించారు. విదేశాల్లో ఇప్పటికే విస్తృతంగా వినియోగంలో ఉన్న ఈ సాంకేతికత ఇప్పుడు భారతదేశంలో కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కొత్త చికిత్స ద్వారా యాంప్యుటేషన్ల సంఖ్య తగ్గుతుందని, బాధితులు ఆస్పత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం ఉండదని వివరించారు.

పుట్టిన తేదీ మార్చేసి టోకరా

▸ ఐదేళ్లుగా సర్వీస్‌లోనే కొనసాగుతున్న ఓ ఉద్యోగి

▸ గుంటూరు సాంఘిక సంక్షేమ శాఖలో మోసం.. అంతర్గత విచారణ

గుంటూరు. మే 5(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ కాకుండా ఓ ఉద్యోగి పుట్టిన తేదీనే మార్చేసిన ఘటన సాంఘిక సంక్షేమ శాఖలో బయటపడింది. గుంటూరు జిల్లాలో ఆ శాఖ కార్యాలయంలో 2000 జూలై 1న 4వ తరగతి ఉద్యోగిగా ఓ మహిళ చేరారు. అప్పట్లో ఆమె ఇచ్చిన ధ్రువీకరణ పత్రంలో 1961 జూలై 1న జన్మించినట్లు ఉంది. ఆమె ఎస్సార్(సర్వీస్ రిజిస్టర్)లో కూడా అదే తేదీ నమోదైంది. 2021 జూలైకి 60 ఏళ్ల పూర్తి అయినందున నిబంధనల ప్రకారం ఆమె పదవీ విరమణ చేయాలి. అయితే ఇద్దరు ఉద్యోగుల సహకారంతో సర్వీస్ రిజిస్టర్‌లో ఆమె పుట్టిన సంవత్సరాన్ని 1969గా మార్చారు. 2021లో రిటైర్ కాకుండా ఇప్పటికీ కొనసాగుతున్నారు. నెలకు రూ. 84 వేలు జీతం తీసుకుంటున్నారు. మధ్యలో ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు కూడా పొందారు. ప్రస్తుతం నరసరావుపేటలో అటెండర్ పోస్టులో ఉన్న ఆమెకు.. ఇటీవల ఇంక్రిమెంట్ ఇచ్చారు. తాజాగా అంతర్గత ఆడిటింగ్‌లో పుట్టిన తేదీ మార్చిన విషయం బయటపడింది. అధికారులు లోతుగా విచారణ చేయడంతో సంక్షేమ శాఖలో గతంలో పనిచేసిన తృతీయ శ్రేణి ఉద్యోగి సహకారంతో పరిపాలన విభాగంలో పనిచేసే మరో ముఖ్య ఉద్యోగి చేసిన నిర్వాకమని తేలింది. ఈ మోసంపై లోతుగా విచారణ చేసి బాధ్యులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఉద్యోగి 5 ఏళ్లుగా తీసుకున్న జీతభత్యాల రికవరీకి అధికారులు ప్రయత్నించగా, ఆమె ససేమిరా అన్నట్లు సమాచారం. జిల్లా ట్రెజరీ కార్యాలయం నుంచి సాంఘిక సంక్షేమ శాఖకు పుష్కరకాలం క్రితం డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ ఉద్యోగిదే ట్యాంపరింగ్‌లో ప్రధాన పాత్ర అని సమాచారం.

జపాన్‌లో ఉపాధి అవకాశాల కోసం ఒప్పందం

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జపాన్‌కు చెందిన ఫోర్ట్ వ్యాలీ కోఇన్సర్జ్ కార్పొరేషన్(ఎఫ్‌వీసీసీ)తో మంగళవారం ఒప్పందం చేసుకుంది. అవగాహన పత్రంపై నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ డి.మనోహర్, ఎఫ్‌వీసీసీ ఈడీ ఆకి టకేదా సంతకాలు చేశారు.

వ్యవసాయ అధికారి పోస్టుల ఫలితాలు విడుదల

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో వ్యవసాయ అధికారి పోస్టుల ఫలితాలను ఏపీపీఎస్సీ మంగళవారం ప్రకటించింది. 10 పోస్టులకు పది మంది అభ్యర్థులను ఎంపిక చేసింది. వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే టార్గెట్..!

▸ 'శాప్' సర్టిఫికెట్ పేరిట మోసం

▸ రూ 50 వేల వరకు వసూలు

▸ మ్యాట్రిమోనీ సైట్లలో యువతులకు వల

▸ పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. వ్యాపారం పేరిట లక్షల్లో వసూళ్లు

▸ యువతి ఫిర్యాదుతో 'ఈ కాప్స్'కు చిక్కిన టెకీ



శ్రీనివాస్ కిరణ్‌బాబు

విజయవాడ, మే 5(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిని గుర్తించి వారికి 'శాప్' సర్టిఫికెట్ ఇప్పిస్తానని ఎర వేస్తాడు. మ్యాట్రిమోనీ సైట్లలో రిజిస్టర్ చేసుకుని.. అమ్మాయిలకు వల విసురుతాడు. ప్రేమ, పెళ్లి అని నమ్మిస్తాడు. ఆపై తన వ్యాపార అవసరాల కోసం డబ్బు కావాలని చెప్పి వారి నుంచి లక్షలు కాజేస్తాడు. ఇలా వివిధ రాష్ట్రాల్లో సుమారు 2-3 కోట్ల మేర మోసాలకు పాల్పడిన ఓ టెకీని 'ఈ కాప్స్' మంగళవారం అరెస్టు చేశారు. ఆయనపై వివిధ రాష్ట్రాల్లో 10 కేసులు ఉన్నాయని, మొత్తం 110 మందిని మోసం చేశాడని గుర్తించారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన పొన్నాటి శ్రీనివాస్ కిరణ్‌బాబు (38) ఎంసీఏ పూర్తి చేశాడు. హైదరాబాద్, ముంబైలో పలు ఐటీ కంపెనీల్లో పనిచేశాడు. తర్వాత బెట్టింగ్‌లకు బానిసై భారీగా అప్పులు చేశాడు. అప్పులు తీర్చడానికి మోసాలకు పూనుకున్నాడు. అవివాహితుడైన కిరణ్ బాబు వివిధ మ్యాట్రిమోనీ, షాదీ.కామ్ వెబ్‌సైట్లలో రిజిస్టర్ చేసుకుని.. అమ్మాయిలకు ఎర వేసేవాడు. డేటింగ్ యాప్‌ల్లోనూ కొంతమందిని ట్రాప్ చేసేవాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించేవాడు. తాను వ్యాపారం చేస్తానని డబ్బులు వసూలు చేసేవాడు. ఆయన మాయమాటలు నమ్మి ఓ యువతి రూ.20 లక్షలు, మరో మహిళ ఏకంగా రూ.44 లక్షలు ఇచ్చి మోసపోయారు.

వేధింపులతో చిక్కాడు..

విజయవాడకు చెందిన ఓ వైద్యుడి కుమార్తె సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మరో కంపెనీలో అవకాశం కోసం ఆమె నౌకరీ.కామ్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆమె ఫోన్ నంబరు సేకరించిన కిరణ్.. ఓ కంపెనీ శాప్ సర్టిఫికెట్ ఇప్పిస్తానని చెప్పాడు. ఆమెకు అనుమానం వచ్చి ఆ కంపెనీ గురించి గూగుల్‌లో సెర్చ్ చేయగా ఎక్కడా కనిపించలేదు. ఆమె నిలదీయడంతో వాట్సాప్‌లో అసభ్యకర సందేశాలు పంపాడు. ఆమె ఆ నంబరును బ్లాక్ చేసినా.. మరో కొత్త నంబరుతో వేధించాడు. ఆమె ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి కిరణ్‌బాబును అరెస్టు చేశారు.

నేరానికో సిమ్, ఫోన్..


కిరణ్‌బాబు శాప్ (సిస్టమ్స్, అప్లికేషన్స్ అండ్ ప్రొడక్ట్స్ ఇన్ డేటా ప్రాసెసింగ్) సర్టిఫికెట్ల పేరుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారికి వల వేసేవాడు. ఇదొక సాఫ్ట్‌వేర్ టూల్ అని.. దీన్ని పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో, వ్యాపారాల్లో వినియోగిస్తారని చెప్పేవాడు. నౌకరీ.కామ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని టార్గెట్ చేసి.. వారికి శాప్ సర్టిఫికెట్ ఇప్పిస్తానని చెప్పేవాడు. వారి నుంచి రూ.30-50 వేల వరకు లాగేవాడు. డబ్బులు ఖాతాకు రాగానే తన సిమ్ కార్డులు పడేసేవాడు. ఫోన్‌ను అమ్మేసేవాడు. అతడు నేరాలకు ఉపయోగించే సిమ్ కార్డులను కాకినాడ జగన్నాథపురంలో ఓ యువకుడు యాక్టివేట్ చేస్తున్నట్టు గుర్తించారు. సిమ్ కార్డులు కొనడానికి వచ్చిన వారి వివరాలతో ఆ సిమ్‌లు యాక్టివేట్ చేస్తున్నట్టు కనుగొన్నారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

దిగ్గజ నిర్మాత ఆర్‌బీ చౌదరి ఇకలేరు

● రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి

● విజయ్‌కు లైఫ్ ఇచ్చిన నిర్మాత



దిగ్గజ నిర్మాత, సూపర్‌గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్.బి. చౌదరి(74) ఇకలేరు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన దుర్మరణం పాలయ్యారు. ఆయన పూర్తి పేరు రతన్‌లాల్ భగవత్‌రామ్ చౌదరి. అనేక మంది కొత్త దర్శకులకు ఆయన అవకాశాలు కల్పించి, ఓ గుర్తింపునిచ్చారు. తమిళంతోపాటు, తెలుగు, హిందీ, మలయాళం భాషల్లో ఎన్నో హిట్ చిత్రాలు నిర్మించారు. ప్రస్తుతం విశాల్ హీరోగా 'మకుటం' పేరుతో తన 99వ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విశాల్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఇటీవలే కాకినాడలో ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుని తదుపరి షెడ్యూల్ కోసం చెన్నైకు వచ్చింది. ఇంతలోనే ఆయన లేరనే వార్త కోలీవుడ్‌ను తీవ్ర దిగ్ర్భాంతికి గురిచేసింది. 1980వ దశకంలో తన సినీ నిర్మాణ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆర్‌బీ చౌదరి.. చిత్ర పరిశ్రమలో 40 యేళ్ళగా కొనసాగుతున్నారు. విక్రమన్, కేఎస్ రవికుమార్, ఎస్.ఎ ఖిల్, రాజకుమరన్, శశి, బాల శేఖరన్, బృందా సారథి, రవి మారియా వంటి 34 మంది దర్శకులను ఆయన చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు.

విజయ్‌తో వందో చిత్రానికి ప్లాన్

ఇటీవలే ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీవీకె పార్టీ అధినేత విజయ్ కెరీర్ తొలినాళ్ళలో 'పూవే ఉనక్కాగ (1996), 'లవ్‌టుడే' (1997), 'తుళ్ళాద మనముమ్ తుళ్ళుమ్' (1999), 'షాజహాన్' (2001), 'తిరుప్పాచ్చి' (2005), 'జిల్లా' (2014) వంటి చిత్రాలను తీశారు. తన నూరవ చిత్రాన్ని కూడా విజయ్‌తోనే తీయాలని ప్లాన్ చేశారు.

అగర్‌బత్తీ వ్యాపారం నుంచి...

1950లో మద్రాస్‌లో జన్మించిన చౌదరి స్వస్థలం రాజస్థాన్. సినిమాల్లోకి రాక ముందు ఆయన అగర్‌బత్తీలతో పాటు స్టీల్, జ్యూవెలరీ వ్యాపారాలను చేశారు. చిత్ర నిర్మాణంపై పూర్తిస్థాయిలో దృష్టిసారించకముందు అనేక వ్యాపారాలు చేసి ఆటుపోట్లను ఎదుర్కొన్న ఆర్‌బీ చౌదరి.. సినిమాపై ఉన్న వ్యామోహం, ఆసక్తి కారణంగా నిర్మాతగా, పంపిణీదారుడుగా, సినీ ఫైనాన్షియర్‌గా రాణించారు. తొలిసారిగా ఆయన నిర్మించిన చిత్రం 'ఆది పాపమ్' (మలయాళం) 1988లో విడుదలైంది. ఆ తర్వాత 1990లో తమిళంలో తీసిన 'పుదువసంతం' మూవీ ఘన విజయం సాధించింది. అప్పటి నుంచి ఆయన వెనుదిరిగి చూడలేదు. తెలుగులో చౌదరి నిర్మించిన తొలి సినిమా 'కెప్టెన్'. ఆయన కుమారులు జీవా, జితన్ రమేశ్ ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు.

తెలుగులోనూ క్లాసిక్ హిట్స్...

తెలుగులో కూడా ఆయన పలు సూపర్ హిట్ చిత్రాలను నిర్మించారు. వెంకటేశ్, నాగార్జున, పవన్‌కల్యాణ్, రాజశేఖర్ తదితర హీరోలతో తెలుగు ప్రేక్షకులకు ఆర్‌బీ చౌదరి అందించిన క్లాసిక్ హిట్స్‌లో 'సుస్వాగతం, 'రాజా', 'శీను', 'సంక్రాంతి', 'సూర్యవంశం', 'నువ్వొస్తావని', 'నవ వసంతం' 'సింహరాశి', 'స్నేహమంటే ఇదేరా', 'అన్నవరం', 'గోరింటాకు', 'భీమిలి' వంటి చిత్రాలు ఉన్నాయి. ఇవన్నీ సంగీత పరంగా కూడా పేరొందాయి.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

దర్శకుడు అనే పదానికి అర్థం చెప్పిన వ్యక్తి దాసరి



- మోహన్‌బాబు

'దర్శకుడు అనే పదానికి అర్థం చెప్పిన ఏకైక వ్యక్తి దాసరి నారాయణ రావు. తండ్రి లాంటి ఆయన ఈ లోకంలో లేరనే లోటు నాకు జీవితాంతం ఉంటుంది. ఓ సాధారణ వ్యక్తిని తీసుకువచ్చి మోహన్‌బాబుగా మార్చారు. బాలీవుడ్ దర్శకుడు బాల్కి దాసరి అవార్డు ఇస్తున్నందుకు ఆనందంగా ఉంది. దర్శకుల దినోత్సవం సందర్భంగా తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్(టీఎఫ్‌డీఏ)కు రూ.15 లక్షలు విరాళం ఇస్తున్నాను' అని సీనియర్ నటుడు మోహన్‌బాబు అన్నారు. దాసరి నారాయణరావు జయంతిని 'దర్శకుల దినోత్సవం'గా టీఎఫ్‌డీఏ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు భాషలకు చెందిన దర్శకులను సత్కరించారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య, దర్శకులు ఆర్ నారాయణ మూర్తి, ఎస్వీ కృష్ణారెడ్డి, వీరశంకర్, ఎన్ శంకర్, నిర్మాతలు తమ్మారెడ్డి భరద్వాజ, చదలవాడ శ్రీనివాసరావు, వై రవిశంకర్, నటీనటులు బాబూ మోహన్, జయసుధ, జయప్రదతో పాటూ వల్లభనేని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జననాయగన్... ఇక అడ్డంకులుండవు!



తమిళనాడు ఎన్నికల్లో రాజకీయ ప్రభంజనం సృష్టించిన దళపతి విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించబోతున్నారు. ఆయన నటించిన చివరి చిత్రం 'జననాయగన్' విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకపోచ్చు. సినిమా ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సింది. అనేక ఆటంకాలతో వాయిదా పడింది. సెన్సార్ సమస్యలు చుట్టుముట్టాయి. బోర్డు సూచనలతో కొన్ని సన్నివేశాలు తొలగించినప్పటికీ సర్టిఫికెట్ జారీలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో మేకర్స్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. ఓటీటీ బిజినెస్ చేజారిపోయింది. ఒకవైపు ఈ ఆటంకాలను అధిగమించే ప్రయత్నంలో చిత్రబృందం ఉంటే.. మరోవైపు ఎన్నికలు సమీపించాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సినిమా రిలీజ్‌కు బ్రేక్ పడింది. దాంతో విజయ్ బృందం మొత్తం ఎన్నికల ప్రచారంలో బిజీ అయ్యింది. ఇప్పుడు ఎన్నికలు పూర్తయ్యాయి. పరిస్థితులు కూడా అనుకూలంగా మారిపోయాయి. సినిమా విడుదలకు మార్గం సులువైంది. ఏది జరిగినా మన మంచికే అన్నట్లు.. తమిళనాడులో ఏమోగానీ.. తెలుగు రాష్ట్రాల్లో గనుక సంక్రాంతికి ఈ సినిమా రిలీజ్ అయి ఉంటే ప్రేక్షకులు పెద్దగా పట్టించుకునేవారు కాదేమో. ఆ సమయంలో 'ది రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' వంటి భారీ చిత్రాలు విడుదలయ్యాయి. ఈ చిత్రాలతో 'జననాయగన్' పోటీ పడాల్సి వచ్చేది. ఒకవేళ పోటీకి సిద్ధపడ్డా.. సరిపడా థియేటర్లు దొరికేవి కావు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఈ వేసవికి భారీ చిత్రాలేవీ రావడం లేదు. కావలసినన్ని థియేటర్లు కూడా అందుబాటులో ఉంటాయి. ఇప్పుడు గనుక విడుదలయితే అటు తమిళనాడులో, ఇటు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు కిక్కిరిసిపోవడం ఖాయమని, బాక్సాఫీసు వద్ద కలెక్షన్ల సునామీ తప్పదని విజయ్ అభిమానులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఈ సినిమాతో భారీ నష్టాలు తప్పవేమోనని భావించిన నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఇప్పుడు హాయిగా ఊపిరి పీల్చుకుంటోంది.

టైటిల్ కార్డును మార్చాలంటున్న అభిమానులు

'జననాయగన్'కు మార్గం సుగమం కావడంతో దర్శకనిర్మాతలు విజయ్‌కు అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. సినిమా టైటిల్ కార్డును మార్చాలంటూ చిత్రబృందానికి విజయ్ అభిమానులు రిక్వెస్టు చేశారు. సినిమా ప్రారంభంలో దళపతి విజయ్ అని కాకుండా 'సీఎం దళపతి విజయ్' అని వేయాలని వారు కోరారు.

గోదావరి యాస కోసం నాలుగు నెలలు రిహార్సల్స్ చేశా



సుమంత్ ప్రభాస్

'నేను పుట్టి పెరిగింది తెలంగాణలో... గోదావరి యాస కోసం దాదాపు నాలుగు నెలలు రిహార్సల్స్ చేశాను. అక్కడ పుట్టి పెరిగిన వారు విన్నప్పుడు కచ్చితంగా మనలాగే మాట్లాడుతున్నాడనే ఫీలింగ్ రావాలని ప్రయత్నించాను' అని చెప్పారు హీరో సుమంత్ ప్రభాస్. ఆయన కథానాయకుడుగా సుభాష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గోదారి గట్టుపైన'. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. సినిమా ఈనెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మీడియాకు చిత్ర విశేషాలు వివరించారు. 'మేము ఫేమస్' తర్వాత చాలా కథలు విన్నాను. కథను, ఎమోషన్స్‌ను కొత్తగా చెప్పే ఫిల్మ్ మేకర్ కోసం ప్రయత్నిస్తున్నప్పుడు సుభాష్ చంద్ర కలిశారు. ఆయన చెప్పిన ఈ కథ నాకు చాలా నచ్చింది. గోదారి నేపథ్య కథ అంటే నాకు ఛాలెంజ్‌గా అనిపించింది. ఇందులో ఆటో డ్రైవర్ క్యారెక్టర్ నాది' అని చెప్పారు.

ఆ సినిమాను నేను చేయాల్సింది

'రాజు వెడ్స్ రాంబాయి' కథను ఆ చిత్ర దర్శకుడు సాయిలు అన్న చెప్పారు. నాకు చాలా నచ్చింది. కానీ అప్పటికే 'మేము ఫేమస్' సినిమాను తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో చేశాను. మళ్లీ అదే చేస్తే రిపీట్ ఫీలింగ్ వస్తుందని సాయిలు అన్నకి చెప్పాను. ఆ కథ అఖిల్ చేశాడు. అతనికి హెల్ప్ అయ్యింది. ఇండస్ట్రీకి కొత్త ట్యాలెంట్ వచ్చింది. సూపర్ హిట్ అయ్యింది. ఆ సినిమా మిస్ అయ్యానేమో అని నేను అనుకోవడం లేదు.

వీరభద్రుడు వచ్చేస్తున్నాడు



తమిళ కథానాయకుడు సూర్య పూర్తి స్థాయి మాస్ పాత్రలో నటించిన చిత్రం 'వీరభద్రుడు'. ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రకాశ్‌బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. త్రిష కథానాయిక. ఈ నెల 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్ ద్వారా మేకర్స్ ప్రకటించారు. రక్తం నిండిన తెల్లచొక్కాతో బైక్‌పై సీరియస్‌గా వస్తున్న సూర్య లుక్ ఆకట్టుకుంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్ కలైవానన్, సినిమాటోగ్రఫీ: జి.కె విష్ణు, సంగీతం: సాయి అభ్యంకర్.



పెద్ద హిట్ అవ్వాలి

అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఎం4ఎం'(మోటివ్ ఫర్ మర్డర్). సినిమాను ఈనెల 8న పీవీఆర్ ఐనాక్స్ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ సోమవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షులు వి.ఎన్.ఆదిత్య మాట్లాడుతూ మోహన్ వడ్లపట్ల తన బృందంతో కలసి గొప్ప టాలెంట్‌ను తెరపై ప్రదర్శించారని ప్రశంసించారు. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని దర్శకుడు వి.సముద్ర ఆకాంక్షించారు. దర్శక నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ'ఎం4ఎం యూనివర్సల్ సబ్జెక్ట్. క్లైమాక్స్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది' అని చెప్పారు.

తొంబైల నాటి మారణహోమం



బంధు నరేశ్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న 'మారణహోమం' చిత్రం టీజర్, ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. టీజర్ బాగుందని, బలమైన కంటెంట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రం విజయం సాధించాలని ఆయన కోరారు. బంధు నరేశ్ మాట్లాడుతూ '1990ల నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో బలమైన ఎమోషన్స్, హెవీ యాక్షన్ సీన్లు ఉంటాయి. షూటింగ్ పూర్తి అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి' అని తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాత బంధు నాగమణి.

ఏపీ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు

- సునీత, గిరిధర్, పురుషోత్తం కుమార్‌లను కేంద్రానికి సిఫారసు చేసిన సుప్రీం కోర్టు కొలీజియం

అమరావతి, న్యూఢిల్లీ, మే 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులు రానున్నారు. న్యాయమూర్తుల కోటా నుంచి ముగ్గురు న్యాయాధికారులు... గంధం సునీత, ఆలపాటి గిరిధర్, చింతలపూడి పురుషోత్తం కుమార్‌లను పదోన్నతిపై న్యాయమూర్తులుగా నియమించేందుకు సుప్రీం కోర్టు కొలీజియం సిఫారసు చేసింది. 37 న్యాయమూర్తుల పోస్టులు మంజూరైన ఏపీ హైకోర్టులో ప్రస్తుతం 32 మంది సేవలందిస్తున్నారు. ఈ ముగ్గురు న్యాయమూర్తులు ఏపీ హైకోర్టుకు వస్తే ఆ సంఖ్య 35కు చేరుతుంది. హైకోర్టులో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో భాగంగా, ఆయా అధికారుల పని తీరు, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని కొలీజియం ఈ సిఫార్సు చేసింది. తాజా నిర్ణయంతో కొలీజియం ఆమోదించిన ఈ పేర్లను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు పంపనున్నారు. అక్కడ పరిశీలన అనంతరం రాష్ట్రపతి కార్యాలయానికి వెళ్తాయి. రాష్ట్రపతి ఆమోదముద్ర పడి, అధికారికంగా నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వీరు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు.

ఆలపాటి గిరిధర్



ఆలపాటి గిరిధర్ స్వగ్రామం ప్రకాశం జిల్లా, కొండేపి మండలం, గోగినేనివారిపాలెం. తండ్రి బాపయ్య చౌదరి స్వాతంత్ర్య సమర యోధుడు, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు. గిరిధర్ ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల నుండి న్యాయ శాస్త్రం పూర్తి చేశారు. న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని ఒంగోలు జిల్లా కోర్టులో తొమ్మిదేళ్లు ప్రాక్టీస్ చేశారు. ఉమ్మడి హైకోర్టులో మూడేళ్లు ప్రాక్టీస్ చేశారు. సివిల్, క్రిమినల్, వినియోగదారులు, సర్వీసు, రాజ్యాంగ సంబంధ కేసులలో మంచి అనుభవం గడించారు. మచిలీపట్నం మొదటి అదనపు జిల్లా జడ్జిగా, విజయవాడ ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయాధికారిగా పనిచేశారు. విజయనగరం, కర్నూలు జిల్లాల ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించారు. హైకోర్టులో రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ప్రస్తుతం విశాఖపట్నం వ్యాట్ అప్పిలేట్ ట్రైబ్యునల్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

గంధం సునీత



గంధం వీరయ్య, శివ నాగేంద్రమ్మ దంపతులకు కృష్ణా జిల్లా, పెదకళ్లేపల్లి గ్రామంలో 1977 జూన్ 14న జన్మించారు. వీరిది మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. 10వ తరగతి వరకు పెదకళ్లేపల్లిలోని ఎస్‌డీఎన్‌ఎస్‌డీఎస్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. మచిలీపట్నం లేడీ యాంప్తిల్ కళాశాలలో ఇంటర్మీడియట్, అవనిగడ్డ వివేకానంద డిగ్రీ కళాశాల, విజయవాడ గాంధీజీ మహిళ కళాశాలల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ముత్యాల నాగ మల్లేశ్వరరావును వివాహం చేసుకున్నారు. అనంతరం మాంటిస్సోరి కళాశాల నుండి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. టాపర్‌గా నిలిచి బంగారు పతకం సాధించారు. 1999లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. ఆ తరువాత నాగార్జున యునివర్సిటీలో లేబర్ లాలో ఎల్ఎల్ఎమ్ పూర్తి చేశారు. 2000-2008 వరకు బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2023 నుండి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా రాజమహేంద్రవరంలో సేవలు అందిస్తున్నారు.

చింతలపూడి పురుషోత్తం కుమార్



విశ్రాంత జిల్లా జడ్జి సి.రాంబాబు, రమారత్నం దంపతులకు విశాఖపట్నంలో జన్మించారు. వీరి కుటుంబం మూడు తరాలుగా న్యాయవాదులు, న్యాయమూర్తులుగా సేవలు అందిస్తోంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి మెరైన్ బయాలజీలో ఎంఎస్సీ పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎల్ఎల్‌బీలో పట్టా పొందారు. ఇంటీరియర్ డెకరేషన్, డిజైనింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్, మీడియా లాస్‌లో డిప్లమో చేశారు. 2002లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని సీనియర్ న్యాయవాది ఎస్.రవి కార్యాలయంలో చేరి ప్రాక్టీస్ ప్రారంభించారు. 2010లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. 2012లో రాజమహేంద్రవరం ఫ్యామిలీ కోర్టులో న్యాయాధికారిగా నాలుగున్నరేళ్లు పనిచేశారు. తిరుపతి అదనపు జిల్లా జడ్జిగా, 2019లో ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించారు. హైకోర్టు రిజిస్ట్రార్‌గా రెండేళ్లు వివిధ హోదాల్లో సేవలు అందించారు. 2025 జనవరి 25 నుండి ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

నోరు మెదపని అనంతబాబు!

- ఎన్నిసార్లు అడిగినా తనకేమీ తెలియదనే సమాధానం
- సాక్షుల బెదిరింపు కేసులో కస్టడీకి తీసుకున్న పోలీసులు
- రాత్రి 11 గంటల వరకూ కొనసాగిన విచారణ



కాకినాడ రూరల్ క్రైమ్ స్టేషన్‌కు అనంతబాబును తీసుకొస్తున్న పోలీసులు

కాకినాడ, రాజమహేంద్రవరం, మే 5(ఆంధ్రజ్యోతి): "మీరు ఎన్నిసార్లు అడిగినా.. ఎంత ఒత్తిడి చేసినా ఒక్కటే సమాధానం. నాకేమీ తెలియదు. నాకు అసలు సంబంధమే లేదు. ఈ కేసులో కావాలని నన్ను ఇరికించారు. అంతకుమించి నేనేమీ చెప్పలేను." ఇదీ వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు పోలీసు విచారణలో ఇచ్చిన సమాధానం. దళిత యువకుడు, కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను ప్రలోభపెట్టి, బెదిరించిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అనంతబాబును పోలీసులు మంగళవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయన్ను ఒకరోజు పాటు విచారించనున్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు అనంతబాబును కాకినాడ సర్పవరం పోలీసుస్టేషన్ వద్ద ఉన్న రూరల్ క్రైమ్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడ పోలీసు భద్రత మధ్య ఆయన్ను విచారించారు. కేసు దర్యాప్తు అధికారి, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావుతో పాటు ఇద్దరు సీఐలు, ఇతర సిబ్బంది ఈ విచారణలో పాల్గొన్నారు. రెండున్నర గంటలకు ఒకసారి చొప్పున విడతల వారీగా ఈ విచారణ సాగింది. గతంలో వేసిన 30 ప్రశ్నలకు అదనంగా మరో 20 ప్రశ్నలు జోడించి, మొత్తంగా 50 ప్రశ్నలతో జాబితా సిద్ధం చేశారు. "సాక్షుల బెదిరింపు, ప్రలోభపెట్టడం అనే ఆలోచన ఎలా వచ్చింది?, ఈ సలహా ఎవరిచ్చారు? ఆ సమయంలో ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారు?, వైసీపీ నేత కడియాల చిన్నబాబు(ఏ2), కడియాల సతీశ్ (ఏ3), మాగంటి రాంబాబు (ఏ4), చక్కపల్లి శ్రీనివాసరావు (ఏ5)లతో మీకున్న సంబంధం ఏమిటి?, ఇంకా ఎంతమందిని బెదిరించాలని అనుకున్నారు?, ఈ కుట్ర వెనుక ఎవరెవరి పాత్ర ఎంత?, గతనెలలో మిమ్మల్ని పోలీసులు అరెస్టు చేసేందుకు శ్రీరామ్‌నగర్ శంకర్ టవర్స్‌లోని మీ అపార్ట్‌మెంట్‌కు వచ్చినప్పుడు ఎలా తప్పించుకోగలిగారు?, మీకు ముందస్తు సమాచారం ఇచ్చింది ఎవరు? ఆ రోజు అక్కడ దొరికిన రూ.12లక్షలు ఎవరివి? ఎవరి కోసం అంత డబ్బు అక్కడ ఉంచారు?, ఆ డబ్బు ఎక్కడిది?"... ఇలా అనేక ప్రశ్నలను పోలీసులు సంధించారు. రాత్రి 11 గంటల వరకూ విచారణ కొనసాగింది. ఈ ఒక్కరోజు విచారణకు అనంతబాబు సహకరించపోతే కస్టడీ పొడిగించాలని కోర్టును కోరతామని దర్యాప్తు అధికారి తెలిపారు. డ్రైవర్ హత్యకేసుకు సంబంధించి అనంతబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో ఇప్పటికే వాదోపవాదనలు పూర్తయ్యాయి. ఈ కేసులో కోర్టు బుధవారం తీర్పు చెప్పనుంది.

గోదారి-కావేరి అనుసంధానంపై ఎల్లుండి భేటీ

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి - కావేరి అనుసంధాన పథకంపై జాతీయ జలాల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో మరోసారి సమీక్ష జరుగనుంది. వాస్తవానికి ఈ నెల 8వ తేదీన (శుక్రవారం) ఈ సమావేశం నిర్వహించాలని భావించారు. తర్వాత 19వ తేదీకి వాయిదా వేశారు. కానీ 8వ తేదీనే సమీక్షిస్తామంటూ ఎన్‌డబ్ల్యూడీఏ మంగళవారం నాడు రాష్ట్రాలకు రం పంపింది. గోదావరి-కావేరి అనుసంధాన పథకాన్ని తమ భూభాగం నుంచే కొనసాగించాలని తెలంగాణ పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా కావేరి వరకు తీసుకెళ్లాలని ప్రతిపాదిస్తోంది. ఇచ్చంపల్లి నుంచి తరలించేందుకు ప్రతిబంధకాలు ఉన్నందున సమ్మక్క సారలమ్మ పథకం నుంచి గోదావరి జలాలను ఎత్తిపోయాలని సూచిస్తోంది. ఇచ్చంపల్లి వద్ద గోదావరి మిగులు జలాలు అందుబాటులో లేవని నిపుణులు ధ్రువీకరిస్తున్న నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ వాడుకోని 147 టీఎంసీల జలాలను ఈ అనుసంధాన పథకానికి వినియోగించుకోవాలని అంటోంది. ఎన్‌డబ్ల్యూడీఏ కూడా ఈ సూచనతో ఏకీభవిస్తోంది. అయితే తమ వాటా 147 టీఎంసీలను వాడుకుంటామని.. తాము కూడా సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని ఛత్తీస్‌గఢ్ చెబుతోంది. తమ వాటా జలాలపై ఎవరికి హక్కు లేదంటోంది. అయితే తెలంగాణ భూభాగం నుంచి గోదావరి-కావేరి అనుసంధాన పథకాన్ని అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఆమోదించడం లేదు. పోలవరం నుంచి తరలించాలని స్పష్టం చేస్తోంది. వాస్తవానికి ధవళేశ్వరం నుంచి కావేరికి అనుసంధానం చేయాలన్న ప్రతిపాదనలు గతంలో వచ్చినందున దానిని పరిగణనలోకి తీసుకోవాలని ఎన్‌డబ్ల్యూడీఏను కోరుతోంది.

ఎన్‌డబ్ల్యూడీఏ ఇన్వెస్టిగేషన్ డివిజన్ రాజమండ్రిలో!

8వ తేదీన జరిగే సమావేశంలో రాజమహేంద్రవరంలో ఎన్‌డబ్ల్యూడీఏ ఇన్వెస్టిగేషన్ డివిజన్ ప్రధాన కార్యాలయం ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ప్రధాన కార్యాలయాన్ని ఇప్పటికే ఇక్కడకు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

రేపటి నుంచి కలెక్టర్ల సదస్సు

- అజెండాలో ఈ-ఆఫీస్ నిర్వహణ, ఫైళ్ల పరిష్కారం, పీజీఆర్ఎస్

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల సదస్సుకు ప్రభుత్వం మరోసారి శ్రీకారం చుట్టింది. ఈ నెల 7-8 తేదీల్లో సచివాలయం కేంద్రంగా ఈ సదస్సు నిర్వహించనుంది. జిల్లాల అభివృద్ధి, పాలనా వ్యవహారాల్లో మెరుగైన నిర్వహణ తదితర అంశాలపై కీలక చర్చ జరగనుంది. పాలన, అభివృద్ధిలో ఉత్తమ పనితీరు చూపిన జిల్లాలకు రెవెన్యూ శాఖ ర్యాంకులు ప్రకటించనుంది. ఏయే కారణాలతో ఆయా జిల్లాలకు ఉత్తమ ర్యాంకులు వచ్చాయి?. ఆయా జిల్లాలు అనుసరించిన నూతన విధానాలు ఏమిటి అనే విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ జి. సాయిప్రసాద్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ప్రభుత్వం 'ఈ-ఆఫీస్' విధానానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కలెక్టర్లతో చర్చించనున్నారు. దీంతో పాటు ప్రజా ఫిర్యాదులు, ఫైళ్ల పరిష్కారం అంశాలపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. గత రెండు నెలల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, వాటిపై ప్రజల సంతృప్తి స్థాయి, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై వారి స్పందన వంటి కీలక అంశాలపైనా చర్చించనున్నారు.

స్వర్ణాంధ్రతో మొదలు

తొలి రోజు సదస్సులో కలెక్టర్లను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం తొలి అజెండాగా 'స్వర్ణాంధ్ర-2047'పై చర్చిస్తారు. దీనిలో పేదరిక నిర్మూలన, జనాభా నిర్వహణ, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, లాజిస్టిక్స్, తక్కువ ధర ఇంధనం, విద్యుత్ వ్యవస్థ, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్, ఉత్పాదకత వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నారు. రెండో అంశంగా జీఎస్‌డీపీని చేర్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలు, జిల్లాల వారీగా పురోగతి వంటి అంశాలపై చర్చించనున్నారు. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. అనంతరం, జిల్లాల విజయగాథలపై చర్చిస్తారు. గత కలెక్టర్ల సదస్సులో ఆయా జిల్లాలు ప్రజెంట్ చేసిన విజయగాథలపై తొలుత దృష్టి పెట్టి, తర్వాత కొత్తగా అనకాపల్లి, అన్నమయ్య, చిత్తూరు, కోనసీమ, నెల్లూరు, విశాఖ, విజయనగరం జిల్లాల విజయగాథలపై చర్చించనున్నారు. అలాగే, కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్) అమలుపై కలెక్టర్ల నుంచి అభిప్రాయాలు తీసుకుంటారు. ప్రజల సానుకూల స్పందనపై సమాచార శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ పథకాల అమలుపై ఏ జిల్లాల్లో ప్రజల స్పందన ఎలా ఉంది?. ఏ పథకంపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారో తెలిపేలా ఆయన వివరిస్తారు. తొలి రోజు సదస్సులో చివరి అంశంగా పెట్టుబడుల ప్రతిపాదనలు, వాటి గ్రౌండింగ్‌పై చర్చించనున్నారు.

రెండో రోజు శాంతిభద్రతలు

శాంతిభద్రతల అంశంపై రెండో రోజు కీలక చర్చ జరగనుంది. సదస్సులో తొలుత సంజీవని ప్రాజెక్టు, వేసవి ప్రణాళికలపై వైద్య, ఆరోగ్యశాఖ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. తర్వాత 'సూపర్‌సిక్స్' పథకాల అమలుపై చర్చిస్తారు. జిల్లాల అభివృద్ధి, వాటికి ర్యాంకులపై సీఎస్ సాయిప్రసాద్ వివరించనున్నారు. ఆ తర్వాత విద్యాశాఖపై చర్చిస్తారు. అనంతరం, న్యాయశాఖ అంశాలపై ప్రత్యేక చర్చ జరగనుంది. ఆ తర్వాత శాంతి భద్రతలపై చర్చ ఉంటుంది. జిల్లా కలెక్టర్‌లతోపాటు ఎస్పీలు, హోంశాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, జిల్లాల వారీగా శాంతిభద్రతల నిర్వహణపై ఎస్పీలు ప్రజెంటేషన్ ఇస్తారు. చివరగా సీఎం చంద్రబాబు కలెక్టర్‌లు, ఎస్పీలకు దిశానిర్దేశం చేయనున్నారు.

వీటి సంగతేంటి?

కలెక్టర్ల సదస్సులో చర్చించే అజెండా కీలకం. జరిగిన అభివృద్ధి, జిల్లాల్లో పాలనా వ్యవహారాలు, రానున్నకాలంలో అనుసరించాల్సిన వ్యూహాలను దిశానిర్దేశం చేసేలా సదస్సు నిర్వహిస్తున్నారు. కానీ, 7వ విడత సమావేశాల అజెండాను పరిశీలిస్తే కొత్తదనం కనిపించడం లేదు. అంతా రొటీన్ అన్నట్లుగానే అజెండా రూపకల్పన ఉంది. నిజానికి నడి వేసవిలో కలెక్టర్ల సమావేశాలు జరుగుతున్నాయి. ఈసారి ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. కేవలం ఆరోగ్య సమస్యలే కాదు, తాగునీరు, ఇతర ఇబ్బందులు అనేకం తలత్తే అవకాశం ఉంది. ఇలాంటి కీలక అంశాన్ని వైద్య, ఆరోగ్యశాఖ అంశంగా చేర్చి కేవలం కొద్దిపాటి సమయంలో చర్చ ముగించేలా అజెండాను రూపొందించారు. వేసవిని ఎదుర్కొనే కార్యాచరణ పక్కాగా ఉండాలి. దీనిలో అనేక శాఖలు కలిసి పనిచేసే అంశాలు ఉంటాయి. గత సదస్సులలో ప్రభుత్వం కీలక నిర్ణయ తీసుకుంది. ప్రతి కలెక్టర్ గ్రామాల పర్యటనకు వెళ్లాలని, 'పల్లె నిద్ర' చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ అంశంపై రెవెన్యూశాఖ ఓ నివేదిక తయారు చేసి, ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసి దానిలో పొందుపరచాలని సీఎం ఆదేశించారు. ఇప్పటి వరకు రెవెన్యూశాఖ నుంచి ఈ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. తాజా సదస్సులో అయినా ఈ అంశంపై చర్చిస్తారో లేదో చూడాలి.

ఆర్టీఈ రెండో విడతలో 10,453 సీట్లు కేటాయింపు

- విద్యార్థులను చేర్చుకోకపోతే చర్యలు: సమగ్రశిక్ష

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం రెండో విడత లాటరీలో 10,453 మంది విద్యార్థులకు అడ్మిషన్లు లభించాయి. దీనిపై సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీఈ అడ్మిషన్లకు మొత్తం 54,647 మంది దరఖాస్తు చేసుకోగా, 54,016 మందిని అర్హులుగా గుర్తించారు. మొదటి విడత లాటరీలో ఒక కిలోమీటరు పరిధిలో 30,075 మందికి అడ్మిషన్లు లభించాయి. 1 నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో పాఠశాలలకు రెండో విడతలో ఇప్పుడు నిర్వహించిన లాటరీలో 10,453 మందికి అవకాశం లభించింది. తల్లిదండ్రుల ఫోన్లకు అడ్మిషన్ల సమాచారం పంపారు. విద్యార్థి, తల్లి లేదా తండ్రి ఆధార్ కార్డులు, ఆదాయ, కుల, పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు వివరాలతో ఈనెల 6 నుంచి 17లోపు సంబంధిత పాఠశాలల్లో ప్రవేశాలను నిర్ధారించుకోవాలని సమగ్రశిక్ష సూచించింది. ఇతర వివరాలకు 18004258599 టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేసింది.

గంగమ్మ జాతరలో జంతు బలులు ఆపండి

- సీఎం చంద్రబాబుకు మేనకా గాంధీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మే 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా నిర్వహించే జంతు బలులను అరికట్టాలని సీఎం చంద్రబాబుకు కేంద్ర మాజీ మంత్రి, జంతు సంరక్షకురాలు మేనకాగాంధీ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆమె చంద్రబాబుకు లేఖ రాశారు. మే 18,19 తేదీల్లో తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద భారీ ఎత్తున జంతు బలులు జరగనున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిని వెంటనే నిలిపివేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జంతు బలులను పూర్తిగా నిషేధించారని, కర్ణాటకలో కూడా బలులకు బదులుగా కొబ్బరికాయలు కొట్టేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

విశాల్ గున్నీకి హైకోర్టులో ఎదురుదెబ్బ





- క్యాట్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన ధర్మాసనం
- ఈ విషయంలో లోతైన విచారణ అవసరమని వ్యాఖ్య
- తదుపరి విచారణ ఆగస్టు 29కి వాయిదా

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసి, తక్షణం విధుల్లోకి తీసుకొని, పోస్టింగ్ ఇవ్వాలని గత ఏడాది ఆగస్టు 29న క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం నిలుపుదల చేసింది. తదుపరి విచారణ తేదీ వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడింది. క్యాట్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఆగస్టు 29కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తుహిన్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ముంబై సినీనటి కాదంబరి జత్వానీ అక్రమ అరెస్ట్, అధికార దుర్వినియోగం, తదితర కారణాలతో ఐపీఎస్ అధికారి విశాల్ గున్నిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్‌లో ఉంచిన విషయం తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ విశాల్ గున్ని క్యాట్‌ను ఆశ్రయించారు. సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసి, విధుల్లోకి తీసుకొని పోస్టింగ్ ఇవ్వాలని, ఆయనకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు కల్పించాలని క్యాట్ ఉత్తర్వులు ఇచ్చింది. క్యాట్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర సీఎస్, డీజీపీ గత ఏడాది అక్టోబరులో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా రాష్ట్ర సీఎస్, డీజీపీ తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... సినీనటి జత్వాని, కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే పక్క రాష్ట్రానికి వెళ్లి అరెస్టుకు ప్రణాళిక రచించారని, విధి నిర్వహణలో తీవ్ర దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని వివరించారు. సస్పెన్షన్ ఉత్తర్వుల చెల్లుబాటు విషయానికే క్యాట్ పరిమితం కాకుండా, క్రిమినల్ కేసు విచారణ అంశాల్లోకి వెళ్లిందన్నారు. కాలపరిమితి ముగియకముందే సస్పెన్షన్ ఉత్తర్వులను క్యాట్ రద్దు చేసిందని, దీంతో విచారణలో ముందుకు వెళ్లలేకపోయామన్నారు. క్యాట్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరారు. విశాల్ గున్ని తరపున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పిటిషనర్ వేరే రాష్ట్రానికి వెళ్లి, అక్కడి పోలీసులతో సంప్రదింపులు జరిపారు తప్ప, అరెస్ట్ ప్రక్రియలో పాల్గొనలేదన్నారు. 2024లో సస్పెండ్ చేశారని, ఆ ఉత్తర్వుల గరిష్ఠ కాలపరిమితి ఏడాది మాత్రమేనని చెప్పారు. ఇప్పటివరకు విచారణాధికారిని నియమించలేదన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే క్యాట్ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. వీటిలో జోక్యం చేసుకోవద్దని కోరారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. వ్యాజ్యంపై లోతైన విచారణ అవసరమని అభిప్రాయపడింది. క్యాట్ ఉత్తర్వుల అమలును తదుపరి విచారణ వరకు సస్పెండ్ చేసింది.

పాలీసెట్‌లో 91.37% ఉత్తీర్ణత

- 16 మందికి 120కి 120 మార్కులు.. గోదావరి జిల్లాలకే ఎక్కువ ర్యాంకులు
- ఈ ఏడాది భారీగా పెరిగిన అభ్యర్థులు.. గతేడాది కంటే తగ్గిన ఉత్తీర్ణత శాతం

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలీసెట్-2026లో 91.37 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్ష ఫలితాలను మంగళవారం ఉదయం 10.30 గంటలకు మంత్రి లోకేశ్ 'ఎక్స్' ద్వారా విడుదల చేశారు. ఏప్రిల్ 25న నిర్వహించిన పరీక్షకు ఈసారి రికార్డు స్థాయిలో 1,77,581 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1,63,008 మంది పరీక్షకు హాజరవగా 1,48,950 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలికలు 93.57 శాతం మంది, బాలురు 89.88 శాతం మంది అర్హత సాధించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 99.11 శాతం మంది, పోలవరం జిల్లాలో 95.46 శాతం మంది, ప్రకాశం జిల్లాలో 94.72 శాతం మంది అర్హత సాధించారు. శ్రీసత్యసాయి జిల్లా 87.85 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచింది. పాలీసెట్‌ను 120 మార్కులకు నిర్వహించగా మొత్తం 16 మంది విద్యార్థులు 120 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. వీరిలో తమరాల సాయి విష్ణుతేజ, తోట మానస, పిండి జేవీ నరసింహస్వామి, ముల్లు రోహిత్, కొప్పర్తి ఎస్ఎస్‌వీ కృష్ణచైతన్య, తోలేటి బి.దియా, రెడ్డి వరుణ్‌కుమార్, భీమిరెడ్డి వీవీ యశ్వంత్, సంగినీడి జైరామ్ (పశ్చిమగోదావరి), జామి చేతన్, శీలం హిమచంద్ర, గొర్లె బాలాదిత్య (విశాఖపట్నం), దామోదరం గౌతమ్, దిరిశాల ఎస్ఎస్ హిమసూర్య (తూర్పుగోదావరి), పూడి చైతన్య (కాకినాడ), వెల్దుర్తి మోక్షిత్ (తిరుపతి) ఉన్నారు.

భారీగా పెరిగిన అభ్యర్థులు

ఈ ఏడాది డిప్లొమా కోర్సులకు పోటీ భారీగా పెరిగింది. గతేడాది 1,39,840 మంది పాలీసెట్ రాయగా ఈసారి 1,63,008 మంది పరీక్షకు హాజరయ్యారు. గతేడాది 1,33,358 మంది అర్హత సాధించగా, ఈ ఏడాది 1,48,950 మంది ఉత్తీర్ణులయ్యారు. అయితే గతేడాది ఉత్తీర్ణత శాతం 95.36 శాతం నమోదవగా ఈసారి అది 91.37 శాతానికి తగ్గింది. గతేడాది రాష్ట్రంలో 82,870 సీట్లు అందుబాటులో ఉండగా ఈ ఏడాది వాటి సంఖ్య 84,130కు పెరిగింది. సీట్ల సంఖ్యకు రెట్టింపు మంది ప్రవేశ పరీక్ష రాస్తున్నా డిప్లొమా కోర్సుల్లో చేరుతున్న వారి సంఖ్య మాత్రం తక్కువగానే ఉంటోంది. దీంతో ఏటా సీట్లు మిగిలిపోతున్నాయి. ఈ ఏడాది పరీక్ష రాసిన విద్యార్థులు భారీగా పెరగడంతో మొత్తం సీట్లు భర్తీ కావొచ్చని ఉన్నత విద్యాశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

గిరిజన జిల్లాల్లో ఉత్తమ ఫలితాలు: లోకేశ్

పాలీసెట్‌లో గిరిజన జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామ రాజు, పోలవరం, పార్వతీపురం మన్యం జిల్లాలు అగ్రస్థానంలో నిలిచాయని తెలిపారు. అర్హత సాధించిన వారిలో బాలికలు ఎక్కువమంది ఉండటం మహిళా సాధికారత సాధించే దిశగా తమ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు.

ఇంటర్‌లో తక్కువ ఉత్తీర్ణతపై చర్యలు

- జేఎల్స్‌కు షోకాజ్ నోటీసులు... గెస్ట్ ఫ్యాకల్టీ తొలగింపు
- 50 కాలేజీల ప్రిన్సిపాళ్లతో ఇంటర్ బోర్డు కార్యదర్శి సమీక్ష

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో అతి తక్కువ ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫ్యాకల్టీపై ఇంటర్ విద్యా మండలి చర్యలకు దిగింది. ఆయా సబ్జెక్టుల జూనియర్ లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీని పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా 50 ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాళ్లతో ఇంటర్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా మంగళవారం బోర్డు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తక్కువ ఉత్తీర్ణత సాధించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు రోజూ తరగతులకు హాజరు కాకపోవడం, సకాలంలో సిలబస్ పూర్తి చేయకపోవడం, రివిజన్ టెస్టుల నిర్వహణలో నిర్లక్ష్యం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా గుర్తించారు. క్షేత్రస్థాయిలో బోధనపై ప్రిన్సిపాళ్ల పర్యవేక్షణ లోపించిందని కార్యదర్శి అభిప్రాయపడ్డారు. సబ్జెక్టు లెక్చరర్లతో పాటు కాలేజీ ప్రిన్సిపాళ్లు కూడా వ్యక్తిగతంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ప్రారంభం నుంచే క్వశ్చన్ బ్యాంక్‌లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ సమీక్షలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సైమన్ విక్టర్ పాల్గొన్నారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులు నిలుపుదల చేయలేం

- ఉత్తర్వుల్లోని ఆ అంశాన్ని పట్టించుకోవద్దు
- సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌కు ధర్మాసనం ఆదేశం
- అహ్మద్‌బాబు అప్పీల్‌పై హైకోర్టు ధర్మాసనం విచారణ

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి అహ్మద్‌బాబు శాఖాధిపతిగా ఉన్న వాణిజ్య పన్నుల శాఖ, ఇతర శాఖల్లో ఏదీ సవ్యంగా లేనట్లు కనిపిస్తోందని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో చేసిన అబ్జర్వేషన్‌ను పట్టించుకోకుండా ఉద్యోగుల సంఘం ఇచ్చిన వినతిపై తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌ను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించాలన్న అహ్మద్‌బాబు అభ్యర్థనను తోసిపుచ్చింది. అహ్మద్‌బాబు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను జూలైకి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. పన్ను వసూళ్లలో అక్రమాలకు పాల్పడ్డారని, ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకుండా వేధిస్తున్న చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్(సీసీఎస్‌టీ) అహ్మద్‌బాబుపై చర్యలు తీసుకొనేలా కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌ను ఆదేశించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి... ఐఏఎస్ అధికారి అహ్మద్‌బాబు శాఖాధిపతిగా ఉన్న రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ, ఇతర శాఖల్లో ఏదీ సవ్యంగా లేనట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.

అక్కడ దశాబ్దాలుగా రామాలయం

- రామాలయం నిర్మాణ అనుమతులపై వ్యాజ్యం కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో రామాలయం నిర్మాణాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తున్న వారికి హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. రామాలయం నిర్మాణానికి జిల్లా కలెక్టర్ నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) జారీ చేయడం, తదనుగుణంగా నగర పంచాయతీ కమిషనర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ పెదపేటకు చెందిన వంగా జ్యోత్స్న మరో ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు కొట్టివేసింది. విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రామాలయం నిర్మించ తలపెట్టిన స్థలం విషయంలో వివాదం ఎక్కడుందని పిటిషనర్లను ప్రశ్నించింది. రెవెన్యూ రికార్డులు, ఆధారాలను పరిశీలిస్తే ఎనిమిది దశాబ్దాలకు పైగా అక్కడ రామాలయం ఉన్నట్లు స్పష్టమౌతోందని పేర్కొంది. రెవెన్యూ రికార్డుల్లో సంబంధిత భూమిని ప్రభుత్వ పోరంబోకుగా, పట్టాదార్ కాలమ్‌లో గుడికి చెందినదిగా పేర్కొన్నారని తెలిపింది. స్థలానికి ఆనుకుని ఉన్న మరో భూమికి సంబంధించిన ఇన్‌కంబరెన్స్ సర్టిఫికెట్‌ను పరిశీలిస్తే ఉత్తరం వైపు హద్దు రామాలయం ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో అక్కడ రామాలయం ఉన్నట్లు స్పష్టమౌతోందని తేల్చి చెప్పింది. తహసీల్దార్, ఆర్డీవో నివేదికలు, రెవెన్యూ రికార్డులు పరిశీలించిన తర్వాతే రామాలయం నిర్మాణానికి కలెక్టర్ ఎన్‌వోసీ జారీ చేశారని తెలిపింది. గత 80ఏళ్లుగా రామాలయం ఉన్న స్థలంలోనే నిర్మాణం చేపడుతున్నారని, దానిని ఆక్రమణగా పరిగణించలేమని పేర్కొంది. ఈ నేపథ్యంలో వాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులిచ్చారు. కాగా, ప్రభుత్వ భూమిలో మతపరమైన నిర్మాణం జరపడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పిటిషనర్ జ్యోత్స్నతరపు న్యాయవాది జడశ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

పాస్టర్ల ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల రద్దుకు ఆదేశించండి

హైకోర్టులో పిటిషన్

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్న పాస్టర్ల ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్నతాధికారులకు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లా కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. విచారణను జూలై 6కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పాస్టర్లుగా పనిచేస్తూ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారి సర్టిఫికెట్లు రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ షెడ్యూల్డ్‌కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దిరెడ్డి ప్రసన్నకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బాప్తిజం తీసుకున్నవారి పేర్లను నమోదు చేసేందుకు వీలుగా చర్చిలవద్ద రిజిస్టర్లు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.ఈవ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపించారు. చింతాడ ఆనంద్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పాస్టర్లు ఎస్సీ సర్టిఫికెట్లు కలిగి ఉండడానికి వీల్లేదన్నారు.

జోన్ వచ్చిందోచ్

విశాఖ ముడసర్లోవలో రైల్వే జోన్ కార్యాలయ భవన నిర్మాణ పనులు



(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరాంధ్ర ప్రజలు రాజకీయాలకు అతీతంగా సుదీర్ఘ పోరాటం చేశారు. రాష్ట్ర విభజన తరువాత ప్రత్యేక రైల్వే జోన్ లేకుండానే ఆంధ్రప్రదేశ్ ఇన్నాళ్లూ నడిచింది. ప్రధాని నరేంద్ర మోదీ 2019 ఎన్నికల ప్రచారంలో విశాఖపట్నం వచ్చినపుడు రైల్వే జోన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని హామీ అమలు కావడానికి ఏడేళ్ల సమయం పట్టింది. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించిన తరువాత ప్రధాన కార్యాలయం నిర్మాణానికి అప్పట్లో కేంద్ర ప్రభుత్వం రూ.150 కోట్ల వరకు మంజూరుచేసింది. అయితే అవసరమైన భూముల కేటాయింపులో నాటి వైసీపీ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది. ఒక విధంగా రైల్వే జోన్ కార్యకలాపాలు ముందుకువెళ్లకుండా మోకాలడ్డు పెట్టిందనే చెప్పాలి. విశాఖపట్నంలో బీఆర్‌టీఎస్ రహదారులకు, ఇతర అవసరాలకు రైల్వేకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకుంది. వాటికి ప్రత్యామ్నాయంగా ముడసర్లోవలో 52.2 ఎకరాలు కేటాయించింది. నగరానికి దూరంగా ప్రశాంతంగా ఉండే ఆ భూముల్లోనే రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. అయితే ఆ భూముల్లో అప్పటికే ఆక్రమణదారులు ఉన్నారు. రైల్వే అధికారులు ఆ భూముల్లోకి వెళ్లినప్పుడల్లా రైతులు అడ్డుకునేవారు. దాంతో పనులు ముందుకుసాగలేదు. ఆక్రమణదారులను అక్కడి నుంచి పంపించి భూములు అప్పగించడంలో నాటి వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. ఈ క్రమంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఒకసారి విశాఖపట్నం రాగా బీజేపీ నాయకులు రైల్వే జోన్ కార్యాలయం పనులు ప్రారంభించాలని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ నాటి జిల్లా కలెక్టర్ మల్లికార్జునను పిలిచి, రైల్వేకు భూములు ఇస్తే వారం రోజుల్లోనే పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. అయినా వైసీపీలో వీసమెత్తు చలనం రాలేదు. భూమి అప్పగించలేదు.

కూటమి రాగానే ట్రాక్‌పైకి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైల్వే జోన్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ముడసర్లోవ భూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో ఆ గ్రామం సర్వే నంబర్లు 57, 58, 59/1, 61/1, 62, 63, 64, 65 (పాత సర్వే నంబరు26)లలో 52.22 ఎకరాల భూమిని అదే ఏడాది ఆగస్టు నెలాఖరున రైల్వే అధికారులకు దగ్గరుండి ఇప్పించింది. ఆ భూమిని మ్యుటేషన్ ద్వారా రెవెన్యూ రికార్డుల్లో రైల్వే శాఖపై మార్పు చేసింది. దీనికోసం కలెక్టర్ 542/2024 నంబరుతో ఆగస్టు 30న ప్రొసీడింగ్స్ జారీచేశారు. జోన్ కార్యాలయ భవన నిర్మాణానికి 2025 జనవరి 8న ప్రధాని నరేంద్రమోదీతో శంకుస్థాపన చేయించారు. ఇన్ని జరిగినా కొత్త జోన్ ఆపరేషన్‌కు అవసరమైన గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంలో తాత్సారం చేశారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గత నెల 28న గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన నిమిత్తం విశాఖపట్నం వచ్చినప్పుడు దీనిపై స్పందించారు. జూన్ ఒకటో తేదీ నుంచి జోన్ ఆపరేషన్ ప్రారంభిస్తామని సభలో ప్రకటించారు. వారం రోజులు తిరక్కుండానే నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో ఇప్పుడు విశాఖపట్నం కేంద్రంగా 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' పనిచేయడానికి పూర్తి అనుమతి లభించినట్టయింది.

విశాఖ నుంచే కేకే లైన్ నిర్వహణ

కొత్తగా ఏర్పాటైన రాయగడ డివిజన్ పరిధిలో చేర్చిన కొత్తవలస-కిరండూల్ (కేకే లైన్), కొరాపుట్-రాయగడ (కేఆర్) లైన్ నిర్వహణ పనులను విశాఖపట్నం డివిజన్ అధికారులే చూస్తారని రైల్వే వర్గాలు మంగళవారం తెలిపాయి. కొందరు కేకే లైన్ విశాఖ డివిజన్‌లోనే ఉంచారంటూ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో రైల్వే వర్గాలు ఈ వివరణ ఇచ్చాయి.

మిన్నంటిన సంబరాలు

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన నేపథ్యంలో టీడీపీ నాయకులు మంగళవారం స్టేషన్ వద్ద సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ సాకారమైందన్నారు.



విశాఖ రైల్వే స్టేషన్ ఎదుట కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు తదితర టీడీపీ నేతలు

గెజిట్‌లోనే పరిధి..

రైల్వే జోన్ పరిధి, అందులో డివిజన్లు, వాటి పరిధి మొత్తం గెజిట్ ద్వారానే వెల్లడిస్తారు. అది విడుదలైతేనే అధికారుల నియామక ప్రక్రియ వేగవంతం అవుతుంది. సోమవారం రాత్రి విడుదల చేసిన గెజిట్‌లో కొత్త రైల్వే జోన్ పరిధి, అందులో డివిజన్లు, వాటి విస్తృతిని వివరించారు. కొత్త డివిజన్ల ఏర్పాటు, పాత డివిజన్లలో మార్పులపై పూర్తి స్పష్టత ఇచ్చారు.

ఇదీ రాయగడ డివిజన్

కొరాపుట్-సింగపూర్ రోడ్ - 164 కి.మీ.

కొత్తవలస (స్టేషన్ మినహాయించి)-కిరండూల్ (కేకే లైన్) 442 కి.మీ.

కూనేరు (స్టేషన్ మినహాయించి)-తెరువలి (మినహాయించి) 36 కి.మీ.

గుణుపూర్ (స్టేషన్ కలుపుకొని)-పర్లాకిమిడి (స్టేషన్ కలుపుకొని) 54 కి.మీ...

మొత్తం 696 కి.మీ. రైల్వేలైన్‌తో రాయగడ డివిజన్ ఏర్పాటుచేశారు.

విశాఖపట్నం డివిజన్

వాల్తేరు డివిజన్‌ను రెండుగా విభజించడం వల్ల 'విశాఖపట్నం డివిజన్' విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. రాయగడ 696 కిలోమీటర్లతో ఏర్పాటు కాగా విశాఖ డివిజన్‌కు 463 కి.మీ.మాత్రమే దక్కింది.

ఇచ్ఛాపురం - పలాస - విశాఖపట్నం - దువ్వాడ 270 కి.మీ.

విజయనగరం-కూనేరు 102 కి.మీ.

నౌపడ జంక్షన్-పర్లాకిమిడి 39 కి.మీ.

బొబ్బిలి జంక్షన్-సాలూరు 17 కి.మీ.

వీటితో పాటు సింహాచలం నార్త్-దువ్వాడ బైపాస్, వడ్లపూడి-దువ్వాడ, విశాఖపట్నం-జగ్గయ్యపాలెం వరకు 35 కి.మీ. సెక్షన్లను విశాఖ డివిజన్‌లో ఉంచారు. దీనికి తోడు తూర్పు కోస్తా జోన్‌లోని ఖుర్దా డివిజన్‌లో ఉన్న పలాస-ఇచ్ఛాపురం సెక్షన్ 53 కిలోమీటర్లను విశాఖపట్నం డివిజన్‌లో చేర్చారు.

ఇదీ దక్షిణ కోస్తా జోన్..

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఉన్న గుంతకల్, గుంటూరు, విజయవాడ డివిజన్లు; తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో ఉన్న వాల్తేరు డివిజన్‌లో విడగొట్టిన భాగం కలిపి దక్షిణ కోస్తా రైల్వే జోన్‌గా ఏర్పాటుచేశారు.

వాల్తేరు డివిజన్ రెండుగా విభజన

వాల్తేరు డివిజన్‌ను రెండు భాగాలు చేశారు. అందులో ఒక భాగంతో కొత్తగా 'రాయగడ డివిజన్' ఏర్పాటు చేసి తూర్పు కోస్తా రైల్వేజోన్‌లో కలిపారు. మిగిలిన రెండో భాగాన్ని 'విశాఖపట్నం డివిజన్'గా నామకరణం చేసి కొత్త జోన్‌లో ఉంచారు. రాయగడ డివిజన్ ఆపరేషన్‌కు కూడా కొత్త జోన్‌తో పాటే గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేశారు.

ఆ డివిజన్ల నుంచి విభజన


సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న గుంతకల్, గుంటూరు డివిజన్ల నుంచి కొన్ని భాగాలను సికింద్రాబాద్‌కు మార్చారు. రాయచూర్-వాడి వరకు 108 కిలోమీటర్ల గుంతకల్ డివిజన్ నుంచి సికింద్రాబాద్‌కు, విష్ణుపురం-పగిడిపల్లి-జనపహాడ్ వరకు 142 కి.మీ. గుంటూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్‌కు, కొండపల్లి-మోటమర్రి వరకు 46 కి.మీ. సికింద్రాబాద్ డివిజన్ నుంచి విజయవాడ డివిజన్‌కు మారుస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు.

'ది డెక్'లో తాత్కాలిక కార్యాలయం

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాల కోసం రైల్వే మంత్రిత్వ శాఖ పూర్తి ఏర్పాట్లు చేసింది. విశాఖ ముడసర్లోవలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 52.2 ఎకరాల్లో 12 అంతస్థుల భవన నిర్మాణానికి గత ఏడాది జనవరి 8న శంకుస్థాపన చేయగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.150 కోట్లతో చేపట్టిన ఈ పనులు 2027 చివరికి పూర్తిచేయాల్సి ఉంది. అంతవరకు తాత్కాలిక ఆపరేషన్ల కోసం సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన 'ది డెక్' భవనంలో రెండు అంతస్థులను అద్దెకు తీసుకుంది. అందులో సుమారు 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటీరియర్ పనులు కూడా 6 నెలల క్రితమే పూర్తిచేసింది. రైల్వే జోన్ నిర్వహణకు 12 విభాగాలు కీలకం. జనరల్ అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్లు, కమర్షియల్, సిగ్నల్ అండ్ టెలికం, స్టోర్స్, పర్సనల్, ఫైనాన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్, పబ్లిక్ రిలేషన్స్, సెక్యూరిటీ, ఎలక్ట్రికల్ జనరల్ విభాగాలు ఉంటాయి. వీటికి విభాగాధిపతులను, వారి కింద పనిచేయడానికి వివిధ డివిజన్లలో పనిచేస్తున్న వారిని కేటాయిస్తారు. విశాఖ జోన్‌లో పనిచేయడానికి ఆసక్తి కలిగినవారు దరఖాస్తు చేయాలని ఇటీవల రైల్వే అధికారులు కోరగా సుమారు మూడు వేల మంది ఆసక్తి చూపించడం విశేషం. వీరిలో అత్యధికులు ఒడిశా, సికింద్రాబాద్‌లలో పనిచేస్తున్న వారే కావడం గమనార్హం. కొత్త రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌గా ఏడాది క్రితమే సందీప్ మాథుర్‌ను కేంద్రం నియమించింది. ఆయనతో పాటు ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ప్రిన్సిపల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌ని నియమించారు.

రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది

- విశాఖ రైల్వే జోన్‌పై సీఎం చంద్రబాబు



అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ రైల్వే శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'నూతనంగా ఏర్పాటైన విశాఖ డివిజన్, రాయగడ డివిజన్ మధ్య సమన్వయంతో రైల్వే వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర ఆశలు సాకారమవుతున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయడం అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు.

14న క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 14న అమరావతిలోని సచివాలయంలో జరగనుంది. ఈ భేటీలో చర్చించే అంశాలను ఆయా శాఖలు 13వ తేదీ ఉదయం 11 గంటలలోపు పంపాలని ప్రభుత్వం కోరింది.

బీజేపీపై నమ్మకంతోనే పట్టం కట్టారు: మాధవ్

విద్యాధరపురం, మే 5(ఆంధ్రజ్యోతి): బీజేపీపై ఉన్న నమ్మకంతో 3 రాష్ట్రాల్లో ప్రజలు ఈ ఎన్నికల్లో పట్టం కట్టారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. మంగళవారం విజయవాడలో విజయోత్సవాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య బీజేపీ కార్యకర్త వారధిలా పని చేయాలని మాధవ్ దిశానిర్దేశం చేశారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యశాలలో మాట్లాడుతూ.. 'ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు జనతా వారధి చేపట్టాం.. అందులో ఎంతమేరకు ఫలితాలు సాధిస్తే అంతగా పార్టీ బలోపేతమవుతుంది.' అని తెలిపారు.

స్టీల్ హబ్‌గా ఏపీ

రాష్ట్రంలో భారీగా ముడి ఇనుప ఖనిజం నిల్వలు

- 17 బ్లాక్‌ల్లో 2,700 మిలియన్ టన్నులు
- దాని విలువ రూ. 2.40 లక్షల కోట్లకు పైనే
- మైనింగ్ మొదలైతే ఏటా 110 టన్నుల ఉత్పత్తి
- 1.90 లక్షల కోట్ల పెట్టుబడులకు చాన్స్
- 1.50 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- గనుల శాఖపై సమీక్షలో సీఎంకు నివేదిక

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంలో భారీగా ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నట్లు గనుల శాఖ నిర్ధారించింది. రాష్ట్రాన్ని స్టీల్ హబ్‌గా మార్చేలా 17 బ్లాకుల పరిధిలో 2.40 లక్షల కోట్ల విలువైన 2,700 మిలియన్ టన్నుల నిల్వలున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష సందర్భంగా కీలక నివేదికను సమర్పించింది. ఓబుళాపురం, మించేరి, గుటుపల్లి, వెల్తుర్తి, కొణిజేడు, లక్ష్మక్కపల్లె (2 బ్లాక్‌లు), అద్దంకివారిపాలెం, వాడేపల్లి, లేటపల్లె, నాగయ్యపల్లె, పగడాలపల్లె, మిన్నయ్యగారిపల్లె, లక్కంవాండ్లపల్లె, శివపురం, సడుకొండ, ఎర్రకొండ ప్రాంతాల్లో ఐరన్‌ఓర్ బ్లాక్‌లను గుర్తించారు. ఇందులో కొణిజేడులో 1307 హెక్టార్లలో ఉన్న ఐరన్ ఓర్ ఏపీఎండీసీ లీజులో ఉంది. లక్ష్మక్కపల్లెలోని రెండు బ్లాక్‌లు, అద్దంకివారిపాలెంలోని ఒక బ్లాక్ జేఎస్‌డబ్ల్యూ కంపెనీ లీజులో ఉంది. వాడేపల్లె-535హెక్టార్లు, లేటపల్లె-1,000 హెక్టార్లు, నాగయ్యపల్లె-239 హెక్టార్లు, పగడాలపల్లె-227 హెక్టార్లు, లక్కంవాండ్లపల్లె 300 హెక్టార్లలో ఉన్న ఐరన్‌ఓర్ లీజులు ఇంకా ఎవ్వరికీ కేటాయించలేదు. ఇందులో ఓబుళాపురంలో 190 హెక్టార్లలో ఉన్న లీజులు వివాదంలో ఉన్నాయి. మొత్తంగా 13 వేల హెక్టార్ల పరిధిలో ఇనుప ఖనిజం నిక్షేపాలున్నట్లు గనులశాఖ స్పష్టత ఇచ్చింది. అన్ని చోట్ల మైనింగ్ మొదలైతే ఏటా కనీసం 110 మెట్రిక్ టన్నుల మేర ఇనుప ఖనిజం బయటకు తీయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అయితే, ఇందులో 80 శాతం బ్లాకులు రిజర్వ్‌ఫారెస్ట్‌లో ఉన్నాయి. ఇక్కడ మైనింగ్ చేయాలంటే, ఆ మేరకు సమానమైన భూమిని అటవీశాఖకు కేటాయించాల్సి ఉంది. ఈ విషయంలో విధాన నిర్ణయాలు తీసుకోవాలని గనులశాఖ కోరింది. గుర్తించిన 17 బ్లాక్‌ల్లో మైనింగ్ మొదలయితే రాష్ట్రంలో కనీసం రూ. 1.90 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. 1.50 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని నివేదించారు.



మరిన్ని నిక్షేపాలను గుర్తించండి

ఇప్పటికే గుర్తించిన బ్లాక్‌ల లీజుల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రాన్ని స్టీల్‌హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముడి ఇనుప ఖనిజం మైనింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అరుదైన ఖనిజాల మిషన్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. కాగా, బెరైటీస్ ఎగుమతులపై కేంద్రం ఇటీవలి కాలంలో విధించిన నియంత్రణ, నిషేధం వల్ల ఆదాయం తగ్గుతుందని, రాష్ట్రంలో చిన్న కంపెనీలపై తీవ్ర ప్రభావం పడి కార్మికులకు ఉపాధి లేకుండా పోతోందని అధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేంద్రంతో చర్చిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కాగా, గనుల శాఖ ఆదాయం 2025-26లో కొంత పెరిగింది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ. 3,416 కోట్లకు ఆదాయం చేరింది. ఈ నేపథ్యంలో 2026-27 సంవత్సరానికి రూ. 4,650 కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. సమావేశంలో ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




నాబార్డు రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, అధికారులు

ఉద్యాన రంగానికి ఊతమివ్వండి

- బ్యాంకులు, నాబార్డును కోరిన సీఎం
- 5.11 లక్షల కోట్లతో రుణ ప్రణాళిక

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యాన రంగాన్ని ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనలకు మద్దతుగా నిలవాలని బ్యాంకులు, నాబార్డు ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఏడాదికి 450 లక్షల టన్నుల ఉద్యాన ఉత్పత్తులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్(నాబార్డు) 'క్రెడిట్ ప్లాన్ స్టేట్ ఫోకస్'ను సీఎం ఆవిష్కరించారు. 2026-27కు రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో నాబార్డు రూపొందించిన అంచనా పత్రాన్ని ఆయన విడుదల చేశారు. దీనిలో సాగు రంగానికి రూ.2.55 లక్షల కోట్లు కేటాయించారు. దీనిలో.. పంట రుణాలకు రూ.1.66 లక్షల కోట్లు, పశుసంవర్ధక రూ.34,972 కోట్లు, మత్స్య శాఖకు రూ.21,098 కోట్లు,ఉద్యానశాఖకు రూ.11,961 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు ఇస్తారు. ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఉద్యాన వనాల అభివృద్ధికి రూ.5,313 కోట్లు, వ్యవసాయ మౌలి క సదుపాయాలకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లు కేటాయిస్తారు. ఎంఎస్‌ఎంఈలకు రూ.1.64 లక్షల కోట్లు ప్రతిపాదించారు. నాబార్డు సీజీఎం ఎమ్మార్ గోపాల్, జీఎంకేవీఎస్ ప్రసాద్, ఎస్‌ఎల్‌బీసీ, ఎస్బీఐ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



గుడిని తలపించేలా..!

ఏలూరు రైల్వే స్టేషన్‌కు కొత్త శోభ

మీరు చూస్తున్నది గుడి అనుకుంటే పొరబడినట్లే! ఆహ్లాదకర వాతావరణంలో అచ్చం గుడి గోపురాన్ని తలపిస్తున్న ఈ నిర్మాణం.. ఏలూరు రైల్వే స్టేషన్ ముఖద్వారం అంటే నమ్మక తప్పదు! అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఈ రైల్వేస్టేషన్‌ను కోట్లాది రూపాయలతో ఆధునికీకరిస్తున్నారు. ఇందులోభాగంగా.. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాను ప్రతిబింబించేలా రూపొందించారు. ఇక స్టేషన్ లోపల గోడలపై రూపొందించిన ప్రత్యేక చిత్రాలు ప్రయాణికులను ఆకట్టుకున్నాయి. ఆధునిక సదుపాయాలు, విశాలమైనా వెయిటింగ్ హాల్స్ లిఫ్టులు, పార్కింగ్, మెరుగైన లైటింగ్‌తో చిన్న తిరుపతి వైభవాన్ని గుర్తుచేసేలా ఏలూరు రైల్వే స్టేషన్‌కు కొత్త శోభ వచ్చింది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ (ఏలూరు)

మనసులు గెలవండి

- ప్రజలే మనల్ని మళ్లీ మళ్లీ గెలిపిస్తారు
- ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే
- తమిళనాట ఒక్క ఓటుతోనూ గెలిచారు
- టీడీపీ కార్యకర్తలతో లోకేశ్ 'కాఫీ కబుర్లు'

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): టీడీపీలో వ్యక్తులు శాశ్వతం కాదని, పార్టీ శాశ్వతమని టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ అన్నారు. పార్టీ శ్రేణులు ఏమైనా సమస్యలుంటే అంతర్గత వేదికలపై మాట్లాడి పరిష్కరించుకోవాలని, బహిరంగ వేదికలు ఎక్కవద్దని సూచించారు. ప్రజల్లో పార్టీ ప్రతిష్ఠను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వివిధ కారణాలతో నాయకత్వంపై అలిగి, ఇంట్లో పడుకోవడం వల్ల అంతిమంగా పార్టీ నష్టపోతుందని హితవు పలికారు. అమరావతి ఉండవల్లి నివాసంలో మంగళవారం సాయంత్రం టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో నిర్వహించిన కాఫీ కబుర్లు కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. "మనం చేసిన అభివృద్ధి-సంక్షేమం ప్రజలకు వివరించండి, అహంకారం వీడి సత్ప్రవర్తన, మంచి మాటలతో ప్రజల మనసులను గెలవండి. ప్రజలే మనల్ని మళ్లీ మళ్లీ గెలిపిస్తారు' అని లోకేశ్ పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో గొడ్డలి పార్టీ 151 నుంచి 11 సీట్లకు దిగజారడానికి వారి అహంకారమే కారణమన్నారు. చంద్రబాబు వద్ద కోటరీలు లేవని, సామాన్య కార్యకర్త సైతం నేరుగా ఆయనను కలిసి సమస్యలు చెప్పుకొనే అవకాశం ఉందన్నారు. ప్రతి వారం చంద్రబాబు లేక తాను కేంద్ర కార్యాలయంలో క్యాడర్‌కు అందుబాటులో ఉంటామన్నారు. "ప్రస్తుతం దేశంలో రూ.4 వేలు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రం కూడా ఇదే. ఓ వైపు సంక్షేమాన్ని అమలు చేస్తూనే పోలవరం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేసుకుంటున్నాం. అమరావతి పనులను, రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధిని పరుగులెత్తిస్తున్నాం. అందువల్ల నెగిటివ్ ఆలోచనలు వద్దు. తమిళనాడు ఎన్నికల్లో ఒక్క ఓటుతో గెలిచిన ఎమ్మెల్యే కూడా ఉన్నారు. 2027లోగా రాష్ట్రం లో అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తా. చంద్రబాబు, నేను పర్యటనలకు మా సొంత వాహనాలనే వినియోగిస్తున్నాం అని లోకేశ్ పేర్కొన్నారు.



టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

'మై టీడీపీ' యాప్ కీలకం

"దీర్ఘకాలం అధికారంలో కొనసాగేందుకు బీజేపీ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేస్తున్నాం. మన పార్టీలో 'మై టీడీపీ' యాప్ ఉన్నట్టే, బీజేపీకి సరళ్ యాప్ ఉంది. కేంద్రమంత్రి నుంచి సామాన్య కార్యకర్త వరకు వారు చేసే రోజువారీ పనిని ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 'మై టీడీపీ' యాప్‌లో టాప్ 10 మంది కార్యకర్తలను ప్రతి మూడు నెలలకోసారి కలుస్తాం. ప్రతి నాయకుడి పనితీరును చంద్రబాబు ప్రతి 3 నెలలకోసారి సమీక్షిస్తారు. పనిచేసే వారిని గుర్తించి సముచిత స్థానం కల్పి స్తాం." అని లోకేశ్ భరోసా ఇచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.